

ఆయుష్‌లో పంచాయితీ

- అర్డీడీ, జూనియర్ అసిస్టెంట్ మధ్య వివాదం
- పరస్పరం ఫిర్యాదులు
- ఉన్నతాధికారులు దృష్టిసారించకపోతే ఈ తరహా వ్యవహారాలు మిగిలిన శాఖలకూ విస్తరించే ప్రమాదం

- 6వ పేజీలో



విద్యుత్ లోడు క్రమబద్ధీకరణ

50 శాతం రాయితీ

పంపిణీ సంస్థలకు విద్యుత్ నియంత్రణ మండలి ఆదేశం

- మార్చి 1 నుంచి దరఖాస్తుల స్వీకారం
- జూన్ 30వ తేదీ వరకూ అవకాశం
- గృహ వినియోగదారులకు మాత్రమే...



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి కీలక నిర్ణయం తీసుకుంది. తక్కువ లోడ్‌తో విద్యుత్ కనెక్షన్ తీసుకొని ఎక్కువ విద్యుత్ వినియోగిస్తున్న గృహ వినియోగదారులకు అదనపు లోడును 50 శాతం రాయితీలో క్రమబద్ధీకరించుకునే అవకాశం కల్పించబోతోంది. ఈ మేరకు మార్చి ఒకటో తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరించాలని పంపిణీ సంస్థలకు సూచించింది. పరిమిత కాలం మాత్రమే అందుబాటులో ఉండే రాయితీని అంతా ఉపయోగించుకునేలా ప్రచారం చేయాలని ఆదేశించింది.

- ప్రస్తుతం లోడుకు మించి వినియోగిస్తుండడంతో తరచూ ట్రిప్ అవుతున్న ట్రాన్స్‌ఫార్మర్లు

ఏమిటీ అదనపు లోడు..?

ఇప్పుడు దాదాపు 80 శాతం ఇళ్లలో ఎయిర్ కండిషనర్లు వాడుతున్నారు. వేసవి వస్తోంది. ఒక ఏసీ ఉన్నవారు రెండోది, రెండు ఉన్నవారు మూడోది కొనడానికి యత్నిస్తున్నారు. వీటి వల్ల విద్యుత్ వినియోగం పెరుగుతుంది. సాధారణంగా గృహాలకు కనెక్షన్ తీసుకునే సమయంలో ఎంత విద్యుత్ వాడతారో బల్బులు, ట్యూబ్‌లైట్లు, ఫ్రిజ్, మిక్సర్/గ్రైండర్, వాషింగ్ మెషీన్ తదితరాలకు విద్యుత్ లోడును కిలోవాట్లలో లెక్కించి దాని ప్రకారం సెక్యూరిటీ డిపాజిట్, డెవలప్‌మెంట్ చార్జీలు వసూలు చేస్తారు. అయితే కొంతమంది ఈ ఆర్థిక భారం తగ్గించుకోవడానికి దరఖాస్తులో కేవలం బల్బులు, లైట్లు, మిక్సర్ మాత్రమే చూపిస్తారు. కిలోవాట్ నుంచి రెండు కిలోవాట్లు పర్మిషన్ తీసుకుంటారు. దాంతో తక్కువ మొత్తంతో కనెక్షన్ వస్తుంది. ఇలా చేయడం వల్ల ఆ వీధిలో ఈ లెక్కల ప్రకారమే అందుకు తగిన సామర్థ్యం కలిగిన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేస్తారు. వాస్తవంగా చూసుకుంటే అన్ని ఇళ్లల్లోను వాషింగ్ మెషీన్లు, గీజర్లు, ఏసీలు పనిచేస్తుంటాయి. దాంతో ఆ ట్రాన్స్‌ఫార్మర్‌పై లోడు ఎక్కువై తరచూ ట్రిప్ కావడం, ఒక్కోసారి లోఓల్టేజీ రావడం వంటి సమస్యలు వస్తాయి. గతంలో ఇంటింటికీ తిరిగి ఎక్కువ లోడు ఉన్నట్టయితే అపరాధ రుసుముతో అన్ని ఫీజులు వసూలు చేసేవారు. స్వచ్ఛందంగా ముందుకువస్తే అపరాధ రుసుము లేకుండా కేవలం ఫీజులే తీసుకునేవారు. అయినా చాలామంది అదనపు లోడును క్రమబద్ధీకరించుకోలేదు. ఇప్పుడు వేసవి వస్తోంది. వినియోగం పెరుగుతుంది. దానికి తగ్గట్టుగా అధికారులు ఏర్పాట్లు చేసుకోవాలి. అందుకని గృహ వినియోగదారులు ముందుకు వచ్చి క్రమబద్ధీకరించుకునేలా డెవలప్‌మెంట్ చార్జీలలో 50 శాతం

... మిగతా 6వ పేజీలో


కిలోవాట్‌కు సెక్యూరిటీ డిపాజిట్ రూ.200

- డెవలప్‌మెంట్ చార్జీలు రూ.2,000.. అందులో 50 శాతం రాయితీ

అదనపు విద్యుత్ లోడ్‌ను క్రమబద్ధీకరించుకునే వారి నుంచి అదనపు కిలోవాట్‌కు సెక్యూరిటీ డిపాజిట్‌గా రూ.200 వసూలు చేసే అవకాశం ఉంది. ఉదాహరణకు రెండు కిలోవాట్లకు కనెక్షన్ తీసుకొని ఐదు కిలోవాట్లకు క్రమబద్ధీకరించుకుంటే అదనంగా ఉన్న మూడు కిలోవాట్లకు సెక్యూరిటీ డిపాజిట్‌గా కొత్త రేట్ల ప్రకారం రూ.200 చొప్పున రూ.600 చెల్లించాల్సి ఉంటుంది. ఇక డెవలప్‌మెంట్ చార్జీలకు వస్తే ఇవి కిలోవాట్‌కు రూ.2 వేలు నిర్ణయించినట్టు సమాచారం. అందులో 50 శాతం రాయితీ లభిస్తుంది. అదనంగా మూడు కిలోవాట్లు క్రమబద్ధీకరించుకుంటే రూ.6 వేలులో 50 శాతం రాయితీ పోను రూ.3 వేలు కట్టాల్సి ఉంటుంది. అంటే మొత్తం సెక్యూరిటీ డిపాజిట్, డెవలప్‌మెంట్ చార్జీలు కలిపి రూ.3,600 చెల్లించాల్సి ఉంటుంది. ఈ పథకం మార్చి 1 నుంచి జూన్ 30వ తేదీ వరకు అమలులో ఉంటుంది.

టెన్త్ పరీక్షలకు ఇన్విజిలేటర్ల కొరత

- అనకాపల్లి జిల్లా నుంచి 290 మందిని పంపాల్సిందిగా విద్యాశాఖాధికారి విజ్ఞప్తి



విశాఖపట్నం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 17వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు సరిపడా ఇన్విజిలేటర్లు జిల్లాలో లభ్యం కావడం లేదు. దీంతో పొరుగునున్న అనకాపల్లి జిల్లా నుంచి 290 మంది ఉపాధ్యాయులను పంపాలని అక్కడ డీఈవోను విశాఖ డీఈవో కోరారు.

విశాఖ జిల్లాలో పదో తరగతి పరీక్షలకు 134 కేంద్రాలను ఏర్పాటుచేస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 28 వేల మంది పరీక్షలు రాయనున్నారు. సగటున ప్రతి పరీక్షా కేంద్రానికి పది మందికి తగ్గకుండా ఇన్విజిలేటర్లు అవసరం. ఇంకా, ఇతర బాధ్యతలతోపాటు అత్యవసర పరిస్థితుల్లో విధులు నిర్వహించడానికి మరికొందరు సిబ్బందిని నియమించాల్సి ఉంటుంది. ఈ లెక్కన జిల్లాలో పదో తరగతి పరీక్షల నిర్వహణకు సుమారు 2,500 మంది ఉపాధ్యాయులు అవసరమని విద్యా శాఖ గుర్తించింది. అయితే అంతమంది జిల్లాలో లేరు. మొత్తం 105 ఉన్నత పాఠశాలలు ఉండగా, 85 పాఠశాలల నుంచి స్కూల్ అసిస్టెంట్ల సేవలను వినియోగించుకునే వెసులుబాటు ఉంది. రెసిడెన్షియల్, కేజీబీవీ స్కూళ్లలో బోధన చేసేవారంతా రెగ్యులర్ టీచర్లు కానందున ఇన్విజిలేషన్ విధులు అప్పగించకూడదు. గత ఏడాది వరకూ ప్రాథమిక పాఠశాలల టీచర్లను ఇన్విజిలేటర్లుగా నియమించేవారు. దీంతో ప్రాథమిక

... మిగతా 6వ పేజీలో

దక్షిణ కోస్తా జోన్‌పై చిన్నచూపు

పంపకాల్లో వివక్ష

- ఇప్పటికే వాల్తేరు డివిజన్ నుంచి 200 పోస్టులు ఖుర్దా, సంబల్‌పూర్ డివిజన్‌లకు తరలింపు
- మరికొంతమందిని రాయగడ డివిజన్‌కు పంపించే అవకాశం



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఒక కుటుంబంలో సభ్యులు వేరు పడేందుకు సిద్ధమైతే న్యాయబద్ధంగా ఎవరి వాటా వారికి ఇచ్చి సొంత కాళ్లపై నిలదొక్కుకునేలా పెద్దలు పంపకాలు చేయాలి. అందులో తేడా వస్తే తక్కువ వాటా వచ్చిన వారు పోరాటానికి దిగుతారు. అలా చేస్తే తప్ప న్యాయం జరగని రోజులివి. రైల్వే వ్యవస్థ కూడా అటువంటిదే. విశాఖ కేంద్రంగా పనిచేసే కొత్త జోన్‌కు చాలా అవసరం ఉంది. వాటి కోసం పోరాటం చేయాల్సిన సమయం ఇదే.

- జోన్ కార్యాలయానికి అవసరమైన సిబ్బంది కేటాయింపులో ఇటు భువనేశ్వర్, అటు సికింద్రాబాద్ ఉన్నతాధికారులు కీలకం
- యూనియన్ల చొరవ అవశ్యం... ఇదే తగిన సమయం

భువనేశ్వర్‌లోని తూర్పు కోస్తా జోన్ నుంచి వాల్తేరు డివిజన్‌ను, సికింద్రాబాద్ కేంద్రంగా ఉన్న దక్షిణ మధ్య జోన్ నుంచి విజయవాడ, గుంతకల్, గుంటూరు డివిజన్లను విడదీసి కొత్తగా 'దక్షిణ కోస్తా జోన్' ప్రకటించారు. విశాఖలో జోనల్ కార్యాలయం పెట్టబోతున్నారు. అంటే ఆయా జోన్ కేంద్రాల్లో సదరు డివిజన్ల వ్యవహారాలు చూసే అన్ని విభాగాల సిబ్బందిని ప్రోరేటా ప్రకారం దక్షిణ కోస్తా జోన్‌కు ఇవ్వాలి. కానీ ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. ఇప్పటికే భువనేశ్వర్ అధికారులు వాల్తేరు డివిజన్ నుంచి సుమారు 200 పోస్టులు ఖుర్దా, సంబల్‌పూర్ డివిజన్లకు తరలించుకుపోయారు. ఇప్పుడు వాల్తేరు డివిజన్ నుంచి కొన్ని ప్రాంతాలను విడదీసి రాయగడ డివిజన్ కొత్తగా ఏర్పాటు చేయడంతో మరిన్ని పోస్టులు అటు తరలించుకుపోయే ప్రమాదం ఉంది.

ఇప్పుడు జోన్ కార్యాలయానికి అవసరమైన సిబ్బందిని ఇటు భువనేశ్వర్, అటు సికింద్రాబాద్‌ల నుంచి కేటాయించాల్సి ఉంది. అలాగే దక్షిణ కోస్తా జోన్‌లో చేర్చిన వాల్తేరు, విజయవాడ, గుంటూరు, గుంతకల్ డివిజన్ల ఉద్యోగులను ఇతర డివిజన్లకు తరలించకుండా చూడాల్సి ఉంది. కొత్త పోస్టులను సృష్టించడం, ఉన్న పోస్టులను వాటా ప్రకారం తెచ్చుకోవడం చాలా ముఖ్యం. ఈ పంపకాలన్నీ భువనేశ్వర్‌లోని జనరల్ మేనేజర్, సికింద్రాబాద్‌లోని జనరల్ మేనేజర్ పర్యవేక్షిస్తారు. సహజంగానే వారు మాతృ జోన్లకు పెద్ద పీట వేయాలని భావిస్తారు. ఆ దిశగా నిర్ణయాలు తీసుకుంటారు. ఇటువంటి సమయంలో తప్పులు జరగకుండా చూడడం, జరిగితే ప్రశ్నించడం, న్యాయబద్ధంగా అవసరమైనవి సాధించుకోవడం రైల్వే కార్మిక సంఘాల ప్రధాన బాధ్యత.

ప్రభుత్వ రంగ సంస్థల్లో గెలిచిన యూనియన్‌ను 'గుర్తింపు సంఘం'గా వ్యవహరిస్తూ వారి నిర్ణయాలకు ప్రాధాన్యం ఇస్తారు. ఆయా జోన్ల పరిధుల్లో ఇటీవల జరిగిన ఎన్నికల్లో అఖిల

... మిగతా 6వ పేజీలో

నరవలో సగం కాలిన మృతదేహం

- హత్య చేసి దహనం చేసే యత్నమేనని అనుమానం
- మృతుడికి 30 ఏళ్ల వయసుంటుందని అంచనా
- ఆధారాల కోసం పోలీసుల అన్వేషణ

గోపాలపట్నం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని నరవ గ్రామ సమీపంలో సగం కాలిన మృతదేహం లభ్యమవ్వడం స్థానికంగా కలకలం రేపింది. హత్య చేసి, ఆనవాళ్లు దొరక్కుండా చేసేందుకు దహనం చేసి ఉంటారని భావిస్తున్నారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తిగా పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి.

నరవ సమీపంలోని కొండవాలు ప్రాంతంలో సగం కాలిపోయిన వ్యక్తి మృతదేహాన్ని శుక్రవారం స్థానికులు గుర్తించారు. వెంటనే ఈ విషయాన్ని పెందుర్తి పోలీసులకు సమాచారం అందించారు. పెందుర్తి సీఐ సతీశ్‌కుమార్, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. మృతుడికి సుమారు 30 ఏళ్ల వయసు ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. ఎటువంటి ఆధారాలు లభించకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తిగా కేసు నమోదు చేశారు. హత్యకు గురైన యువకుడు ఎవరు?, అదే స్థలంలో హత్య చేసి, మృతదేహాన్ని దహనం చేసే ప్రయత్నం చేసి ఉంటారా లేక ఎక్కడో హత్య చేసి, మృతదేహాన్ని ఇక్కడికి తీసుకువచ్చి తగలబెట్టేందుకు యత్నించారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, సీఐ సతీశ్‌కుమార్ కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నారు.

22-ఏ... కష్టాలకు చెల్లు

విశాఖపట్నం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ లేదా ప్రభుత్వ సంస్థల నుంచి కొనుగోలు చేసిన భూములు/స్థలాలకు 22-ఎ (నిషేధిత భూముల జాబితా) నుంచి విముక్తి లభించనున్నది. ఈ మేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో అందుకు అనుగుణంగా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. ఇప్పటివరకూ వస్తున్న అర్జీలపై ఎప్పటికప్పుడు జిల్లా స్థాయి స్క్రూట్నీ కమిటీలో చర్చించి నిర్ణయం తీసుకుంటున్నారు. అయినా తమ భూములు/స్థలాలను 22-ఎ నుంచి తొలగించాలని నిత్యం కలెక్టరేట్‌కు వినతులు వస్తున్నాయి.

- ప్రభుత్వ, ప్రభుత్వ సంస్థల నుంచి కొనుగోలు చేసిన స్థలాలు నిషేధిత జాబితా నుంచి తొలగింపు
- వీఎంఆర్‌డీఏ, హౌసింగ్ స్థలాలు, ఇళ్లకు మినహాయింపు
- జిల్లా స్థాయి స్క్రూట్నీ కమిటీ ద్వారా నిర్ణయం



మధురవాడలో 22-ఏలో ఉన్న సోషల్ వెల్ఫేర్ కాలనీ రికార్డులను పరిశీలిస్తున్న జేసీ మయూర్ అశోక్

నగరం, పరిసరాల్లో వీఎంఆర్డీఏ లేఅవుట్లు అభివృద్ధి చేసి ప్లాట్లు విక్రయించింది. మరికొన్నిచోట్ల కాలనీలు నిర్మించింది. ఇంకా హౌసింగ్ బోర్డు పలుచోట్ల ఇళ్ల నిర్మాణాలు చేపట్టింది. ఆయా కాలనీల్లో ప్లాట్లు/ఇళ్ల కొనుగోలు చేసినవారు కొందరు అక్కడే నివసిస్తుండగా, మరికొందరు అమ్ముకున్నారు. అయితే వీఎంఆర్డీఏ, హౌసింగ్ బోర్డుకు ఇచ్చిన భూములు ఇంకా ప్రభుత్వ ఖాతాల్లోనే ఉన్నాయి. ఇటువంటి భూములను నిషేధిత జాబితా (22-ఎ)లో పెట్టారు. అంటే రిజిస్ట్రేషన్లు కావు. దీంతో వీఎంఆర్‌డీఏ, హౌసింగ్ బోర్డుల నుంచి స్థలాలు/ఇళ్లు కొనుగోలు చేసిన వ్యక్తులు ఇబ్బంది పడుతున్నారు. విశాఖ గ్రామీణ మండలంలో సుమారు 100 మంది తమ భూములను 22-ఎ నుంచి తొలగించాలని రెవెన్యూ అధికారులు చుట్టూ తిరుగుతున్నారు.

మధురవాడ సర్వే నంబర్ 39లో సోషల్ వెల్ఫేర్ కాలనీ ఉంది. చాలాకాలం క్రితం 70 నుంచి 80 మంది పేదలకు స్థలాలు కేటాయించడంతో కొందరు అక్కడే ఇళ్లు నిర్మించుకోగా, మరికొందరు విక్రయించుకున్నారు. అది ప్రభుత్వం భూమి కావడంతో 22-ఎలో చేర్చడంతో లబ్ధిదారులు ఇబ్బందిపడుతున్నారు. రెవెన్యూ అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు సమర్పించారు. దీనిపై జిల్లా స్థాయి కమిటీలో చర్చకు రావడంతో శుక్రవారం జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, రూరల్ తహసీల్దార్ పాల్‌కిరణ్, ఇతర సిబ్బంది సోషల్ వెల్ఫేర్ కాలనీని సందర్శించి రికార్డులు పరిశీలించారు. అలాగే గాజువాకలో ఆర్టీసీ

... మిగతా 6వ పేజీలో

గ్రూప్-2 అభ్యర్థుల ఆందోళన



ఎంవీపీ కాలనీలోని సర్కిల్ వద్ద శుక్రవారం రాత్రి ఆందోళన నిర్వహిస్తున్న అభ్యర్థులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 పోస్టుల భర్తీకి సంబంధించి రోస్టర్ విధానాన్ని సవరించాలని కోరుతూ మెయిన్స్‌కు అర్హత సాధించిన అభ్యర్థులు శుక్రవారం రాత్రి ఎంవీపీ సర్కిల్ వద్ద ఆందోళన నిర్వహించారు. వందలాది మంది సెల్‌ఫోన్ లైట్లు ఆన్ చేసి..రోస్టర్ విధానాన్ని సవరించిన తరువాతే మెయిన్స్ నిర్వహించాలంటూ నినాదాలు చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా తమ సమస్యను గుర్తించి పరిష్కరించాలంటూ డిమాండ్ చేశారు. ఈ విషయం తెలిసి ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు అక్కడకు చేరుకున్నారు. ఆందోళనకారులతో మాట్లాడారు. మంత్రి నారా లోకేష్ దృష్టికి సమస్యను తీసుకువెళ్లామని, సానుకూల నిర్ణయం వస్తుందని చెప్పారు. ఇదే కూడలిలో మధ్యాహ్నం కూడా అభ్యర్థులు ఆందోళన నిర్వహించారు.

విశాఖ-తిరుపతి మధ్య ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం విశాఖపట్నం-తిరుపతి మధ్య ప్రత్యేక రైళ్లను ప్రవేశపెడుతున్నట్టు వాల్తేరు డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. 08583 నంబర్ గల ప్రత్యేక రైలు ఈ నెల 24 నుంచి ఏప్రిల్ 28 వరకు ప్రతి సోమవారం రాత్రి 7.10 గంటలకు విశాఖలో బయలుదేరి మరుసటిరోజు ఉదయం 9.15 గంటలకు తిరుపతి చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08584 నంబరు గల ప్రత్యేక రైలు ఈ నెల 25 నుంచి ఏప్రిల్ 29 వరకు ప్రతి మంగళవారం రాత్రి 9.55 గంటలకు తిరుపతిలో బయలుదేరి మరుసటిరోజు ఉదయం 10.15 గంటలకు విశాఖ చేరుతుంది.



పలు రైళ్లు రద్దు

సాంకేతిక కారణాల దృష్ట్యా విశాఖ-షాలిమార్ ఒరిజినేటింగ్ ఎక్స్‌ప్రెస్‌తోపాటు పలు రైళ్లను తాత్కాలికంగా రద్దు చేసినట్టు రైల్వే అధికారులు తెలిపారు. ఈ నెల 25న సంత్రాగచ్చి-చెన్నై ఎక్స్‌ప్రెస్ (22807), షాలిమార్-విశాఖ ఎక్స్‌ప్రెస్ (22853), 26న విశాఖ-షాలిమార్ ఎక్స్‌ప్రెస్ (22854), 27న చెన్నై సెంట్రల్-సంత్రాగచ్చి ఎక్స్‌ప్రెస్ (22808) రైళ్లను రద్దు చేశామని పేర్కొన్నారు.

పరిశోధనల ఫలితాలు ప్రజలకు చేరాలి


భట్నాగర్‌కు నివాళులర్పిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ తదితరులు

సాగర్‌నగర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సమాజ హితానికి విజ్ఞానశాస్త్ర పరిశోధనలు ఉపయోగపడాలని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కె.ఎస్.కృష్ణ అభిప్రాయపడ్డారు. సర్ శాంతి స్వరూప్ భట్నాగర్ 131వ జయంతి సందర్భంగా గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లోని భట్నాగర్ ప్రయోగశాలల వద్ద శుక్రవారం జరిగిన కార్యక్రమంలో భట్నాగర్ విగ్రహానికి పూలమాలవేసి కె.ఎస్.కృష్ణ నివాళులర్పించారు. భారతదేశం విజ్ఞానశాస్త్ర రంగంలో అభివృద్ధి చెందడానికి భట్నాగర్ వంటి పరిశోధకుల దూరదృష్టి కారణమన్నారు. విశ్వవిద్యాలయాలలో జరిగే పరిశోధనల ఫలితాలు సామాన్యులకు చేరాలన్నారు. ప్రిన్సిపాల్ వేదవతి, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు, రీసెర్చి స్కాలర్లు పాల్గొని భట్నాగర్‌కు నివాళులర్పించారు.

విధుల్లోకి ఎన్‌ఏడీ ఉద్యోగులు

ఎన్‌ఏడీ జంక్షన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఎన్‌ఏడీ సీజీఎం విధులనుంచి తొలగించిన 36 మంది ఉద్యోగులకు విముక్తి లభించింది. రెండునెలలుపైగా ఉద్యోగులు రిలే నిరాహార దీక్షలు, ధర్నాలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నేవల్ కమాండెంట్ స్పందించడంతో రెండు రోజులుగా విధులకు వెళ్తున్నారు.

మాతృభాషను మరువొద్దు

పలు విద్యాసంస్థల్లో నిర్వహించిన అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవంలో వక్తలు


భీమిలి : మాట్లాడుతున్న డైట్ ప్రిన్సిపాల్ జ్యోతికుమారి, పాల్గొన్న అధ్యాపకులు


కొమ్మాది : చంద్రంపాలెం పాఠశాలలో బహుమతులు ప్రదానం చేస్తున్న హెచ్‌ఎం రవి


భీమిలి : ఎస్వీఎల్ఎన్ఎస్ డిగ్రీ కళాశాలలో ప్రసంగిస్తున్న వైస్ ప్రిన్సిపాల్ విష్ణుమూర్తి

అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా శుక్రవారం పలు విద్యాసంస్థల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కార్యక్రమాల్లో వక్తలు మాట్లాడుతూ వ్యక్తి వికాసంలో మాతృభాషా ప్రాధాన్యాన్ని వివరించారు. మాతృభాషలో పట్టు సాధిస్తే అన్య భాషలు సునాయాసంగా నేర్చుకోవచ్చని పేర్కొన్నారు. మాతృభాషను ఎవరూ మరువొద్దన్నారు.

భీమునిపట్నం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణా సంస్థ (డైట్)లో ప్రిన్సిపాల్ ఎం.జ్యోతికుమారి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృబాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ తల్లి భాషను మరువవద్దన్నారు. పలువురు ఛాత్రోపాధ్యాయులు మాతృబాష గొప్పదనం గురించి వివరించారు. తెలుగుని ప్రశంసిస్తూ వివిధ గీతాలు ఆలపిస్తూ, నృత్య ప్రదర్శనలు చేశారు. తొలుత తెలుగు ప్రముఖుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. క్విజ్, పద్య పఠనంలో పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు.కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అలాగే, భీమిలి ప్రభుత్వ ఎస్వీఎల్ఎన్ఎస్ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మాతృబాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా, మాతృబాషా దినోత్సవం జరుపుకోవడంలో ప్రాముఖ్యతను, గొప్పతనాన్ని ఆ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్ విష్ణుమూర్తి వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

తగరపువలసలో..

తగరపువలస : బంగ్లామెట్ట జీవీఎంసీ పాఠశాలలో హెచ్‌ఎం అప్పలరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తెలుగు బాషా వికాసానికి కృషిచేసిన గురజాడ అప్పారావు, గిడుగు రామమూర్తి పంతులు, సీపీ బ్రౌన్, కందుకూరి వీరేశలింగం తదితర పది మంది మహనీయుల వేషధారణలో విద్యార్థులు అలరించారు. కార్యక్రమంలో పాఠశాల నిర్వహణ కమిటీ చైర్మన్ ఎస్.షర్మిల, ఉపాధ్యాయులు రమేష్, మల్లిక సంజీవి తదితరులు పాల్గొన్నారు.

కొమ్మాదిలో..

కొమ్మాది : చంద్రంపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలు రమాదేవి ఆధ్వర్యంలో మాతృబాషాదినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం గొట్టేటి రవి మాట్లాడుతూ మాతృబాషా దినోత్సవ ప్రత్యేకతను వివరించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాగర్‌నగర్‌లో..

సాగర్‌నగర్ : స్థానిక అంధ బాలికల ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు నూర్జహాన్ ఆధ్వర్యంలో మాతృబాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాతృబాషలో చదివిన వారికి వికాసం అధికంగా ఉంటుందన్నారు. అన్య బాషలు నేర్చుకోడానికి మాతృబాషే ప్రామాణికం అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆయుష్‌లో పంచాయితీ

- ఆర్డీడీ, జూనియర్ అసిస్టెంట్ మధ్య వివాదం
- పరస్పరం ఫిర్యాదులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : 'ఆయుష్' శాఖ పరువు రోడ్డునపడింది. తనపై కింది స్థాయి ఉద్యోగి చేయి చేసుకుందంటూ ఉన్నతాధికారిణి, ఉన్నతాధికారిణే తనను కొట్టడంతోపాటు కులం పేరుతో దూషించారంటూ జూనియర్ అసిస్టెంట్ పరస్పరం పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. మధురవాడలోని చిన్న భవనంలో రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం ఉంది. అందులో రీజనల్ డిప్యూటీ డైరెక్టర్, ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లు, మరో జూనియర్ అసిస్టెంట్, డీఈవో, మరో హెల్పర్ పనిచేస్తున్నారు. అయితే, ఇన్‌చార్జి ఆర్డీడీగా పనిచేస్తున్న అధికారిణి తనను కొట్టారని, కులం పేరుతో దూషించారంటూ అక్కడ పనిచేసే జూనియర్ అసిస్టెంట్ ఒకరు కార్యాలయం బయట ఆందోళనకు దిగారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తనను జూనియర్ అసిస్టెంట్ కొట్టారంటూ పోలీస్ స్టేషన్‌లో సదరు ఇన్‌చార్జ్ ఆర్డీడీ కూడా ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులపై పోలీసులు విచారణ చేపట్టారు. రెండుసార్లు కార్యాలయానికి వచ్చి పలు వివరాలను సేకరించారు.

ఉన్నతాధికారులు దృష్టిసారించాలి..

కార్యాలయంలో జరిగిన వివాదంపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

ముఖ్యంగా జిల్లా కలెక్టర్ ఈ వ్యవహారంపై ప్రత్యేకంగా దృష్టి సారించి తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని అదే శాఖలో పని చేస్తున్న ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో ఈ తరహా వ్యవహారాలు మిగిలిన శాఖలకు విస్తరించే ప్రమాదం ఉందంటున్నారు. 'ఆయుష్'లో గొడవపై డిప్యూటీ కలెక్టర్ శేష శైలజ విచారణ జరిపినట్టు చెబుతున్నారు.

'గాయత్రి'లో రక్తదానం, నేత్ర వైద్య శిబిరం

కొమ్మాది, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : గాయత్రి విద్యాపరిషత్ ఇంజనీరింగ్ కళాశాల (అటానమస్)లో రోటరీ క్లబ్, విజన్ ఐ ఆస్పత్రి ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదానం శిబిరం, నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. కళాశాల డీన్ వి.వెంకట్రావు కార్యక్రమాలను ప్రారంభించారు. అధిక సంఖ్యలో విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఏటీకే రావ్, అడ్మిన్ డీన్ అచ్యుతరాము అభినందించారు ఆచార్యులు పి.వెంకట్రావు, కృష్ణకిరణ్, సీవీ నాగేశ్వరావు, వైస్‌ప్రిన్సిపాల్ శ్యాంసుందర్, రవీంద్ర, జగదీశ్వరావు, వంశీకృష్ణ పాల్గొన్నారు.

మూలకుద్దులో దాహం..దాహం


మరమ్మతులు చేయాల్సిన మూలకుద్దు తాగునీటి ట్యాంకు

భీమునిపట్నం (రూరల్) ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): భీమిలిమండలం మూలకుద్దులో వేసవి తీవ్రరూపం దాల్చకముందే దాహం కేకలువినిపిస్తున్నాయి. తాగునీటి సమస్య శాశ్వత నివారణకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ గ్రామంలో తాగునీటి సరఫరా కోసం నిర్మించిన రక్షిత మంచినీటి పథకం ట్యాంకుకు మరమ్మతులు చేయవలసి ఉందని ప్రజలు చెబుతున్నారు. గోస్తనీ నదిని ఆనుకుని ఈ గ్రామం ఉన్నప్పటికీ తాగునీరు లభించదు. గొట్టపుబావుల నుంచి ఉప్పునీరు వస్తుంది. గతంలో మార్చి ప్రారంభానికే బావులు పట్టిపోవడంతో దూరప్రాంతాలకు వెళ్లవలసి వచ్చేదని, ఈ ఏడాది కూడా అదే పరిస్థితి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. గ్రామంలో చాలా బావులు ఉన్నప్పటికీ తాగునీటికి ఉపయోగపడడం లేదు. దీంతో రక్షిత మంచినీటి పథకాన్ని నిర్మించి తాగునీటిని సరఫరా చేస్తున్నారు. అయితే తరచూ మరమ్మతుల కారణంగా గ్రామస్థులకు తాగునీరు అందడం లేదు. గొట్టాల ద్వారా తాగునీటిని సరఫరా చేయాలని ఇటీవల అధికారులు నిర్ణయించినా, ఈ పనులు పూర్తి కాకపోవడం వల్ల తాగునీటికి ఇబ్బందులు వస్తున్నాయి. తరచూ మోటారు మరమ్మతులకు గురికావడం కూడా సమస్యకు కారణం. ఈ సమస్యను శాశ్వత పద్ధతిలో పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు. దివీస్ యాజమాన్యం ఈ గ్రామానికి కూడా సురక్షిత నీటిని అందించాలని కోరుతున్నారు.

వెనుకబడిన టెన్త్ విద్యార్థుల కోసం ప్రత్యేక ప్రణాళిక

- డీఈవో ప్రేమ్‌కుమార్


విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో ప్రేమ్‌కుమార్

భీమునిపట్నం (రూరల్), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : విశాఖ జిల్లాలో చదువులో వెనుకబడిన టెన్త్ విద్యార్థుల కోసం ప్రత్యేక ప్రణాళికను అమలు పరుస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి పి.ప్రేమ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన భీమిలి మండలం రాజుల తాళ్లవలస జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు.ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ రెండు నెలల క్రితం విద్యార్థులకు నిర్వహించిన సమ్మెటివ్ (ఎస్ఏ-1) పరీక్షా ఫలితాల ఆధారంగా విద్యార్థుల స్థాయిని సబ్జెక్టుల వారీగా మదింపు చేస్తున్నామన్నారు. ఆయా సబ్జెక్టు టీచర్లు రెమిడియల్ టీచింగ్ విధానంలో వెనుకబడిన విద్యార్థులకు పరీక్షలకు సిద్ధం చేయనున్నట్టు చెప్పారు. హెచ్‌ఎం కెప్రభాకరరావు, టీచర్లతో మాట్లాడి పలు సూచనలు చేశారు. ఈ ఏడాది శత శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. అనంతరం 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో మాట్లాడుతూ పబ్లిక్ పరీక్షలకు ముందు వెనుకబడిన విద్యార్థుల విషయమై ప్రత్యేక దృష్టి సారించి, వారిని పరీక్షలకు సంసిద్ధుల్ని చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఈ క్రమంలో రోజుకు నాలుగైదు పాఠశాలలను సందర్శిస్తూ స్టడీ అవర్స్‌ను పరిశీలించడం, ఉపాధ్యాయులకు తగిన సూచనలు అందిస్తున్నట్టు చెప్పారు. ప్రత్యేక కార్యచరణ ప్రణాళిక నిర్వహిస్తున్నట్టు డీఈవో చెప్పారు.

పారా అథ్లెటిక్స్‌లో నేత్ర విద్యాలయం విద్యార్థులకు పతకాలు



విజేతలను అభినందిస్తున్న నేత్ర విద్యాలయం యాజమాన్యం

భీమునిపట్నం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో భీమిలి బీచ్‌రోడ్ మంగమారిపేట వారిజ ఆశ్రమం నేత్ర విద్యాలయం విద్యార్థులు ఉత్తమ ప్రతిభ ప్రదర్శించి పలు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా విద్యాలయం ప్రెసిడెంట్ పీఎస్ఎన్ రాజు శుక్రవారం వారిని అభినందించారు.

చెన్నై జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఈ నెల 17 నుంచి 20 తేదీ వరకూ 23వ జాతీయ పారా (దివ్యాంగులు) అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2025 పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో వారిజ నేత్ర విద్యాలయానికి చెందిన విద్యార్థిని కిల్లాక లలిత (టి లెవన్) కేటగిరీలో 400, 200 మీటర్లు పరుగుపందెంలో ప్రథమంగా నిలిచి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నారు. మరో విద్యార్థిని పలసనైని రవళి (టి లెవన్) కేటగిరీలో 100 మీటర్ల పరుగు పందెంలో స్వర్ణ పతకం, 400 మీటర్ల, 200 మీటర్ల పరుగు పందెంలో సిల్వర్ మెడల్స్‌ను సాధించారు. ఈ సందర్భంగా విజేతలను పారా స్పోర్ట్సు అసోసియేషన్, వారిజ నేత్ర విద్యాలయం కమిటీ అభినందనలు తెలిపారు.

బ్యాంకు సిబ్బంది ఆందోళన

తగరపువలస, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): బ్యాంకులకు వారానికి అయిదు రోజుల పనిదినాలను అమలు చేయాలని శుక్రవారం చిట్టివలస స్టేట్‌బాంకు ఎదుట సిబ్బంది ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమానికి బ్యాంకు సహాయ మేనేజరు జి లలితేష్ అధ్వర్యం వహించారు. భోజన విరామ సమయంలో ఇతర సిబ్బంది కూడా పాల్గొన్నారు. అన్ని బ్యాంకు శాఖలలో ఉన్న తాత్కాలిక ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరారు. ఉద్యోగ ఖాళీలు భర్తీ చేయాలని, ఔట్ సోర్సింగ్ విధానాన్ని నిషేధించాలని కోరారు ఈ కార్యక్రమంలో అజయ్‌కుమార్, ప్రసన్న, బాబూరావు తదితరులు పాల్గొన్నారు. తమ సమస్యలను ప్రస్తావిస్తూ నినదించారు.

భూముల రీసర్వే సమాచారాన్ని ముందుగా ప్రకటించండి: కలెక్టర్


దాకమర్రి పొలాల్లో భూముల సర్వేపై అధికారుల వివరణ తెలుసుకుంటున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

భీమునిపట్నం (రూరల్) ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రీసర్వే చేపట్టబోయే గ్రామాల సమాచారాన్ని ముందుగా గ్రామాల్లో రైతులకు తెలియజేయాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ యంత్రాంగాన్ని ఆదేశించారు. శుక్రవారం భీమిలి మండలం దాకమర్రి గ్రామ సచివాలయాన్ని అధికారులతో కలిసి ఆయన సందర్శించారు. రీసర్వే సమాచారాన్ని ముందుగా తెలియజేస్తే రైతులు తమ సమస్యలు తెలియజేయడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో కలిసి పంటపొలాలను పరిశీలించారు. భూముల పరిరక్షణ, సరిహద్దుల గుర్తింపు, దీర్ఘకాలిక భూ సమస్యలు శాశ్వత పరిష్కార దిశగా రెవెన్యూ అధికారులు కృషి చేయాలని కలెక్టర్ కోరారు. రైతుల అభిప్రాయాలను, వారు చెప్పే సమస్యలను పరిగణనలోకి తీసుకుని అందుకు అనుగుణంగా సర్వే చేపట్టాలని ఆదేశించారు. దాకమర్రి గ్రామ సచివాలయంలో సిబ్బంది పనితీరును పరిశీలించారు. ప్రజలకు నిత్యం సేవలందేలా సిబ్బంది అందుబాటులో ఉండాలని కోరారు. క్షేత్రస్థాయి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎంపీడీఓ హస్నం తరావుకు సూచించారు. అంటురోగాలు ప్రబలకుండా ప్రజారోగ్య పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. తహసీల్దారు పైలా రామారావు, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆనందోత్సాహాలతో వీడ్కోలు కార్యక్రమం



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

భీమునిపట్నం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): భీమిలి ప్రభుత్వ జూనియరు కళాశాలలో శుక్రవారం విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. ముఖ్యఅతిథులుగా పట్టణ ప్రముఖులు మైలపల్లి షణ్ముఖరావు, మైలపల్లి లక్ష్మణరావులు పాల్గొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. తొలుత ఆ పాఠశాల ప్రిన్సిపాల్ రామ్‌ప్రసాద్ మాట్లాడారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

యువతను ఉత్తమంగా తీర్చిదిద్దుతున్న ఎన్‌ఎస్‌ఎస్


మల్కాపురం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): యువతను బాధ్యతయుతమైన నాయకులుగా తీర్చిదిద్దడంలో ఎన్‌సీసీ ఎంతో కృషి చేస్తోందని ఎన్‌సీసీ జిల్లా ప్రోగ్రాం అధికారి ఈపీఎస్ భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ఇంటర్మీడియట్ జాతీయ సేవా పథక కార్యకర్తల అభినందన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ గెసిల్లా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కేస్లిన్ ప్రసంగించారు. అనంతరం వలంటీర్లను బహుమతులతో సత్కరించారు.

అప్పన్నకు భక్తితో గరుడ సేవ


గరుడవాహనంపై గోవిందుడు

సింహాచలం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహునికి భక్తులు గరుడసేవ జరిపించారు. ఆర్జిత సేవల్లో భాగంగా శుక్రవారం ప్రభాతారాధనల తరువాత ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామిని రజిత గరుడవాహనంపై అధిష్ఠింపజేశారు. నృసింహ అష్టోత్తర శతనామావళితో పూజలు చేయగా, మంగళవాయిద్యాల వెంట గరుడవాహనంపై ఉన్న గోవిందునికి భక్తులు ముమ్మారు ప్రదక్షిణలు చేశారు. స్వామికి ప్రీతికరమైన శీతలాన్ని(పంచదార) నివేదనగా సమర్పించి భక్తులకుప్రసాదాలను అందజేశారు.

వైభవంగా నిత్యకల్యాణం


కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

సింహాద్రినాథునికి వైభవంగా నిత్యకల్యాణం జరిపారు. శుక్రవారం వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై కొలువుదీర్చారు. పాంచరాత్రాగమ శాస్త్ర విధానంలో కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణలు చేసి మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ జీలకర్ర, బెల్లం, మాంగల్యధారణలు కావించారు. స్వామివారికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు అందజేశారు.

టమోటా రైతులకు అధికారి సూచన

భీమునిపట్నం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): అధిక దిగుబడి కారణంగా టమోటా ధరలు పడిపోవడంతో ప్రభుత్వ ఆదేశం మేరకు రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని మార్కెటింగ్ శాఖ నేరుగా టమోటా పంటను కొనుగోలు చేసి రైతు బజార్లలో విక్రయిస్తుందని విశాఖ వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ప్రాంతీయ ఉప సంచాలకుడు శ్రీనివాస్ కిరణ్ తెలిపారు. రైతులే నేరుగా రైతుబజార్లలో అమ్ముకోవాలనుకున్నా అందుకు తగిన ఏర్పాట్లు చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని టమోటా రైతులందరూ సద్వినియోగపర్చుకోవాలని సూచించారు. శుక్రవారం పద్మనాభం మండలం కొవ్వాడ, అనంతవరం గ్రామాల్లో ఆయన పర్యటించి టమోటా రైతులతో మాట్లాడారు. భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి, విలేజ్ అసిస్టెంట్‌లను సంప్రదించాలని ఆయన సూచించారు.

హనుమంతుడు సకల శక్తిసంపన్నుడు: చాగంటి


రామ యంత్రానికి పూజ చేస్తున్న ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు

కొమ్మాది, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): దేవతల అనుగ్రహంతో కూడిన సకల శక్తి సంపన్నుడు హనుమ అని, ఆయనతో సమానమైన బల సంపన్నుడు మరెవ్వరూ కనిపించరని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరావు అన్నారు. కొమ్మాది గాయత్రి మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న సంపూర్ణ రామాయణం ప్రవచనాలలో భాగంగా శుక్రవారం కిష్కింధకాండలో ఆఖరి అధ్యాయంలో విశేషాలను వివరించారు. గొప్ప ఆత్మ విశ్వాసం, ఉత్సాహం, వినయం హనుమలోని సుగుణాలని, నూరు యోజనాల సముద్రాన్ని దాటి లంకానగరానికి వెళ్లగలిగినంత బలం ఆయన సొంతమన్నారు. అక్కడ వానరులు ఎవరూ లేకపోవటం, అంగదుడు వెళ్లగలిగినా తిరిగి రాగలనన్న నమ్మకం లేకపోవటంతో ఆ కార్యాన్ని చేయగలిగిన వాడు హనుమ ఒక్కడేనని జాంబవంతుడు వెళ్లి కీర్తించటం వంటి ఘట్టాలను వివరించారు. అంజనాదేవి భూమిపై జన్మించడం, ఆమె వాయుదేవుడంతటి బలపరాక్రమం కలిగిన ఒక మహా వానరాన్ని పుత్రుడిగా అనుగ్రహించడం. అలా జన్మించిన హనుమ పుట్టుకతోనే అత్యంత బలసంపన్నుడై సూర్యుని వద్దకు వెళ్లడం, ఇంద్రుని వజ్రాయుధం తగిలి దవడ భాగం సొట్ట పడటంతో ఆయనకు హనుమ అన్న పేరు రావడం, బ్రహ్మాది దేవేంద్రులందరూ తమ శక్తులను హనుమకు ధారపోయడం, హనుమకు మరణం లేకుండా చిరంజీవిగా దీవించడం వంటి హనుమ జీవిత విశేషాలను ప్రవచించారు. చిన్నవయస్సులోనే హనుమకు ఇంతటి శక్తి అవసరం లేదని, అవసరమైనప్పుడు శక్తి ఆయనకు స్ఫురణకు వస్తుందని ప్రేమతో దేవతలు హనుమకు శాపం ఇచ్చిన వృత్తాంతాన్ని జాంబవంతుడు హనుమకు తెలపడం, అందువల్లనే హనుమ వాలిని సంహరించగల శక్తి ఉన్నా, తన శక్తి గుర్తులేక సుగ్రీవుడితో పాటు నలుదైపులా తిరిగిన ఉదంతాన్ని వివరించారు. కిష్కింధకాండ పూర్తయిన సందర్భంగా అందులోని ప్రధాన పాత్ర పోషించిన మాతంగమహర్షి స్వరూపంగా ఆచార్య ప్రసన్నకుమార్ దంపతులను ఘనంగా సత్కరించారు.

విద్యుత్ లోడు క్రమబద్ధీకరణ

... 5వ పేజీ తరువాయి

రాయితీ ఇవ్వాలని ఏపీఈఆర్సీ సూచించింది. మార్చి 1వ తేదీ నుంచి ఇది అమలులోకి వస్తుంది. ఆన్‌లైన్‌లో దీనికి దరఖాస్తు చేసుకోవచ్చు. ఇప్పుడు నగరంలో ఎక్కువ డబుల్ బెడ్ రూమ్ ఫ్లాట్లు, ఇళ్లు ఎక్కువయ్యాయి. ప్రతి గదికి ఏసీ, బాత్రూమ్‌లో గీజర్, కిచెన్‌లో ఓవెన్, గ్రైండర్ వంటివి ఉంటున్నాయి. ఇంకా కొందరు హాలులో కూడా ఏసీ పెట్టుకుంటున్నారు. ఇలాంటి ఇళ్లకు కనీసం 5 కిలోవాట్ల విద్యుత్ లోడ్‌కు సరిపడా ఫీజులు చెల్లించాలి. కానీ చాలా మంది కిలోవాట్, రెండు కిలోవాట్లకే ఫీజులు కట్టి అధిక విద్యుత్ వినియోగిస్తున్నారు. ఇలాంటి వారంతా ఇప్పుడు వారి కనెక్షన్లను వాస్తవ లోడ్‌తో క్రమబద్ధీకరించుకోవచ్చు. వీరు కిలోవాట్ల లెక్కన సెక్యూరిటీ డిపాజిట్‌తో పాటు అదనపు డెవలప్‌మెంట్ ఫీజులు కట్టాలి. ఇందులో ఫీజులో 50 శాతం రాయితీ లభిస్తుంది.

త్వరలో మార్గదర్శకాలు

- శ్యామ్‌కుమార్, ఎస్ఈ, విశాఖ సర్కిల్

అదనపు లోడు క్రమబద్ధీకరించాలని ఏపీఈఆర్సీ తాజాగా ఆదేశాలు ఇచ్చింది. దీనికి సంబంధించి మార్గదర్శకాలు రావాలని ఉంది. మార్చి 1వ తేదీ నుంచి అమలులోకి వస్తుంది. దీనికి ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

దక్షిణ కోస్తా జోన్‌పై చిన్నచూపు

... 5వ పేజీ తరువాయి

భారత రైల్వే ఉద్యోగుల సమాఖ్య (ఏఐఆర్ఎఫ్), రైల్వే ఉద్యోగుల జాతీయ సమాఖ్యలు గుర్తింపు యూనియన్లుగా గౌరవం దక్కించుకున్నాయి.

ఇప్పుడు కొత్తగా ఏర్పాటయ్యే జోన్‌లోను, వాటి పరిధిలోని డివిజన్లలోను ఈ యూనియన్లకు అధిక ప్రాధాన్యం లభిస్తుంది. ఆస్తుల పంపకాలు, ఉద్యోగుల బదిలీలు, కొత్త పోస్టులు వంటి విషయాల్లో ఈ సంఘాలు అప్రమత్తంగా వ్యవహరించి ఈ ప్రాంత ప్రయోజనాలు కాపాడాల్సి ఉంది.

యూనియన్లు చాలా కీలకం

- చలసాని గాంధీ, మాజీ ఉపాధ్యక్షులు, ఎఐఆర్ఎఫ్

రైల్వేలో యూనియన్లు చాలా కీలకంగా ఉంటాయి. వేతన సవరణ, ఉత్పాదకతతో ముడిపడిన బోనస్, వివిధ రకాల భత్యాల పెంపు, రైల్వే క్వార్టర్ల నిర్మాణం, సంక్షేమ కార్యక్రమాల అమలు, పనిభారం తగ్గింపు, పదోన్నతులపై పోరాటం చేస్తూ ఉద్యోగులకు అండగా ఉంటాయి. కాబట్టి ప్రాంతీయ అవసరాలకు అనుగుణంగా ఈ సంఘాలు ఇప్పుడు అన్నీ సమకూర్చుకోవలసి ఉంది. ఇదే సరైన సమయం.

22-ఏ...కష్టాలకు చెల్లు

... 5వ పేజీ తరువాయి

ఉద్యోగులు మూడు దశాబ్దాల క్రితం ప్రభుత్వం నుంచి భూమి కొనుగోలు చేసి లేఅవుట్ వేసుకున్నారు. ఈ లేఅవుట్‌లో కొంత గెడ్డ పోరంబోకు భూమి ఉండడంతో ప్రస్తుతం చాలా భాగం 22-ఎలో ఉంది. అదేవిధంగా మాజీ సైనికులు, స్వాతంత్ర్య సమరయోధులకు ఇచ్చిన భూములకు ఎన్‌వోసీ తీసుకుని లేఅవుట్‌లు వేయగా..పలువురు కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకున్నారు. అయితే మాజీ సైనికుల భూముల విషయంలో కొందరు సిట్‌కు ఫిర్యాదు చేయడంతో 22-ఎలో చేర్చారు. భూములు కొనుగోలు చేసినవారు, ఇళ్లు నిర్మించుకున్నవారు ఇప్పుడు అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. అయితే తాజాగా 22-ఎ భూములపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో జిల్లాలో అనేకమందికి ఊరట లభించనున్నది. నిషేధ భూముల జాబితా నుంచి తమకు మినహాయింపు ఇవ్వాలని సుమారు 350 మంది వరకూ వినతిపత్రాలు సమర్పించారని ఒక అంచనా.

టెన్త్ పరీక్షలకు ఇన్విజిలేటర్ల కొరత

... 5వ పేజీ తరువాయి

పాఠశాలలు మూత పడడం లేదా బోధన కుంటుపడడం జరిగేది. ఈ నేపథ్యంలో పదో తరగతి పరీక్షల నిర్వహణకు ప్రాథమిక పాఠశాలల టీచర్లను సాధ్యమైనంత తక్కువగా నియమించాలని పాఠశాల విద్యా శాఖ నిర్ణయించింది. అందుకే ఎక్కువమంది స్కూలు అసిస్టెంట్లను ఇన్విజిలేటర్లుగా నియమిస్తున్నారు. అదే సమ యంలో ఉన్నత పాఠశాలల్లో ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు బోధనకు ఇబ్బందిలేకుండా చూడాలని డీఈవోలకు ఆదేశాలు వచ్చాయి.

ఈ నేపథ్యంలో ఇన్విజిలేటర్ల బాధ్యతల నిర్వహణకు అనకాపల్లి జిల్లా నుంచి 290 మందిని పంపాలని కోరినట్టు డీఈవో నిమ్మక ప్రేమ్‌కుమార్ తెలిపారు.

సెంట్రల్ జైలులో సేంద్రీయ సాగు

» కూరగాయలు పండిస్తున్న ఖైదీలు » ధర తక్కువ, ఆరోగ్య పరిరక్షణ కావడంతో మక్కువ చూపుతున్న కొనుగోలుదారులు

అరిలోవ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర కారాగారంలో జైలు అధికారులు ఖైదీల నిర్వహిస్తున్న కూరగాయల సాగు సత్ఫలితాలను ఇస్తోంది. జైలు లోపల వ్యవసాయ క్షేత్రాల్లో పలు రకాలు కూరగాయలు, ఆకుకూరలు, పండ్ల సాగును నిర్వహిస్తున్నారు. సీజనల్‌గా వ్యవసాయ పనులను చేయిస్తూ ఈ పంటలను సాగు చేయిస్తున్నారు. ప్రస్తుతం బీరకాయలు బాగా పండి కోత దశకు రావడంతో వీటి విక్రయానికి జైలు అధికారులు చర్యలు తీసుకొంటున్నారు. అలాగే ఇక్కడ ప్రత్యేకంగా నీటి సదుపాయాని కల్పించి ఆకుకూరలు కూడా పండేలా చేస్తున్నారు. జైలు ఓపెన్ ఖైదీలతో ఈ సాగు పనులు చేయిస్తున్నారు. దీంతో


దిగుబడికి వచ్చిన బీరకాయలను కోస్తున్న కారాగార సిబ్బంది


రైతులు పండించిన క్యాబేజీ, కొబ్బరి, వంకాయలు


అమ్మకానికి సిద్ధం చేసిన టమాటా

వారికి పని విధానాన్ని అలవడేలా జైలు అధికారులు కృషి చేస్తున్నారు.

ఏదో తప్పు చేయడం ద్వారా శిక్ష పడి ఈ జైలుకు వచ్చే ఖైదీల్లో పరివర్తన రావడానికి కృత్యాధారం విధానం దోహదపడుతుందని జైలు సూపరింటెండెంట్ మహేశ్ బాబు పేర్కొన్నారు. ఈ విధానం ఖైదీలకు ఒక విధంగా కౌన్సెలింగ్ అందించినట్టుగా ఉంటుందని ఆయన అన్నారు.

కొత్తిమీర, పాలకూర, తోటకూర, గోంగూర, చుక్క కూర వంటి ఆకు కూరలను ఇక్కడి పండిస్తున్నారు.

సేంద్రీయ ఎరువుల వాడకం

జైలులో సాగు చేస్తున్న కూరగాయల సాగుకు కేవలం సేంద్రీయ ఎరువులను మాత్రమే ఉపయోగిస్తుండడం విశేషం. దీంతో ఇక్కడ పండించే పంటలకు గిరాకీ ఉంటుంది. ధర తక్కువగా ఉండడంతో పాటు సేంద్రీయ ఎరువులతో పండించిన పంటలు కావడంతో కొనుగోలుకు పలువురు ఆసక్తి చూపిస్తుంటారు. టమాటాలు కోసి జైలు బయట గల సుధార్ విక్రయ కేంద్రంలో అమ్మకాలు చేస్తున్నారు. టమాటా కిలో రూ.15కు విక్రయిస్తున్నారు. కొబ్బరికాయ ఒక్కొక్కటి రూ. 20కు అమ్ముతున్నారు. ఇక్కడ ఒకసారి కొనుగోలు చేసిన వాడు మళ్లీ కొనేందుకు ఆసక్తి చూపిస్తుంటారని జైలు అధికారులు తెలిపారు. సేంద్రీయ పంటలు కావడంతో మేలు రకం పంట వస్తుందని చెప్పారు. ఇది రుచితో పాటు ఆరోగ్య పరిరక్షణకు దోహద పడుతుందన్న ఉద్దేశంతో వీటి కొనుగోలుకు ఆదరణ ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు.

ఖైదీలు పండించిన కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు వంటివి సుధార్ విక్రయ కేంద్రంలో సెలవు దినాల్లో మినహా రోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్ర ఐదు గంటల వరకు అందుబాటులో ఉంటాయి. ఎవరైనా కొనుగోలు చేయవచ్చని జైలు అధికారులు తెలిపారు.

విజయనగరం మీదుగా చర్లపల్లి-ధనపూర్ ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): విజయనగరం మీదుగా చర్లపల్లి, ధనపూర్ మధ్య ప్రత్యేక రైళ్లు ప్రవేశపెట్టామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. 07749 నంబరు గల రైలు ఈ నెల 22న ఉదయం 9.30 గంటలకు చర్లపల్లిలో బయలుదేరి అదేరోజు రాత్రి 10.55 గంటలకు విజయనగరం, సోమవారం వేకువన 2 గంటలకు ధనపూర్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 07750 నంబరు గల రైలు 22న మధ్యాహ్నం 3.30 గంటలకు ధనపూర్‌లో బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 6.15 గంటలకు విజయనగరం, సోమవారం ఉదయం 8.15 గంటలకు చర్లపల్లి చేరుతుందన్నారు. 07751 నంబరు గల రైలు 23న ఇదే సమయాల్లో చర్లపల్లిలో బయలుదేరి ధనపూర్, తిరుగు ప్రయాణంలో 07752 నంబరుతో ధనపూర్‌లో బయలుదేరి చర్లపల్లి చేరుతుందన్నారు. ఈ రైళ్లు నల్గొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ల, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, కొత్తవలస, విజయనగరం జంక్షన్, శ్రీకాకుళం రోడ్డు, పలాస, బెర్హంపూర్ మీదుగా రాకపోకలు సాగిస్తాయన్నారు.

యూజీసీ ముసాయిదా-25 రద్దు చేయాలి : పీడీఎస్‌వో


నిరసన తెలుపుతున్న పీడీఎస్వో కార్యకర్తలు

మద్దిలపాలెం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : విశ్వవిద్యాలయాల్లో ఆచార్యులు, అధ్యాపకుల నియామకాలు, పదోన్నతులకు రూపొందించిన యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ ముసాయిదా-25ను రద్దు చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ(పీడీఎస్‌వో) జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి డిమాండ్ చేశారు.యూజీసీ ముసాయిదాకు వ్యతిరేకంగా శుక్రవారం డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల గేటు వద్ద పీడీఎస్వో కార్యకర్తలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ యూజీసీ ముసాయిదా రాష్ట్ర ప్రభుత్వాల హక్కులు కాలరాస్తూ రూపొందించారని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో యూనివర్సిటీల వైస్ చాన్సలర్ల నియామకాలు, నియామక నిబంధనలు పూర్తిగా మార్చి గవర్నర్లకు అప్పగించాలని చూడడం దుర్మార్గమన్నారు. అంతేకాకుండా వీసీల అర్హతలు కూడా సడలించడంతో ప్రైవేటు రంగానికి చెందినవారు, అకడమిక్ అనుభవం లేని వారికి వీసీలుగా నియమించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో యమున, లక్ష్మణ్, నతీష్, లోకేష్ పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **డ్రాగన్:** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీకన్య (గాజువాక).
● **ఛైలా:** శ్రీ వెంకటేశ్వర-1, రమాదేవి, శ్రీరామా, గోకుల్, కిన్నెర, మోహిని (గాజువాక), మౌర్య (గోపాలపట్నం)
● **తండేల్:** సంగం, కామేశ్వరి, శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), అన్నపూర్ణ(కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ)
● **సంక్రాంతికి వస్తున్నాం:** శారద, మెలోడి, జగదాంబ, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-12 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), లలిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)
● **డాకు మహారాజ్:** శరత్, కిన్నెర, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), గణేష్, సప్తగిరి (తగరపువలస)
● **గేమ్ ఛేంజర్:** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లలిత (శ్రీహరిపురం), సీతారామయ్య (వడ్లపూడి), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 35, టమాటా 11, వంకాయలు (తెలుపు)20, వంకాయలు (నలుపు) 18, బెండకాయలు 44, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 38, బీరకాయలు 60, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 16, క్యాబేజీ 12, క్యారెట్ 26 దొండకాయలు 32, బంగాళ దుంపలు 14, అరటికాయ (పె) 6, మునక్కాడలు (కిలో) 80, అల్లం (పాతది)52, బరబాటి 36, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 26, దోస కాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 120, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 28, కీరదోస 30, కాప్సికమ్ 36, పొట్లకాయ (పెద్దది) 28, చేమ దుంపలు 34 చిలగడదుంపలు 36, కంద 64, దేముడు చిక్కుడు 36, గోరు చిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 55 , నూల్ కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 30, బూడిద గుమ్మడి కాయ 30, కర్రపెండలం 20, మామిడి అల్లం 46, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	445
విజయనగరం	449
శ్రీకాకుళం	449

చికెన్ ధరలు

బ్రాయిలర్	
రైతు ధర	75
లైవ్ ధర	95
విత్ స్కిన్	160
స్కిన్‌లెస్	170

ఏయూలో ఘనంగా మేనేజ్‌మెంట్ వేడుకలు


అధ్యాపకులకు సత్కరిస్తున్న నిర్వాహకులు


సదస్సులో పాల్గొన్న మేనేజ్‌మెంట్ ప్రతినిధులు

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఏయూలోని మేనేజ్‌మెంట్ విభాగంలోని పీటర్ డ్రక్కర్ స్మార్ట్ సెమినార్ హాలులో శుక్రవారం 19వ జాతీయ మేనేజ్‌మెంట్ దినోత్సవం, 69వ ఆలిండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ఏఐఎంఏ) వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించారు. విశాఖ మేనేజ్‌మెంట్ అసోసియేషన్, ఏయూ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో 'ఇండియా టుమారో అన్ లాకింగ్ ఇండస్ట్రీ ఇన్నోవేషన్ టాలెంట్' అంశంపై చర్చించారు. ఈ సెమినార్‌కు అధ్యక్షత వహించిన విశాఖ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎస్.సాంబశివరావు మాట్లాడుతూ మేనేజ్‌మెంట్ డే విశిష్టత, మేనేజ్‌మెంట్ ఎడ్యుకేషన్ కోసం ఏఐఎంఏ నిర్వహిస్తున్న కార్యక్రమాలను తెలియజేశారు. 2006లో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం ఆలోచనలో భాగంగా మేనేజ్‌మెంట్ డే వేడుకలను నిర్వహించడం ప్రారంభించామన్నారు.

సెమినార్ కన్వీనర్ ఏయూ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి జాలాది రవి మాట్లాడుతూ భారతదేశంలోనే బ్యాచిలర్ ఆఫ్ కామర్స్‌ను ఏయూ ప్రారంభించిందని, మేనేజ్‌మెంట్ ఎడ్యుకేషన్ దేశంలోనే మొదటిగా ప్రారంభించి ప్రపంచానికి.. మరీ ముఖ్యంగా భారతదేశ పరిశ్రమలకు నైపుణ్యం కలిగిన మేనేజర్లను పారిశ్రామికవేత్తలను అందించిందన్నారు. ప్రధాన ఉపన్యాసకుడిగా విచ్చేసిన వైజాగ్ ప్రొఫైల్స్ లిమిటెడ్, ఢిల్లీ అండ్ జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్ ఇండిపెండెంట్ డైరెక్టర్ డాక్టర్ ఇమ్మడి శంకరరావు హాజరై భారతదేశంలో పరిశ్రమలు ఆవిష్కరణలు, టెక్నాలజీలతో మారుతున్న పరిస్థితులను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో వస్తున్న పెను మార్పులను నేర్చుకుని కొత్త అవకాశాలను సృష్టించుకోవాలని సూచించారు. దేశాభివృద్ధిని చైనాతో బేరీజు వేసుకొంటూ పని చేయాలన్నారు.

అతిథి ఉపన్యాసకులుగా విచ్చేసిన విశాఖ కంటైనర్ టెర్మినల్ ప్రైవేటు లిమిటెడ్ హెడ్ హ్యూమన్ రిసోర్స్ ఎం. సి.జిత మాట్లాడుతూ దేశాభివృద్ధికి మౌలిక సదుపాయాలు అవసరమని, వీసీటీపీఎల్ ఈ దేశానికి రాష్ట్రానికి మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయడంలో తోడ్పడుతున్నామన్నారు. విద్యారంగంలోనూ తమ సేవలను అందిస్తున్నామన్నారు. అనంతరం అతిథులను ఫ్యాకల్టీ చైర్మన్ ప్రొఫెసర్ ఉమాదేవి బృందం సన్మానించారు. వీఎంఏ అధ్యక్షుడు ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ బోరుగడ్డ సుబ్బయ్యను అభినందించారు.


తెలుగుతల్లి విగ్రహం ఎదుట నినదిస్తున్న విద్యార్థులు

మాతృభాషను పరిరక్షించుకోవాలి

మద్దిలపాలెం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మాతృభాషా పరిరక్షణకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని తెలుగుదండు అధ్యక్షుడు పరవస్తు సూరి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం పురస్కరించుకుని మద్దిలపాలెం తెలుగుతల్లి విగ్రహం వద్ద శుక్రవారం తెలుగుతల్లికి నీరాజనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తెలుగుతల్లి విగ్రహానికి పూలమాలు వేసి మాట్లాడారు. యునెస్కో సూచనలతో 2000 నుంచి ప్రపంచవ్యాప్తంగా నిర్వహించే ఏకైక పండుగ మాతృభాషా దినోత్సవమన్నారు. మాతృభాష కోసం ప్రాణపాయంగా ప్రాణాలు త్యాగం చేసిన బంగ్లాదేశ్ విద్యార్థులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పాశ్చాత్య భాష మోజులో పడి తల్లి భాషను మరిచిపోకూడదని, తెలుగు భాషను కాపాడుకోవాలని కోరారు. అనంతరం జీవీఎంసీ, వండర్‌కిడ్స్ విద్యార్థులు పాటలు, పద్యాలతో తెలుగుతల్లిని కీర్తించారు. ఈ కార్యక్రమంలో తెలుగు భాషాభిమానులు, ఉమా గాంధీ, కాశీవిశ్వేశ్వరం, చిన సూర్యానారాయణ, శ్రీధర్, సత్యనారాయణ మూర్తి, మాధవి, లలిత తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం మారినా.. గ్రేటర్ అధికారుల తీరు మారలేదు

జనసేన కార్పొరేటర్ మూర్తియాదవ్



సిరిపురం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం మారినా.. జీవీఎంసీ అధికారుల తీరు మాత్రం ఏ మాత్రం మారడం లేదని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ధ్వజమెత్తారు. జీవీఎంసీ అధికారుల అవినీతి, వైఖరి కారణంగా కోట్లాది రూపాయలు జీవీఎంసీ ఆదాయానికి నష్టం వాటిల్లుతోందని ఆరోపించారు. శుక్రవారం ఆయన ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీఆర్‌టీఎస్ రోడ్డులోని పోయిన సింహాచలం భూమికి ప్రత్యామ్నాయంగా భూమిని ముడసర్లోవ ప్రాంతంలోని ఏడెకరాలను గతంలోనే జీవీఎంసీ ఇచ్చేసిందన్నారు. అయితే ఆ భూముల్లో ఉన్న ఆక్రమణదారులుగా ఉన్నవారికి నాలుగు రెట్లు టీడీఆర్ జారీ చేసేందుకు సిద్ధమవుతున్నారన్నారు. సుమారుగా రూ.200 కోట్లు విలువైన టీడీఆర్‌లను సిద్ధం చేశారన్నారు. ఇప్పుడు జీవీఎంసీ గతంలో ఇచ్చేసిన డాక్యుమెంట్లను ఎందుకు బయటకు తీయడం లేదని ప్రశ్నించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నాలా పన్ను ఎగ్గొట్టేశారని, దాని విలువ సుమారుగా రూ.వెయ్యి కోట్లు ఉంటుందన్నారు. అనేక భవనాలు జీవీఎంసీ మార్ట్‌గేజ్‌లో ఉన్నా వాటిని ఎందుకు స్వాధీనం చేసుకోవడం లేదని ప్రశ్నించారు. జీవీఎంసీ పరిధిలో ఉన్న షాపులు, కల్యాణ మండపాలు ద్వారా రూ.86 కోట్ల బకాయిలు ఉన్నప్పటికీ వాటిని వసూలు చేయడం లేదన్నారు. కౌన్సిల్‌లో సైతం తీర్మానం చేసిన జైలురోడ్డు వద్ద ఉన్న నైట్ ఫుడ్‌కోర్టు ఎందుకు ఖాళీ చేయడం లేదో అర్థం కావడం లేదన్నారు. ఇదే తరహాగా ఉన్న రాజమండ్రి, కాకినాడ నైట్‌ఫుడ్‌కోర్టుల ద్వారా ఆయా కార్పొరేషన్లలో షాపులు అద్దె, లీజుకు ఇచ్చి మరీ ఆదాయాన్ని పొందుతున్నారన్నారు. ఈ విషయాలను ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ల దృష్టి తీసుకెళ్లాలని మూర్తి యాదవ్ కోరారు.

యూసీసీ టీ20 క్రికెట్ విజేత విజయనగరం



ముఖ్య అతిథి జి.జి.జె.రాజు నుంచి విన్నర్ ట్రోఫీ అందుకుంటున్న విజయనగరం జట్టు,



రన్నరప్ ట్రోఫీ అందుకుంటున్న కవలియర్స్ జట్టు సభ్యులు

విశాఖపట్నం స్పోర్ట్స్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు రైల్వే క్రికెట్ గ్రౌండ్ లో జరిగిన 11వ యూసీసీ టీ20 క్రికెట్ చాంపియన్‌షిప్ ట్రోఫీని విజయనగరం జిల్లా క్రికెట్ సంఘం కైవసం చేసుకుంది.కవలియర్స్ సీసీ (విశాఖ) రన్నరప్‌గా నిలిచింది. శుక్రవారం జరిగిన ఫైనల్స్‌లో విజయనగరం 57 పరుగుల తేడాతో కవలియర్స్‌ను చిత్తు చేసింది. తొలి బ్యాటింగ్ చేసిన విజయనగరం నిర్ణీత 20 ఓవర్లలో ఎనిమిది వికెట్లకు 209 పరుగులు చేసింది. ఓపెనర్లు గుల్ఫామ్ సాలే (18), దుర్గాకుమార్ (22) శుభారంభం ఇవ్వగా, మిడిల్ ఆర్డర్‌లో సందీప్ హాఫ్ సెంచరీ (55), తప స్వి (21), రవికిరణ్ (38), ధీరజ్‌కుమార్ (37) ధాటిగా స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. కవలియర్స్ బౌలర్లలో భువనేశ్వర్, సాయిశ్రావణ్ చెరో రెండు వికెట్లు తీశారు. లక్ష్య సాధనలో కవలియర్స్ 19 ఓవర్లలో 152 పరుగులకు ఆలౌటై ఓటమి చెందింది. కెఎస్ఎస్.రాజు అర్ధ సెంచరీతో (71) రాణించగా, వర్ధన్ (19) కాస్త తోడ్పాటు ఇచ్చాడు.మిగిలిన బ్యాటర్లు తడబడి వరుసగా వికెట్లు సమర్పించుకుని పెవిలియన్ దారి పట్టారు. ఎనిమిది బ్యాటర్లు రెండంకెల స్కోరు కూడా చేయలేక పేలవమైన ఆటను ప్రదర్శించారు. విజయనగరం బౌలర్లలో తపస్వి మూడు వికెట్లు తీయగా, వై.వాసు, రవికిరణ్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు.

రన్నరప్‌గా కవలియర్స్ సీసీ

ఆల్‌రౌండర్ ప్రతిభ చూపిన రవికిరణ్ మ్యాన్ ఆఫ్ ద ప్లేయర్‌గా నిలిచాడు. టోర్నీ బెస్ట్ ఆల్‌రౌండర్‌గా వై.వాసు (విజయనగరం), బెస్ట్ బ్యాటర్‌గా కెఎస్ఎస్.రాజు (కవలియర్స్), బెస్ట్ బౌలర్‌గా డి.క్రాంతి (వైజాగ్ వెటరన్స్) అవార్డులందుకున్నారు. టోర్నీ ముగింపు కార్యక్రమానికి ఏసీఏ మాజీ ఉపాధ్యక్షుడు జి.జె.జె.రాజు ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు, మెమెంటోలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో సోనా డోనా సీతఉవో కరణ్, యూసీసీ ప్రతినిధులు రమణమూర్తి, వెంకటేష్, శ్రీనివాస్, సోమేష్, రాంజీ, చైతన్య తదితరులు పాల్గొన్నారు. నగరంలోని పలు స్వచ్ఛంద సంస్థలకు యూసీసీ ప్రతినిధులు రూ.లక్ష విరాళాన్ని అందించారు.

వైభవంగా పైడితల్లి విగ్రహ ప్రతిష్ఠ


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వెలగపూడి, టీడీపీ నేతలు

మద్దిలపాలెం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 22వ వార్డు శివాజీపార్కు, రోడ్డు సవేరా ఫంక్షన్ హాలు పక్కన శ్రీవేపచెట్టు పైడితల్లి అమ్మవారు ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ నాయకులు బొట్టా వెంకటరమణ, దువ్వి స్వామి, రాజ్‌కుమార్, చిన్నరాజు, సురేష్, గోవిందా తదితరులు ఉన్నారు.

శివరాత్రికి ఆలయాలు సిద్ధం


పూజలకు సిద్ధమైన శివాలయం

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి ఉత్సవాలకు స్థానిక శ్రీరామానంద ఆశ్రమం, శ్రీ గౌరీజ్ఞానలింగేశ్వరాలయం ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 26న ఉదయం నుంచి శివుడికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించనున్నట్టు ఆలయ ప్రధానార్చకులు ఆరవెల్లి సూర్యప్రకాష్ శర్మ తెలిపారు. ఆ రోజు రాత్రి నుంచి ప్రాతఃకాలం వరకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలుచేపడతామన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రావాలని పిలుపునిచ్చారు.

పీజీఆర్‌ఎస్‌పై అవగాహన సదస్సు


అవగాహన కల్పిస్తున్న ఏడీసీలు రమణమూర్తి, ఎస్ఎస్ వర్మ

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీలో విధులు నిర్వహిస్తున్న ప్రతి ఉద్యోగి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలని, నిర్ణీత సమయంలో సంబంధిత ప్రజా ఫిర్యాదుల సమస్యలను పరిష్కరించాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్‌పై జీవీఎంసీ అధికారులు, ఉద్యోగులకు అవగాహన కార్యక్రమాన్ని జీవీఎంసీ అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మతో కలిసి నిర్వహించారు.

ఈ సందర్భంగా ఏడీసీ రమణమూర్తి మాట్లాడుతూ ప్రజలకు అందిస్తున్న సేవల్లో భాగంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోన్న పీజీఆర్ఎస్‌ను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ప్రజలు సమర్పించిన అర్జీలు/ ఫిర్యాదులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలన్నారు. ప్రతి రోజూ పీజీఆర్ఎస్‌పై ఫిర్యాదుల కోసం అధికారులు, ఉద్యోగులు నిర్ణీత సమయం కేటాయించాలని సూచించారు. చాలా మంది ఉద్యోగులు పీజీఆర్ఎస్‌పై నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. దీనివల్ల ప్రజా సమస్యలు నిర్ణీత సమయంలో పరిష్కారం కావడం లేదన్నారు. అశ్రద్ధ వహించిన వారిపై ఇప్పటికే ఛార్జ్ మెమోలు జారీ చేయడం జరిగిందని, ఇకపై క్రమశిక్షణ చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. పీజీఆర్ఎస్ కోసం ముఖ్యమంత్రి కార్యాలయంలో ప్రత్యేకంగా నోడల్ అధికారులు రాష్ట్ర స్థాయిలో సమస్యల పరిష్కారంపై నిత్యం విచారణ చేపడుతున్నారన్నారు.

అనంతరం అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వారంలో మూడుసార్లు సుదీర్ఘంగా నోడల్ అధికారి పీజీఆర్ఎస్ కార్యక్రమాలపై సమీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు. జిల్లా కలెక్టర్ దీనిపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ప్రతి అధికారి, ఉద్యోగి పీజీఆర్ఎస్ నిర్లక్ష్యం వహించకుండా ప్రత్యేక ప్రాధాన్యతతో విధులను నిర్వహించాలన్నారు. పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులు, ఉద్యోగులకు వివరించారు. కార్యక్రమంలో ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ సి.వాసుదేవరెడ్డి, ఫైనాన్స్ అడ్వైజరు మల్లికాంబ, సిటీ ప్లానర్ ధనుంజయరెడ్డి, జోనల్ కమిషనర్లు, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

బయో డైవర్సిటీ పార్కు సందర్శించిన విద్యార్థులు


పార్కు సందర్శించిన శ్రీషిర్డీసాయి డిగ్రీ కళాశాల విద్యార్థులు

పెదవాల్తేరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : స్థానిక రాణిచంద్రమణీదేవి ఆస్పత్రి ఆవరణలో గల బయోడైవర్సిటీ పార్కును బుధవారం శ్రీ షిర్డిసాయి (ఎస్ఎస్ఎస్) డిగ్రీ కళాశాల విద్యార్థులు సందర్శించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.మోహన్‌రావు, వైస్ ప్రిన్సిపాల్ వెంకటరావు ఏఎన్ఏ (జూ డిపార్ట్‌మెంట్) పర్యవేక్షణలో 40 మంది విద్యార్థులు పార్కులోని మొక్కలను పరిశీలించారు. వివిధ రకాల అరుదైన మొక్కల విశిష్టత, వాటి పరిరక్షణకు తీసుకునే చర్యల గురించి విద్యార్థులకు పార్కు నిర్వాహకులు రామమూర్తి వివరించారు. అనంతరం సెల్ఫ్ ఎక్స్‌ప్లనేటరీ బోర్డులతో అధ్యయనం చేస్తున్న వందలాది ఔషధ మొక్కలను చూసి ముగ్ధులయ్యారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది వి.రమ్య కుమారి (వృక్షశాస్త్ర విభాగం) తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాములను పరిశీలించిన కలెక్టర్


విజిటర్స్ రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ఆరిలోవ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : చినగదిలి గ్రామీణ మండలంలో ఉన్న ఈవీఎం గోదాంలను జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ శుక్రవారం ఉదయం తనిఖీ చేశారు. నెలవారి తనిఖీల్లో భాగంగా ఆయన గోదాంలను సందర్శించి అక్కడ పరిస్థితులను గమనించారు. సీసీ కెమెరాల పనితీరు, ప్రధాన ద్వారానికి ఉన్న సీళ్లను పరిశీలించారు. భద్రతా ప్రమాణాలపై అక్కడ అధికారులు, భద్రతా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ పర్యటనలో భాగంగా విజిటింగ్ రిజిస్టర్‌లో కలెక్టర్ సంతకం చేశారు.

నేడు ఇంటర్ ఒకేషనల్ పరీక్షలు

ఆరిలోవ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు శనివారం ఒకేషనల్ పరీక్షలునిర్వహిస్తున్నట్టు శ్రీకృష్ణాపురంలోని అంబేద్కర్ గురుకులం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.రత్నవల్లి తెలిపారు. ఈ పరీక్షలకు తమ కళాశాల నుంచి మొత్తం 37 విద్యార్థులు హాజరు కానున్నట్టు చెప్పారు. వీరిలో 19 మంది బ్యూటీ అండ్ వెల్‌నెస్ పరీక్ష, ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్స్‌కు 18 మంది అభ్యర్థులు రాస్తున్నట్టు వెల్లడించారు. ఈ పరీక్షలు తమ కళాశాలలోనే జరుగుతాయని తెలిపారు.

విజయదుర్గా అమ్మవారిని దర్శించుకున్న నగర మేయర్


అమ్మవారిని దర్శించుకుంటున్న మేయర్ హరివెంకటకుమారి

ఆరిలోవ, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి) : హనుమంతవాక జంక్షన్‌కు చేరువలో గల విజయదుర్గా కాలనీలో వెలిసిన విజయదుర్గా అమ్మవారి ఆలయ 28వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నగర మేయర్ హరివెంకటకుమారి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు సంపత్‌కుమార్ శర్మ ఆమెకు స్వాగతం పలికి పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన యోగా శిక్షణ శిబిరం

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఎస్.యోగా, శివాజీ పార్కు గొడుగు వాకర్స్ అసోసియేషన్ సంయుక్త నిర్వహణలో ఈ నెల 17 నుంచి శివాజీ పార్కులో నిర్వహిస్తున్న యోగాలో వివిధ పద్ధతులపై శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. యోగా గురువైన శివలక్ష్మణ్ దాదాపు 50 మంది యోగా అభ్యసకులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణలో వివిధ ప్రాణాయామ పద్ధతులు, సూర్య నమస్కారాలు, సంపూర్ణ ఆరోగ్యానికి యోగ ఏ విధంగా ఉపయోగపడుతుందో తెలియజేశారు. ఈ శిక్షణ కార్యక్రమాలన్నీ యోగా గురువైన రాజగోపాల్ పర్యవేక్షణలో జరిగాయి. ముగింపు సభలో వాకర్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ద్వారకానాథ్ ముఖ్యఅతిథిగా విచ్చేసి యోగా భౌతిక, మానసిక ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగపడుతుందని సూచించారు. గౌరవ అతిథి మహేష్ మాట్లాడుతూ యోగాపై తన అనుభవాలను తెలియజేశారు. గొడుగు వాకర్స్ క్లబ్ అధ్యక్షులు కె.శివరామకృష్ణ, ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ ఎన్.రామకృష్ణ, కార్యదర్శి వి.సత్యనారాయణ, సభ్యులు పాల్గొన్నారు.

కొండదారిలో వెలుగులు

మాదవదార, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 51వవార్డు పరిధి మాధవస్వామి ఆలయాలకు వెళ్లే దారిలో శుక్రవారం జీవీఎంసీ వీధి దీపాల నిర్వహణ విభాగం మరమ్మతులు చేపట్టింది. ఇక్కడి కొండ దారిలో బ్లాక్ నంబర్-19 వాటర్ పంప్‌హౌస్ ఎదుట నిరుపయోగంగా మారిన పాత హైమాస్ట్ దీప స్తంభాల స్థానంలో కొత్తవి అమర్చారు. నిత్యం చీకటిగా ఉండే ఈ దారిలో ప్రయాణికులు ఇబ్బంది పడేవారు. మాఘ మాసంలో వేకువన కొండపైన ఆలయాలకు వెళ్లే భక్తులు, అర్చక బృందం కొండదారిలో చీకటిలోనే ప్రయాణం చేయక తప్పలేదు. దీంతో వీరు జీవీఎంసీ విద్యుత్ విభాగానికి మొరపెట్టుకోగా, ఎట్టకేలకు ఏఈఈ అర్జున పర్యవేక్షణలో సిబ్బంది వెలుగులు కల్పించారు. ఇక నుంచి ప్రభాత నడకకు వచ్చే వారికి, క్రీడాకారులకు ఊరట కలగనుంది.



కొత్తగా వేస్తున్న విద్యుత్ స్తంభాలు

దళారులను ఆశ్రయించొద్దు

» రైతుబజార్ సందర్శనలో రైతులతో మార్కెటింగ్ కమిటీ కార్యదర్శి



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ కార్యదర్శి పాపారావు

సీతమ్మధార, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధారలో గల రైతుబజార్‌ను అగ్రికల్చర్ మార్కెటింగ్ కమిటీ కార్యదర్శి పాపారావు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ రైతులతో మాట్లాడారు. టమాటా పండించే రైతులు తమకు గిట్టుబాటు ధర వచ్చే విధంగా నేరుగా రైతుబజార్‌కు తీసుకువచ్చి అమ్ముకోవాలన్నారు. ఎట్టిపరిస్థితుల్లోనూ దళారులను ఆశ్రయించవద్దన్నారు. రైతుబజార్ ఎస్టేట్ అధికారి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

కారు, ఆటో ఢీ..

డ్రైవరుకు స్వల్ప గాయాలు



దెబ్బతిన్న ఆటోను నెడుతున్న పోలీసులు

మురళీనగర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి ఆర్‌అండ్‌బీ జంక్షన్ సిగ్నల్ లైట్ల వద్ద శుక్రవారం ఉదయం ఓ ఆటో వేగంగా వచ్చి కారుని ఢీ కొట్టింది. ఈ ప్రమాదం కారణంగా జంక్షన్‌లో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. వేగంగా దూసుకొచ్చిన ఆటో డ్రైవరుదే తప్పిదమని క్షేత్రస్థాయిలో ఉన్న ట్రాఫిక్ విభాగం కానిస్టేబుల్ నిర్ధారించారు. ప్రమాదంలో ఆటో అద్దం పూర్తిగా విరిగిపోయింది. ఆటో ముందు భాగం దెబ్బతింది. కారు యజమాని, ఆటోవాలా రోడ్డుపైనే వాగ్వాదానికి దిగడంతో పక్కనే ఉన్న ఎయిర్‌పోర్ట్ స్టేషన్‌కి పోలీసులు రెండు వాహనాల్ని తరలించారు. ఆటోవాలా గాయపడడంతో ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసిన ఎయిర్‌పోర్ట్ జోన్ పోలీసులు విచారణ చేపడుతున్నారు.

కథల పోటీలతో పిల్లల్లో సృజనాత్మకతను వెలికితీయవచ్చు

» నారాయణ ఏజీఎం రాజ్‌కుమార్



న్యాయనిర్ణేతలను సత్కరిస్తున్న అతిథులు

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కథల పోటీల ద్వారా పిల్లల్లోని సృజనాత్మకతను వెలికితీసే అవకాశం కలుగుతుందని నారాయణ విద్యాసంస్థలు విశాఖపట్నం ఏజీఎం రాజ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్స్ ఆధ్వర్యంలో 'కథా నిర్వహణ' పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన జ్యోతి ప్రజ్వలన చేశారు. కళా హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ పి.వి.రమణమూర్తి న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. ఈ పోటీల్లో చిన్నారులు వివిధ కథలను ఆసక్తికరంగా హావభావాలతో చెప్పి ఆకట్టుకున్నారు. నృత్య ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో సుస్మిత, ప్రవంతి, జ్యోతి, మౌని, లావణ్య, రఘుబాబు, మాధవీ లత, రామ్ రమేష్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

రూపుదాల్చని రిసెప్షన్ హాలు నిర్మాణం



ఎయిర్‌పోర్టు జోన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో పనులు ఆపేసిన రిసెప్షన్ హాలు నిర్మాణం

మాదవదార, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని ఆర్ అండ్ బీ జంక్షన్ హైవే సమీపంలో ఉన్న ఎయిర్ పోర్ట్ జోన్ పోలీసు స్టేషన్ ఆవరణలో కొత్తగా ఆరంభించిన రిసెప్షన్ హాలు నిర్మాణాన్ని మధ్యలోనే నిలిపేశారు. ఇక్కడ సీఐ మారినపుడల్లా వాస్తు నమ్మకాలు పాటిస్తున్నారు. ఈ నేపథ్యంలో స్టేషన్‌కి తూర్పువైపున ఉన్న ప్రధాన ప్రవేశ ద్వారాన్ని కొన్ని నెలల క్రితమే మూసేశారు. ఇక్కడ రిసెప్షన్ బ్లాకు పెట్టి స్టేషన్ మెయిన్ గేట్ ఉత్తర వైపు ఉన్న ద్వారానికి మార్చారు. అక్కడే ప్రధాన ప్రవేశద్వారం ఏర్పాటు చేసి వచ్చుదనం పెంచుకున్నారు.

హాలు నిర్మాణం గాలికి..

తూర్పు గేట్ వద్ద ఉన్న పార్కింగ్ స్థలంలో కొంత భాగంలో చిన్నపాటి రిసెప్షన్ హాలు కట్టడం ఆరంభించి దాదాపు ఏడాది కావస్తున్నా పనులు కొలిక్కి రాలేదు. సీఐ మారినపుడు పాత ప్రాధమ్యాలు అటకెక్కుతున్నాయి. దీంతో ఇపుడు ఇక్కడి స్టేషన్‌లో రెండు నెలల క్రితమే శాంతిభద్రతల సీఐగా బాధ్యతలు చేపట్టిన జి.ఉమామహేశ్వరరావు పర్యవేక్షణలో రిసెప్షన్ హాలు కట్టడం పూర్తి కావాలి. విధుల భారంతో స్టేషను సొబగులు చూసే నాథుడే లేరు. దీంతో తలపెట్టిన కొత్త నిర్మాణాల పనులు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. స్టేషన్‌కి వచ్చే వారికి పక్కనే ఏర్పాటు చేసిన వెయిటింగ్ హాలు గదిలోనూ నిర్మాణాలు పూర్తి చేయలేదు. ఫిర్యాదుదారులు స్టేషన్ ఎదుట ఆరుబయటే పడిగాపులు పడుతున్నారు. రిసెప్షన్ హాలు కూడా స్టేషన్ గేటు లోపలే వరండాలో నెట్టుకొస్తున్నారు. కొత్త నిర్మాణం పూర్తయితే, స్టేషన్‌లో విధులు చేపట్టే సిబ్బందికీ, కేసుల పరిష్కారం కోసం వచ్చే వారికీ కాస్త వెసులుబాటు దొరుకుతుంది. ఈ దిశగా పోలీసు స్టేషన్ అధికారులు దృష్టి సారించాలని, సందర్శకులకు సౌకర్యంగా నిర్మాణం పూర్తి చేయాలని కోరుకుంటున్నారు.

రఘువర్మ గెలుపునకు కృషి చేయండి: గండి బాబ్జీ



టీడీపీ కార్యాలయంలో ఉత్తర నియోజకవర్గ నాయకులతో సమావేశమైన గండి బాబ్జీ



ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతున్న దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ

విశాఖపట్నం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానం నుంచి పోటీ చేస్తున్న పాకలపాటి రఘువర్మ విజయం కోసం ప్రతి ఒక్కరూ కృషిచేయాలని విశాఖ పార్లమెంటు తెలుగుదేశం అధ్యక్షుడు గండి బాబ్జీ పిలుపునిచ్చారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో విశాఖ ఉత్తర నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఉత్తరాంధ్ర పట్టభద్ర ఎన్నికల్లో టీడీపీని గెలిపించిన విషయాన్ని గుర్తుచేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాకలపాటి రఘువర్మకు కూటమి మద్దతు పలికినందున ప్రతి ఒక్కరూ కష్టపడి ఆయన్ని గెలిపించాలన్నారు. సమావేశంలో విశాఖ ఉత్తర పరిశీలకుడు రవిశేఖర్, విశాఖ పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావు, ఉత్తర నియోజకవర్గ నాయకుడు వెల్లంకి భరత్, ససపల వరప్రసాద్, ఆకిరెడ్డి జగదీష్, కోట నరేష్ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే విద్యావేత్తలు: ఎమ్మెల్యే వంశీకృష్ణ

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి మద్దతు తెలియజేసిన అభ్యర్థి పాకలపాటి రఘువర్మను గెలిపించాలని దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. శుక్రవారం విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించారు. విద్యావేత్తలు కూటమి ప్రభుత్వంతో ఉన్నారని, భవిష్యత్‌లో కూడా కలిసి నడుస్తారని ఆయన విశ్వాసం వ్యక్తంచేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అందరూ ఓటుహక్కు వినియోగించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

రైల్వేలో శతాబ్ది విద్యుదీకరణ వేడుక



రైల్వే విద్యుదీకరణ నమూనా ప్రదర్శనను తిలకిస్తున్న డీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహు, ఇతర అధికారులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): భారతీయ రైల్వేలో విద్యుదీకరణ రైళ్లు అందుబాటులోకి వచ్చి వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారంలో వాల్తేరు డివిజన్‌లో శతాబ్ది విద్యుదీకరణ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహు సారథ్యంలో అధికారులు, ఉద్యోగులు శుక్రవారం డీఆర్ఎం కార్యాలయం నుంచి రైల్వేస్టేషన్‌కు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ దేశంలో మొదటి విద్యుత్ రైలు 1925 ఫిబ్రవరి 3న అప్పట్లో విక్టోరియా టెర్మినస్‌గా పిలిచే ఇప్పటి ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినస్ నుంచి ముంబై కుర్లా వరకు నడిచిందని తెలిపారు. విద్యుదీకరణ వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పలు సదస్సులు, ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం స్టేషన్‌లో ఏర్పాటు చేసిన రైల్వే విద్యుదీకరణ సాంకేతిక పురోగతిని తెలిపే ప్రదర్శనను సందర్శించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ (ట్రాక్షన్) బి.షణ్ముఖరావు, సీనియర్ ఎలక్ట్రికల్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

భూముల రీసర్వే సమాచారాన్ని ముందుగా ప్రకటించండి: కలెక్టర్

భీమునిపట్నం (రూరల్) ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రీసర్వే చేపట్టబోయే గ్రామాల సమాచారాన్ని ముందుగా గ్రామాల్లో రైతులకు తెలియజేయాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ యంత్రాంగాన్ని ఆదేశించారు. శుక్రవారం భీమిలి మండలం దాకమర్రి గ్రామ సచివాలయాన్ని అధికారులతో కలిసి ఆయన సందర్శించారు. రీసర్వే సమాచారాన్ని ముందుగా తెలియజేస్తే రైతులు తమ సమస్యలు తెలియజేయడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో కలిసి పంటపొలాలను పరిశీలించారు. భూముల పరిరక్షణ, సరిహద్దుల గుర్తింపు, దీర్ఘకాలిక భూ సమస్యలు శాశ్వత పరిష్కార దిశగా రెవెన్యూ అధికారులు కృషి చేయాలని కలెక్టర్ కోరారు. రైతుల అభిప్రాయాలను, వారు చెప్పే సమస్యలను పరిగణనలోకి తీసుకుని అందుకు అనుగుణంగా సర్వే చేపట్టాలని ఆదేశించారు. దాకమర్రి గ్రామ సచివాలయంలో సిబ్బంది పనితీరును పరిశీలించారు. ప్రజలకు నిత్యం సేవలందేలా సిబ్బంది అందుబాటులో ఉండాలని కోరారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి: సీఐ



కంచరపాలెం ఐటీఐ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎయిర్‌పోర్టు ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు

కంచరపాలెం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై యువత అప్రమత్తంగా ఉండాలని ఎయిర్ పోర్టు ట్రాఫిక్ సీఐ నిమ్మకాయల శ్రీనివాసరావు సూచించారు. కంచరపాలెం ప్రభుత్వ పాత ఐటీఐ ప్రాంగణంలో, నరవ ఐటీఐలో శుక్రవారం విద్యార్థులకు నేర నియంత్రణ, యువత పాత్రపై అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ సాంకేతికత దృష్ట్యా సెల్‌ఫోన్లకు వచ్చే సందేశాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఊరకనే ఎవరూ డబ్బులు పంపించరని, బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని చెప్పి ఓటీపీ అడిగితే చెప్పవద్దన్నారు. సెల్ ఫోన్లు, బైక్ దొంగతనాలు, రాత్రి సమయంలో ఇళ్లల్లో చోరీలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మత్తు పదార్థాలకు బానిసై యువత నేరాలకు పాల్పడి జీవితాలు నాశనం చేసుకుంటున్నారన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో కష్టపడి చదువుకుని ఉన్నత జీవితాన్ని పొందాలని ఆకాంక్షించారు. అవసరమైనప్పుడు నేరస్తులను పట్టించడంలో పోలీసులకు తమ వంతు సహకారం అందించాలని కోరారు. అనుమానితులు కనిపిస్తే 112 నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

జ్ఞానాపురం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ సిస్టర్ డా.షైజీ ప్రారంభించారు. ద్వితీయ భాషా విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అతిథులుగా హాజరైన అధ్యాపకులు డాక్టర్ నిర్మల, డాక్టర్ ఎస్.దీప్తి, డాక్టర్ కోటేశ్వరరావు మాతృభాష ప్రాశస్త్యం, ఆంగ్లభాష, రాజభాష ఆవశ్యకత గురించి వివరించారు. అనంతరం విద్యార్థుల సృజనకు పదును పెడుతూ పోటీలు నిర్వహించారు. విజేతలకు ద్వితీయ భాష విభాగ అధ్యక్షులు పి.కె.జయలక్ష్మి ప్రమాణ పత్రాలు అందజేశారు.

'మార్చి 24, 25 తేదీల్లో సమ్మెను విజయవంతం చేయాలి'



యూనియన్ బ్యాంక్ వద్ద నినదిస్తున్న బ్యాంకు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు

సీతమ్మధార, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): బ్యాంక్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మార్చి 24, 25 తేదీల్లో దేశవ్యాప్తంగా నిర్వహించ తలపెట్టిన సమ్మెను విజయవంతం చేయాలని యూఎఫ్‌బీయూ కన్వీనర్ ఆర్.వసంతరావు పిలుపునిచ్చారు. సీతమ్మధారలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. తమ సమస్యలు ప్రస్తావిస్తూ బ్యాంకు ఉద్యోగులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వసంతరావు మాట్లాడుతూ అన్ని బ్యాంకుల్లో ఉద్యోగ నియామకాలు చేపట్టాలని, వారానికి అయిదు రోజుల పని దినాలు అమలు పరచాలని, ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో వర్క్‌మెన్, ఆఫీసర్లు, డైరెక్టర్ల పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మహీంద్ర, అడారి శ్రీను, రమేష్, ఈశ్వర్, శ్రీనివాస్, అనిల్, సుజాత, ప్రత్యూష, బ్యాంక్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై మత్స్యకారులకు అవగాహన సదస్సు

మహారాణిపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మత్స్యకారులు, మత్స్య అనుబంధ పరిశ్రమలలో పనిచేస్తున్న వారు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మత్స్యశాఖ సహాయ సంచాలకుడు పి.లక్ష్మణరావు సూచించారు. శుక్రవారం మత్స్యశాఖ కార్యాలయంలో ప్రధానమంత్రి మత్స్య కిసాన్ సమృద్ధి సహయోజనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మత్స్యకారుల సంక్షేమానికి అమలు కానున్న పథకాలు, అవకాశాలపై జోనల్ డైరెక్టర్ బాబిరెడ్డి వివరించారు. మత్స్యకారులను అసంఘటిత కార్మికులుగా గుర్తించినందున రిజిస్ట్రేషన్ చేయించుకొని కేంద్ర బీమా సౌకర్యం వినియోగించుకోవాలని సూచించారు. పీఎంఎస్ఎస్‌వై, పీఎంఎంకేఎస్‌పై పథకాలను వివరిస్తూ మత్స్యకారుల సలహాలు, సూచనలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్లు డా.మీనా, టిప్నేష్, అధికారులు సుజిత్, ఆశాజ్యోతి, మురళి, ఆశా, హనుమంతరావు, బోట్ అసోసియేషన్ ప్రతినిధులు ఎం. లక్ష్మణరావు, ఎం.బాలాజీ, వీర్రాజు, పోతురాజు, పరదేశీ తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్‌లో పంచాయితీ

» ఆర్డీడీ, జూనియర్ అసిస్టెంట్ మధ్య వివాదం » పరస్పరం ఫిర్యాదులు
» ఉన్నతాధికారులు దృష్టిసారించకపోతే ఈ తరహా వ్యవహారాలు మిగిలిన శాఖలకూ విస్తరించే ప్రమాదం

విశాఖపట్నం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): 'ఆయుష్' శాఖ పరువు రోడ్డునపడింది. తనపై కింది స్థాయి ఉద్యోగి చేయి చేసుకుందంటూ ఉన్నతాధికారిణి, ఉన్నతాధికారిణే తనను కొట్టడం, కులంపేరుతో దూషించారంటూ జూనియర్ అసిస్టెంట్ పరస్పరం పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. మధురవాడలోని చిన్న భవనంలో రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం ఉంది. అందులో రీజినల్ డిప్యూటీ డైరెక్టర్, ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లు, మరో జూనియర్ అసిస్టెంట్, డీఈవో, మరో హెల్పర్ పనిచేస్తున్నారు. అయితే, ఇన్‌చార్జి ఆర్డీడీగా పనిచేస్తున్న అధికారిణి తనను కొట్టారని, కులం పేరుతో దూషించారంటూ అక్కడ పనిచేసే జూనియర్ అసిస్టెంట్ ఒకరు కార్యాలయం బయట ఆందోళనకు దిగారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తనను జూనియర్ అసిస్టెంట్ కొట్టారంటూ పోలీస్ స్టేషన్‌లో సదరు ఇన్‌చార్జ్ ఆర్డీడీ కూడా ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులపై పోలీసులు విచారణ చేపట్టారు. రెండుసార్లు కార్యాలయానికి వచ్చి పలు వివరాలను సేకరించారు.

ఉన్నతాధికారులు దృష్టిసారించాలి..

కార్యాలయంలో జరిగిన వివాదంపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలి. ముఖ్యంగా జిల్లా కలెక్టర్ ఈ వ్యవహారంపై ప్రత్యేకంగా దృష్టి సారించి తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని అదే శాఖలో పని చేస్తున్న ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో ఈ తరహా వ్యవహారాలు మిగిలిన శాఖలకు విస్తరించే ప్రమాదం ఉందంటున్నారు. 'ఆయుష్'లో గొడవపై డిప్యూటీ కలెక్టర్ శేషశైలజ విచారణ జరిపినట్టు చెబుతున్నారు. వివరాలు తెలియాల్సి ఉంది.

26న నీలమ్మ అమ్మవారి పండుగ మహోత్సవం



అల్లిపురం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): అల్లిపురం నీలమ్మ వేపచెట్టు అమ్మవారి జాతర మహోత్సవం ఈ నెల 26న మహాశివరాత్రి రోజున ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ జీవీ రమాబాయి చెప్పారు. ఈ ఉత్సవాల్లో భాగంగా 25న తొలేళ్ల ఉత్సవం రోజున అమ్మవారికి సారె సమర్పణ, పల్లకి సేవ, అగ్ని గుండం తొక్కడం వంటివి ఉంటాయని పేర్కొన్నారు. 26న ఉదయం 5 గంటల నుంచి అమ్మవారికి క్షీరాభిషేకం, కుంకుమ పూజ,దర్శనాలు ఉంటాయని, సాయంత్రం విద్యుత్ దీపాలంకరణ, సాంస్కృతిక కార్యక్రమాలతో జాతర జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

టెక్నికల్ ఫెస్ట్‌లో గొన్నా విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న హేమచంద్ నాయుడు

అగనంపూడి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జేఎన్‌టీయూ విజయనగరంలో నిర్వహించిన జాతీయ స్థాయి టెక్నికల్ ఫెస్ట్‌లో గొన్నా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టుకు ద్వితీయ స్థానం దక్కింది. ఈ సందర్భంగా శుక్రవారం వారిని కళాశాల కార్యదర్శి హేమచంద్‌నాయుడు అభినందించారు. ప్రాజెక్టులు రూపొందించి బహుమతుల సాధించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

యథేచ్ఛగా పశువుల సంచారం!



మాధవధారలో దారిని ఆక్రమించిన పశువులు

మాధవధార, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మాధవధార, ఉడాకాలనీ ప్రాంతాల్లో పశువుల సంచారం పెరగడంతో నివాసితులు, బాటసారులు ఇబ్బందులు పడుతున్నారు. కొండవక్కగా ఉండే ఉడాకాలనీ, మాధవధార మెయిన్‌రోడ్డు ప్రాంతాలు సహా హైవే రోడ్లపైన పెంపకందారులు తమ పశువులను యథేచ్ఛగా విడిచి పెడుతున్నారు. కాలనీలో ఇళ్ల ముందు పెరటి మొక్కల్ని తినేసి పాడుచేస్తున్నాయని, రోడ్లపై అడ్డంగా ఉంటున్నాయని జీవీఎంసీ పారిశుధ్య సచివాలయాల సిబ్బందికి తరచూ ఫిర్యాదులు అందుతున్నాయి. 48ఎ, 48ఎస్ బస్సులు తిరిగే మెయిన్ రోడ్లలోనూ, మాధవధార హైస్కూలు ప్రాంతాల్లో ఆవులు, గేదెలతో స్థానికులు నిత్యం ఇరకాటంలో పడుతున్నారు. మాధవధార ఆలయ ప్రాంగణంలోనూ పశువుల సంచారం నిత్యకృత్యంగా మారింది.

దక్షిణ కోస్తా జోన్‌పై చిన్నచూపు

... 5వ పేజీ తరువాయి

భారత రైల్వే ఉద్యోగుల సమాఖ్య (ఏఐఆర్ఎఫ్), రైల్వే ఉద్యోగుల జాతీయ సమాఖ్యలు గుర్తింపు యూనియన్లుగా గౌరవం దక్కించుకున్నాయి. ఇప్పుడు కొత్తగా ఏర్పాటయ్యే జోన్‌లోను, వాటి పరిధిలోని డివిజన్లలోను ఈ యూనియన్లకు అధిక ప్రాధాన్యం లభిస్తుంది. ఆస్తుల పంపకాలు, ఉద్యోగుల బదిలీలు, కొత్త పోస్టులు వంటి విషయాల్లో ఈ సంఘాలు అప్రమత్తంగా వ్యవహరించి ఈ ప్రాంత ప్రయోజనాలు కాపాడాల్సి ఉంది.

యూనియన్లు చాలా కీలకం

రైల్వేలో యూనియన్లు చాలా కీలకంగా ఉంటాయి. వేతన సవరణ, ఉత్పాదకతతో ముడిపడిన బోనస్, వివిధ రకాల భత్యాల పెంపు, రైల్వే క్వార్టర్ల నిర్మాణం, సంక్షేమ కార్యక్రమాల అమలు, పనిభారం తగ్గింపు, పదోన్నతులపై పోరాటం చేస్తూ ఉద్యోగులకు అండగా ఉంటాయి. కాబట్టి ప్రాంతీయ అవసరాలకు అనుగుణంగా ఈ సంఘాలు ఇప్పుడు అన్నీ సమకూర్చుకోవలసి ఉంది. ఇదే సరైన సమయం.

- పలసాని గాంధీ, మాజీ ఉపాధ్యక్షుడు, ఏఐఆర్ఎఫ్

విద్యుత్ లోడు క్రమబద్ధీకరణ

... 5వ పేజీ తరువాయి

రాయితీ ఇవ్వాలని ఏపీఈఆర్‌సీ సూచించింది. మార్చి 1వ తేదీ నుంచి ఇది అమలులోకి వస్తుంది. ఆన్‌లైన్‌లో దీనికి దరఖాస్తు చేసుకోవచ్చు. ఇప్పుడు నగరంలో ఎక్కువ డబుల్ బెడ్ రూమ్ ఫ్లాట్లు, ఇళ్లు ఎక్కువయ్యాయి. ప్రతి గదికి ఏసీ, బాత్రూమ్‌లో గీజర్, కిచెన్‌లో ఓవెన్, గ్రైండర్ వంటివి ఉంటున్నాయి. ఇంకా కొందరు హాలులో కూడా ఏసీ పెట్టుకుంటున్నారు. ఇలాంటి ఇళ్లకు కనీసం 5 కిలోవాట్ల విద్యుత్ లోడ్‌కు సరిపడా ఫీజులు చెల్లించాలి. కానీ చాలా మంది కిలోవాట్, రెండు కిలోవాట్లకే ఫీజులు కట్టి అధిక విద్యుత్ వినియోగిస్తున్నారు. ఇలాంటి వారంతా ఇప్పుడు వారి కనెక్షన్లను వాస్తవ లోడ్‌తో క్రమబద్ధీకరించుకోవచ్చు. వీరు కిలోవాట్ల లెక్కన సెక్యూరిటీ డిపాజిట్‌తో పాటు అదనపు డెవలప్‌మెంట్ ఫీజులు కట్టాలి. ఇందులో ఫీజులో 50 శాతం రాయితీ లభిస్తుంది.

త్వరలో మార్గదర్శకాలు

అదనపు లోడు క్రమబద్ధీకరించాలని ఏపీఈఆర్‌సీ తాజాగా ఆదేశాలు ఇచ్చింది. దీనికి సంబంధించి మార్గదర్శకాలు రావాలసి ఉంది. మార్చి 1వ తేదీ నుంచి అమలులోకి వస్తుంది. దీనికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు

- శ్యామ్‌కుమార్, ఎస్ఈ, విశాఖ సర్కిల్

22-ఏ...కష్టాలకు చెల్లు

... 5వ పేజీ తరువాయి

ఉద్యోగులు మూడు దశాబ్దాల క్రితం ప్రభుత్వం నుంచి భూమి కొనుగోలు చేసి లేఅవుట్ వేసుకున్నారు. ఈ లేఅవుట్‌లో కొంత గెడ్డ పోరంబోకు భూమి ఉండడంతో ప్రస్తుతం చాలా భాగం 22-ఎలో ఉంది. అదేవిధంగా మాజీ సైనికులు, స్వాతంత్ర్య సమరయోధులకు ఇచ్చిన భూములకు ఎన్‌వోసీ తీసుకుని లేఅవుట్‌లు వేయగా..పలువురు కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకున్నారు. అయితే మాజీ సైనికుల భూముల విషయంలో కొందరు సిట్‌కు ఫిర్యాదు చేయడంతో 22-ఎలో చేర్చారు. భూములు కొనుగోలు చేసినవారు, ఇళ్లు నిర్మించుకున్నవారు ఇప్పుడు అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. అయితే తాజాగా 22-ఎ భూములపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో జిల్లాలో అనేకమందికి ఊరట లభించనున్నది. నిషేధ భూముల జాబితా నుంచి తమకు మినహాయింపు ఇవ్వాలని సుమారు 350 మంది వరకూ వినతిపత్రాలు సమర్పించారని ఒక అంచనా.

టెన్త్ పరీక్షలకు ఇన్విజిలేటర్ల కొరత

... 5వ పేజీ తరువాయి

పాఠశాలలు మూత పడడం లేదా బోధన కుంటుపడడం జరిగేది. ఈ నేపథ్యంలో పదో తరగతి పరీక్షల నిర్వహణకు ప్రాథమిక పాఠశాలల టీచర్లను సాధ్యమైనంత తక్కువగా నియమించాలని పాఠశాల విద్యా శాఖ నిర్ణయించింది. అందుకే ఎక్కువమంది స్కూలు అసిస్టెంట్లను ఇన్విజిలేటర్లుగా నియమిస్తున్నారు. అదే సమయంలో ఉన్నత పాఠశాలల్లో ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు బోధనకు ఇబ్బందిలేకుండా చూడాలని డీఈవోలకు ఆదేశాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఇన్విజిలేటర్ల బాధ్యతల నిర్వహణకు అనకాపల్లి జిల్లా నుంచి 290 మందిని పంపాలని కోరినట్టు డీఈవో నిమ్మక ప్రేమ్‌కుమార్ తెలిపారు.

సెంట్రల్ జైలులో సేంద్రీయ సాగు

» కూరగాయలు పండిస్తున్న ఖైదీలు » ధర తక్కువ, ఆరోగ్య పరిరక్షణ కావడంతో మక్కువ చూపుతున్న కొనుగోలుదారులు

ఆరిలోవ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర కారాగారంలో జైలు అధికారులు ఖైదీల నిర్వహిస్తున్న కూరగాయల సాగు సత్ఫలితాలను ఇస్తోంది. జైలు లోపల వ్యవసాయ క్షేత్రాల్లో పలు రకాలు కూరగాయలు, ఆకుకూరలు, పండ్ల సాగును నిర్వహిస్తున్నారు. సీజనల్‌గా వ్యవసాయ పనులను చేయిస్తూ ఈ పంటలను సాగు చేయిస్తున్నారు. ప్రస్తుతం బీరకాయలు బాగా పండి కోత దశకు రావడంతో వీటి విక్రయానికి జైలు అధికారులు చర్యలు తీసుకొంటున్నారు. అలాగే ఇక్కడ ప్రత్యేకంగా నీటి సదుపాయాని కల్పించి ఆకుకూరలు కూడా పండేలా చేస్తున్నారు. జైలు ఓపెన్ ఖైదీలతో ఈ సాగు పనులు చేయిస్తున్నారు. దీంతో



అమ్మకానికి సిద్ధం చేసిన టమాటా



దిగుబడికి వచ్చిన బీరకాయలను కోస్తున్న కారాగార సిబ్బంది



ఖైదీలు పండించిన క్యాబేజీ, కొబ్బరి, వంకాయలు

వారికి పని విధానాన్ని అలవడేలా జైలు అధికారులు కృషి చేస్తున్నారు.

ఏదో తప్పు చేయడం ద్వారా శిక్ష పడి ఈ జైలుకు వచ్చే ఖైదీల్లో పరివర్తన రావడానికి కృత్యాధారం విధానం దోహదపడుతుందని జైలు సూపరింటెండెంట్ మహేశ్ బాబు పేర్కొన్నారు. ఈ విధానం ఖైదీలకు ఒక విధంగా కౌన్సెలింగ్ అందించినట్టుగా ఉంటుందని ఆయన అన్నారు.

కొత్తిమీర, పాలకూర, తోటకూర, గోంగూర, చుక్కకూర వంటి ఆకు కూరలను ఇక్కడి పండిస్తున్నారు.

సేంద్రీయ ఎరువుల వాడకం

జైలులో సాగు చేస్తున్న కూరగాయల సాగుకు కేవలం సేంద్రీయ ఎరువులను మాత్రమే ఉపయోగిస్తుండడం విశేషం. దీంతో ఇక్కడ పండించే పంటలకు గిరాకీ ఉంటుంది. ధర తక్కువగా ఉండడంతో పాటు సేంద్రీయ ఎరువులతో పండించిన పంటలు కావడంతో కొనుగోలుకు పలువురు ఆసక్తి చూపిస్తుంటారు. టమాటాలు కోసి జైలు బయట గల సుధార్ విక్రయ కేంద్రంలో అమ్మకాలు చేస్తున్నారు. టమాటా కిలో రూ.15కు విక్రయిస్తున్నారు. కొబ్బరికాయ ఒక్కొక్కటి రూ. 20కు అమ్ముతున్నారు. ఇక్కడ ఒకసారి కొనుగోలు చేసిన వారు మళ్లీ కొనేందుకు ఆసక్తి చూపిస్తుంటారని జైలు అధికారులు తెలిపారు. సేంద్రీయ పంటలు కావడంతో మేలు రకం పంట వస్తుందని చెప్పారు. ఇది రుచితో పాటు ఆరోగ్య పరిరక్షణకు దోహద పడుతుందన్న ఉద్దేశంతో వీటి కొనుగోలుకు ఆదరణ ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు.

ఖైదీలు పండించిన కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు వంటివి సుధార్ విక్రయ కేంద్రంలో సెలవు దినాల్లో మినహా రోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్ర ఐదు గంటల వరకు అందుబాటులో ఉంటాయి. ఎవరైనా కొనుగోలు చేయవచ్చని జైలు అధికారులు తెలిపారు.

విజయనగరం మీదుగా చర్లపల్లి-ధనపూర్ ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): విజయనగరం మీదుగా చర్లపల్లి, ధనపూర్ మధ్య ప్రత్యేక రైళ్లు ప్రవేశపెట్టామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. 07749 నంబరు గల రైలు ఈ నెల 22న ఉదయం 9.30 గంటలకు చర్లపల్లిలో బయలుదేరి అదేరోజు రాత్రి 10.55 గంటలకు విజయనగరం, సోమవారం వేకువన 2 గంటలకు ధనపూర్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 07750 నంబరు గల రైలు 22న మధ్యాహ్నం 3.30 గంటలకు ధనపూర్‌లో బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 6.15 గంటలకు విజయనగరం, సోమవారం ఉదయం 8.15 గంటలకు చర్లపల్లి చేరుతుందన్నారు. 07751 నంబరు గల రైలు 23న ఇదే సమయాల్లో చర్లపల్లిలో బయలుదేరి ధనపూర్, తిరుగు ప్రయాణంలో 07752 నంబరుతో ధనపూర్‌లో బయలుదేరి చర్లపల్లి చేరుతుందన్నారు. ఈ రైళ్లు నల్గొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ల, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, కొత్తవలస, విజయనగరం జంక్షన్, శ్రీకాకుళం రోడ్డు, పలాస, బెర్హంపూర్ మీదుగా రాకపోకలు సాగిస్తాయన్నారు.

యూజీసీ ముసాయిదా-25 రద్దు చేయాలి : పీడీఎస్‌వో



నిరసన తెలుపుతున్న పీడీఎస్‌వో కార్యకర్తలు

మద్దిలపాలెం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : విశ్వవిద్యాలయాల్లో ఆచార్యులు, అధ్యాపకుల నియామకాలు, పదోన్నతులకు రూపొందించిన యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ ముసాయిదా-25ను రద్దు చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ(పీడీఎస్‌వో) జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి డిమాండ్ చేశారు.యూజీసీ ముసాయిదాకు వ్యతిరేకంగా శుక్రవారం డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల గేటు వద్ద పీడీఎస్‌వో కార్యకర్తలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ యూజీసీ ముసాయిదా రాష్ట్ర ప్రభుత్వాల హక్కులు కాలరాస్తూ రూపొందించారని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో యూనివర్సిటీల వైస్ చాన్సలర్ల నియామకాలు, నియామక నిబంధనలు పూర్తిగా మార్చి గవర్నర్లకు అప్పగించాలని చూడడం దుర్మార్గమన్నారు. అంతేకాకుండా వీసీల అర్హతలు కూడా సడలించడంతో ప్రైవేటు రంగానికి చెందినవారు, ఆకడమిక్ అనుభవం లేని వారికి వీసీలుగా నియమించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో యమున, లక్ష్మణ్, సతీష్, లోకేష్ పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **డ్రాగన్:** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీకన్య (గాజువాక).

● **ఛైలా:** శ్రీ వెంకటేశ్వర-1, రమాదేవి, శ్రీరామా, గోకుల్, కిన్నెర, మోహిని (గాజువాక), మౌర్య (గోపాలపట్నం)

● **తండేల్:** సంగం, కామేశ్వరి, శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), అన్నపూర్ణ(కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ)

● **సంక్రాంతికి వస్తున్నాం:** శారద, మెలోడి, జగదాంబ, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-12 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)

● **డాకు మహారాజ్:** శరత్, కిన్నెర, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), గణేష్, సప్తగిరి (తగరపువలస)

● **గేమ్ ఛేంజర్:** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 35, టమాటా 11, వంకాయలు (తెలుపు)20, వంకాయలు (నలుపు) 18, బెండకాయలు 44, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 38, బీరకాయలు 60, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 16, క్యాబేజి 12, క్యారెట్ 26 దొండకాయలు 32, బంగాళ దుంపలు 14, అరటికాయ (పె) 6, మునక్కాడలు (కిలో) 80, అల్లం (పాతది)52, బరబాటి 36, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 26, దోస కాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 120, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 28, కీరదోస 30, కాప్సికమ్ 36, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 34 చిలగడదుంపలు 36, కంద 64, దేముడు చిక్కుడు 36, గోరు చిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 55 , నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 20, మామిడి అల్లం 46, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)	(వంద - రూ.లలో)
విశాఖపట్నం	445
విజయనగరం	449
శ్రీకాకుళం	449

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	75
లైవ్ ధర	95
విత్ స్కిన్	160
స్కిన్‌లెస్	170

ఏయూలో ఘనంగా మేనేజ్‌మెంట్ వేడుకలు



అధ్యాపకులకు సత్కరిస్తున్న నిర్వాహకులు



సదస్సులో పాల్గొన్న మేనేజ్‌మెంట్ ప్రతినిధులు

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఏయూలోని మేనేజ్‌మెంట్ విభాగంలోని పీటర్ డ్రక్కర్ స్మార్ట్ సెమినార్ హాలులో శుక్రవారం 19వ జాతీయ మేనేజ్‌మెంట్ దినోత్సవం, 69వ ఆలిండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ఏఐఎంఏ) వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించారు. విశాఖ మేనేజ్‌మెంట్ అసోసియేషన్, ఏయూ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో 'ఇండియా టుమారో అన్ లాకింగ్ ఇండస్ట్రీ ఇన్నోవేషన్ టాలెంట్ అంశంపై చర్చించారు. ఈ సెమినార్‌కు అధ్యక్షత వహించిన విశాఖ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎస్.సాంబశివరావు మాట్లాడుతూ మేనేజ్‌మెంట్ డే విశిష్టత, మేనేజ్‌మెంట్ ఎడ్యుకేషన్ కోసం ఏఐఎంఏ నిర్వహిస్తున్న కార్యక్రమాలను తెలియజేశారు. 2006లో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం ఆలోచనలో బాగంగా మేనేజ్‌మెంట్ డే వేడుకలను నిర్వహించడం ప్రారంభించామన్నారు.

సెమినార్ కన్వీనర్ ఏయూ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి జాలాది రవి మాట్లాడుతూ భారతదేశంలోనే బ్యాచిలర్ ఆఫ్ కామర్స్‌ను ఏయూ ప్రారంభించిందని, మేనేజ్‌మెంట్ ఎడ్యుకేషన్ దేశంలోనే మొదటిగా ప్రారంభించి ప్రపంచానికి.. మరీ ముఖ్యంగా భారతదేశ పరిశ్రమలకు నైపుణ్యం కలిగిన మేనేజర్లను పారిశ్రామికవేత్తలను అందించిందన్నారు. ప్రధాన ఉపన్యాసకుడిగా విచ్చేసిన వైజాగ్ ప్రొఫైల్స్ లిమిటెడ్, ఢిల్లీ అండ్ జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్ ఇండిపెండెంట్ డైరెక్టర్ డాక్టర్ ఇమ్మడి శంకరరావు హాజరై భారతదేశంలో పరిశ్రమలు ఆవిష్కరణలు, టెక్నాలజీలతో మారుతున్న పరిస్థితులను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో వస్తున్న పెను మార్పులను నేర్చుకుని కొత్త అవకాశాలను సృష్టించుకోవాలని సూచించారు. దేశాభివృద్ధిని చైనాతో బేరీజు వేసుకొంటూ పని చేయాలన్నారు.

అతిథి ఉపన్యాసకులుగా విచ్చేసిన విశాఖ కంటైనర్ టెర్మినల్ ప్రైవేటు లిమిటెడ్ హెడ్ హ్యూమన్ రిసోర్స్ ఎం. సి.జిత మాట్లాడుతూ దేశాభివృద్ధికి మౌలిక సదుపాయాలు అవసరమని, వీసీటీపీఎల్ ఈ దేశానికి రాష్ట్రానికి మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయడంలో తోడ్పడుతున్నామన్నారు. విద్యారంగంలోనూ తమ సేవలను అందిస్తున్నామన్నారు. అనంతరం అతిథులను ఫ్యాకల్టీ చైర్మన్ ప్రొఫెసర్ ఉమాదేవి బృందం సన్మానించారు. వీఎంఏ అధ్యక్షుడు ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ బోరుగడ్డ సుబ్బయ్యను అభినందించారు.



తెలుగుతల్లి విగ్రహం ఎదుట నినదిస్తున్న విద్యార్థులు

మాతృభాషను పరిరక్షించుకోవాలి

మద్దిలపాలెం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మాతృభాషా పరిరక్షణకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని తెలుగుదండు అధ్యక్షుడు పరవస్తు సూరి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం పురస్కరించుకుని మద్దిలపాలెం తెలుగుతల్లి విగ్రహం వద్ద శుక్రవారం తెలుగుతల్లికి నీరాజనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తెలుగుతల్లి విగ్రహానికి పూలమాలు వేసి మాట్లాడారు. యునెస్కో సూచనలతో 2000 నుంచి ప్రపంచవ్యాప్తంగా నిర్వహించే ఏకైక పండుగ మాతృభాషా దినోత్సవమన్నారు. మాతృభాష కోసం ప్రాణపాయంగా ప్రాణాలు త్యాగం చేసిన బంగ్లాదేశ్ విద్యార్థులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పాశ్చాత్య భాష మోజులో పడి తల్లి భాషను మరిచిపోకూడదని, తెలుగు భాషను కాపాడుకోవాలని కోరారు. అనంతరం జీవీఎంసీ, వండర్‌కిడ్స్ విద్యార్థులు పాటలు, పద్యాలతో తెలుగుతల్లిని కీర్తించారు. ఈ కార్యక్రమంలో తెలుగు భాషాభిమానులు, ఉమా గాంధీ, కాశీవిశ్వేశ్వరం, చిన సూర్యానారాయణ, శ్రీధర్, సత్యనారాయణ మూర్తి, మాధవి, లలిత తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం మారినా.. గ్రేటర్ అధికారుల తీరు మారలేదు

జనసేన కార్పొరేటర్ మూర్తియాదవ్



సిరిపురం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం మారినా.. జీవీఎంసీ అధికారుల తీరు మాత్రం ఏ మాత్రం మారడం లేదని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ధ్వజమెత్తారు. జీవీఎంసీ అధికారుల అవినీతి, వైఖరి కారణంగా కోట్లాది రూపాయలు జీవీఎంసీ ఆదాయానికి నష్టం వాటిల్లుతోందని ఆరోపించారు. శుక్రవారం ఆయన ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీఆర్‌టీఎస్ రోడ్డులోని పోయిన సింహాచలం భూమికి ప్రత్యామ్నాయంగా భూమిని ముడసర్లోవ ప్రాంతంలోని ఏడెకరాలను గతంలోనే జీవీఎంసీ ఇచ్చేసిందన్నారు. అయితే ఆ భూముల్లో ఉన్న ఆక్రమణదారులుగా ఉన్నవారికి నాలుగు రెట్లు టీడీఆర్ జారీ చేసేందుకు సిద్ధమవుతున్నారన్నారు. సుమారుగా రూ.200 కోట్లు విలువైన టీడీఆర్‌లను సిద్ధం చేశారన్నారు. ఇప్పుడు జీవీఎంసీ గతంలో ఇచ్చేసిన డాక్యుమెంట్లను ఎందుకు బయటకు తీయడం లేదని ప్రశ్నించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నాలా పన్ను ఎగ్గొట్టేశారని, దాని విలువ సుమారుగా రూ.వెయ్యి కోట్లు ఉంటుందన్నారు. అనేక భవనాలు జీవీఎంసీ మార్ట్‌గేజ్‌లో ఉన్నా వాటిని ఎందుకు స్వాధీనం చేసుకోవడం లేదని ప్రశ్నించారు. జీవీఎంసీ పరిధిలో ఉన్న షాపులు, కల్యాణ మండపాలు ద్వారా రూ.86 కోట్ల బకాయిలు ఉన్నప్పటికీ వాటిని వసూలు చేయడం లేదన్నారు. కౌన్సిల్‌లో సైతం తీర్మానం చేసిన జైలురోడ్డు వద్ద ఉన్న నైట్ ఫుడ్‌కోర్టు ఎందుకు ఖాళీ చేయడం లేదో అర్థం కావడం లేదన్నారు. ఇదే తరహాగా ఉన్న రాజమండ్రి, కాకినాడ నైట్‌ఫుడ్‌కోర్టుల ద్వారా ఆయా కార్పొరేషన్లలో షాపులు అద్దె, లీజుకు ఇచ్చి మరీ ఆదాయాన్ని పొందుతున్నారన్నారు. ఈ విషయాలను ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ల దృష్టి తీసుకెళ్లాలని మూర్తి యాదవ్ కోరారు.

యూసీసీ టీ20 క్రికెట్ విజేత విజయనగరం



ముఖ్య అతిథి జి.జి.జె.రాజా నుంచి విన్నర్ ట్రోఫీ అందుకుంటున్న విజయనగరం జట్టు,



రన్నరప్ ట్రోఫీ అందుకుంటున్న కవలియర్స్ జట్టు సభ్యులు

విశాఖపట్నం స్పోర్ట్సు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు రైల్వే క్రికెట్ గ్రౌండ్ లో జరిగిన 11వ యూసీసీ టీ20 క్రికెట్ చాంపియన్‌షిప్ ట్రోఫీని విజయనగరం జిల్లా క్రికెట్ సంఘం కైవసం చేసుకుంది.కవలియర్స్ సిసి (విశాఖ) రన్నరప్‌గా నిలిచింది. శుక్రవారం జరిగిన ఫైనల్స్‌లో విజయనగరం 57 పరుగుల తేడాతో కవలియర్స్‌ను చిత్తు చేసింది. తొలి బ్యాటింగ్ చేసిన విజయనగరం నిర్ణీత 20 ఓవర్లలో ఎనిమిది వికెట్లకు 209 పరుగులు చేసింది. ఓపెనర్లు గుల్జామ్ సాలే (18), దుర్గాకుమార్ (22) శుభారంభం ఇవ్వగా, మిడిల్ ఆర్డర్‌లో సందీప్ హాఫ్ సెంచరీ (55), తపస్వి (21), రవికిరణ్ (38), ధీరజ్‌కుమార్ (37) ధాటిగా స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. కవలియర్స్ బౌలర్లలో భువనేశ్వర్, సాయిశ్రావణ్ చెరో రెండు వికెట్లు తీశారు. లక్ష్య సాధనలో కవలియర్స్ 19 ఓవర్లలో 152 పరుగులకు ఆలౌటై ఓటమి చెందింది. కెఎస్ఎన్.రాజు అర్ధ సెంచరీతో (71) రాణించగా, వర్ధన్ (19) కాస్త తోడ్పాటు ఇచ్చాడు.మిగిలిన బ్యాటర్లు తడబడి వరుసగా వికెట్లు సమర్పించుకుని పెవిలియన్ దారి పట్టారు. ఎనిమిది

రన్నరప్‌గా కవలియర్స్ సీసీ

బ్యాటర్లు రెండంకెల స్కోరు కూడా చేయలేక పేలవమైన ఆటను ప్రదర్శించారు. విజయనగరం బౌలర్లలో తపస్వి మూడు వికెట్లు తీయగా, వై.వాసు, రవికిరణ్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు.

ఆల్‌రౌండర్ ప్రతిభ చూపిన రవికిరణ్ మ్యాన్ ఆఫ్ ద ప్లేయర్‌గా నిలిచాడు. టోర్నీ బెస్ట్ ఆల్‌రౌండర్‌గా వై.వాసు (విజయనగరం), బెస్ట్ బ్యాటర్‌గా కెఎస్ఎన్.రాజు (కవలియర్స్), బెస్ట్ బౌలర్‌గా డి.క్రాంతి (వైజాగ్ వెటరన్స్) అవార్డులందుకున్నారు. టోర్నీ ముగింపు కార్యక్రమానికి ఏసీఏ మాజీ ఉపాధ్యక్షుడు జి.జి.జె.రాజు ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు, మెమెంటోలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో సోనా డోనా సీఈవో కరణ్, యూసీసీ ప్రతినిధులు రమణమూర్తి, వెంకటేష్, శ్రీనివాస్, సోమేష్, రాంజీ, చైతన్య తదితరులు పాల్గొన్నారు. నగరంలోని పలు స్వచ్ఛంద సంస్థలకు యూసీసీ ప్రతినిధులు రూ.లక్ష విరాళాన్ని అందించారు.

వైభవంగా పైడితల్లి విగ్రహ ప్రతిష్ఠ



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వెలగపూడి, టీడీపీ నేతలు

మద్దిలపాలెం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 22వ వార్డు శివాజీపార్కు రోడ్డు సవేరా ఫంక్షన్ హాలు పక్కన శ్రీవేపచెట్టు పైడితల్లి అమ్మవారు ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ నాయకులు బొట్టా వెంకటరమణ, దువ్వి స్వామి, రాజ్‌కుమార్, చిన్నరాజు, సురేష్, గోవిందా తదితరులు ఉన్నారు.

శివరాత్రికి ఆలయాలు సిద్ధం



పూజలకు సిద్ధమైన శివాలయం

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి ఉత్సవాలకు స్థానిక శ్రీరామానంద ఆశ్రమం, శ్రీ గౌరీజ్ఞానలింగేశ్వరాలయం ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 26న ఉదయం నుంచి శివుడికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించనున్నట్టు ఆలయ ప్రధానార్చకులు ఆరవెల్లి సూర్యప్రకాష్ శర్మ తెలిపారు. ఆ రోజు రాత్రి నుంచి ప్రాతఃకాలం వరకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలుచేపడతామన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రావాలని పిలుపునిచ్చారు.

పీజీఆర్ఎస్‌పై అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న ఏడీసీలు రమణమూర్తి, ఎస్ఎస్ వర్మ

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీలో విధులు నిర్వహిస్తున్న ప్రతి ఉద్యోగి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలని, నిర్ణీత సమయంలో సంబంధిత ప్రజా ఫిర్యాదుల సమస్యలను పరిష్కరించాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్‌పై జీవీఎంసీ అధికారులు, ఉద్యోగులకు అవగాహన కార్యక్రమాన్ని జీవీఎంసీ అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మతో కలిసి నిర్వహించారు.

ఈ సందర్భంగా ఏడీసీ రమణమూర్తి మాట్లాడుతూ ప్రజలకు అందిస్తున్న సేవల్లో భాగంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోన్న పీజీఆర్ఎస్‌ను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ప్రజలు సమర్పించిన అర్జీలు/ ఫిర్యాదులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలన్నారు. ప్రతి రోజూ పీజీఆర్ఎస్‌పై ఫిర్యాదుల కోసం అధికారులు, ఉద్యోగులు నిర్ణీత సమయం కేటాయించాలని సూచించారు. చాలా మంది ఉద్యోగులు పీజీఆర్ఎస్‌పై నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. దీనివల్ల ప్రజా సమస్యలు నిర్ణీత సమయంలో పరిష్కారం కావడం లేదన్నారు. అశ్రద్ధ వహించిన వారిపై ఇప్పటికే ఛార్జ్ మెమోలు జారీ చేయడం జరిగిందని, ఇకపై క్రమశిక్షణ చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. పీజీఆర్ఎస్ కోసం ముఖ్యమంత్రి కార్యాలయంలో ప్రత్యేకంగా నోడల్ అధికారులు రాష్ట్ర స్థాయిలో సమస్యల పరిష్కారంపై నిత్యం విచారణ చేపడుతున్నారన్నారు.

అనంతరం అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వారంలో మూడుసార్లు సుదీర్ఘంగా నోడల్ అధికారి పీజీఆర్ఎస్ కార్యక్రమాలపై సమీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు. జిల్లా కలెక్టర్ దీనిపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ప్రతి అధికారి, ఉద్యోగి పీజీఆర్ఎస్ నిర్లక్ష్యం వహించకుండా ప్రత్యేక ప్రాధాన్యతతో విధులను నిర్వహించాలన్నారు. పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులు, ఉద్యోగులకు వివరించారు. కార్యక్రమంలో ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ సి.వాసుదేవరెడ్డి, ఫైనాన్స్ అడ్వైజరు మల్లికాంబ, సిటీ ప్లానర్ ధనుంజయరెడ్డి, జోనల్ కమిషనర్లు, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

బయో డైవర్సిటీ పార్కు సందర్శించిన విద్యార్థులు



పార్కు సందర్శించిన శ్రీషిర్డీసాయి డిగ్రీ కళాశాల విద్యార్థులు

పెదవాల్తేరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : స్థానిక రాణిచంద్రమణీదేవి ఆస్పత్రి ఆవరణలో గల బయోడైవర్సిటీ పార్కును బుధవారం శ్రీ షిర్డిసాయి (ఎస్ఎస్ఎస్) డిగ్రీ కళాశాల విద్యార్థులు సందర్శించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.మోహన్‌రావు, వైస్ ప్రిన్సిపాల్ వెంకటరావు ఏఎన్‌ఏ (జూ డిపార్ట్‌మెంట్) పర్యవేక్షణలో 40 మంది విద్యార్థులు పార్కులోని మొక్కలను పరిశీలించారు. వివిధ రకాల అరుదైన మొక్కల విశిష్టత, వాటి పరిరక్షణకు తీసుకునే చర్యల గురించి విద్యార్థులకు పార్కు నిర్వాహకులు రామమూర్తి వివరించారు. అనంతరం సెల్ఫ్ ఎక్స్‌ప్లనేటరీ బోర్డులతో అధ్యయనం చేస్తున్న వందలాది ఔషధ మొక్కలను చూసి ముగ్ధులయ్యారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది వి.రమ్య కుమారి (వృక్షశాస్త్ర విభాగం) తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాములను పరిశీలించిన కలెక్టర్



విజిటర్స్ రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ఆరిలోవ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : చినగదిలి గ్రామీణ మండలంలో ఉన్న ఈవీఎం గోదాంలను జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ శుక్రవారం ఉదయం తనిఖీ చేశారు. నెలవారి తనిఖీల్లో భాగంగా ఆయన గోదాంలను సందర్శించి అక్కడ పరిస్థితులను గమనించారు. సీసీ కెమెరాల పనితీరు, ప్రధాన ద్వారానికి ఉన్న సీళ్లను పరిశీలించారు. భద్రతా ప్రమాణాలపై అక్కడ అధికారులు, భద్రతా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ పర్యటనలో భాగంగా విజిటింగ్ రిజిస్టర్‌లో కలెక్టర్ సంతకం చేశారు.

నేడు ఇంటర్ ఒకేషనల్ పరీక్షలు

ఆరిలోవ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు శనివారం ఒకేషనల్ పరీక్షలునిర్వహిస్తున్నట్టు శ్రీకృష్ణాపురంలోని అంబేడ్కర్ గురుకులం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.రత్నవల్లి తెలిపారు. ఈ పరీక్షలకు తమ కళాశాల నుంచి మొత్తం 37 విద్యార్థులు హాజరు కానున్నట్టు చెప్పారు. వీరిలో 19 మంది బ్యూటీ అండ్ వెల్‌నెస్ పరీక్ష, ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్స్‌కు 18 మంది అభ్యర్థులు రాస్తున్నట్టు వెల్లడించారు. ఈ పరీక్షలు తమ కళాశాలలోనే జరుగుతాయని తెలిపారు.

విజయదుర్గా అమ్మవారిని దర్శించుకున్న నగర మేయర్



అమ్మవారిని దర్శించుకుంటున్న మేయర్ హరివెంకటకుమారి

ఆరిలోవ, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి) : హనుమంతవాక జంక్షన్‌కు చేరువలో గల విజయదుర్గా కాలనీలో వెలిసిన విజయదుర్గా అమ్మవారి ఆలయ 28వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నగర మేయర్ హరివెంకటకుమారి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు సంపత్‌కుమార్ శర్మ ఆమెకు స్వాగతం పలికి పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన యోగా శిక్షణ శిబిరం

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఎస్.యోగా, శివాజీ పార్కు గొడుగు వాకర్స్ అసోసియేషన్ సంయుక్త నిర్వహణలో ఈ నెల 17 నుంచి శివాజీ పార్కులో నిర్వహిస్తున్న యోగాలో వివిధ పద్ధతులపై శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. యోగా గురువైన శివలక్ష్మణ్ దాదాపు 50 మంది యోగా అభ్యసకులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణలో వివిధ ప్రాణాయామ పద్ధతులు, సూర్య నమస్కారాలు, సంపూర్ణ ఆరోగ్యానికి యోగ ఏ విధంగా ఉపయోగపడుతుందో తెలియజేశారు. ఈ శిక్షణ కార్యక్రమాలన్నీ యోగా గురువైన రాజగోపాల్ పర్యవేక్షణలో జరిగాయి. ముగింపు సభలో వాకర్స్ డిస్ట్రిక్ గవర్నర్ ద్వారకానాథ్ ముఖ్యఅతిథిగా విచ్చేసి యోగా భౌతిక, మానసిక ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగపడుతుందని సూచించారు. గౌరవ అతిథి మహేష్ మాట్లాడుతూ యోగాపై తన అనుభవాలను తెలియజేశారు. గొడుగు వాకర్స్ క్లబ్ అధ్యక్షులు కె.శివరామకృష్ణ, ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ ఎన్.రామకృష్ణ, కార్యదర్శి వి.సత్యనారాయణ, సభ్యులు పాల్గొన్నారు.

కొండదారిలో వెలుగులు

మాధవధార, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 51వవార్డు పరిధి మాధవస్వామి ఆలయాలకు వెళ్లే దారిలో శుక్రవారం జీవీఎంసీ వీధి దీపాల నిర్వహణ విభాగం మరమ్మతులు చేపట్టింది. ఇక్కడి కొండ దారిలో బ్లాక్ నంబర్-19 వాటర్ పంప్‌హౌస్ ఎదుట నిరుపయోగంగా మారిన పాత హైమాస్ట్ దీప స్తంభాల స్థానంలో కొత్తవి అమర్చారు. నిత్యం చీకటిగా ఉండే ఈ దారిలో ప్రయాణికులు ఇబ్బంది పడేవారు. మాఘ మాసంలో వేకువన కొండపైన ఆలయాలకు వెళ్లే భక్తులు, అర్చక బృందం కొండదారిలో చీకటిలోనే ప్రయాణం చేయక తప్పలేదు. దీంతో వీరు జీవీఎంసీ విద్యుత్ విభాగానికి మొరపెట్టుకోగా, ఎట్టకేలకు ఏఈ అర్జున పర్యవేక్షణలో సిబ్బంది వెలుగులు కల్పించారు. ఇక నుంచి ప్రభాత నడకకు వచ్చే వారికి, క్రీడాకారులకు ఊరట కలగనుంది.


కొత్తగా వేస్తున్న విద్యుత్ స్తంభాలు

దళారులను ఆశ్రయించొద్దు

» రైతుబజార్ సందర్శనలో రైతులతో మార్కెటింగ్ కమిటీ కార్యదర్శి


రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ కార్యదర్శి పాపారావు

సీతమ్మధార, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధారలో గల రైతుబజార్‌ను అగ్రికల్చర్ మార్కెటింగ్ కమిటీ కార్యదర్శి పాపారావు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ రైతులతో మాట్లాడారు. టమాటా పండించే రైతులు తమకు గిట్టుబాటు ధర వచ్చే విధంగా నేరుగా రైతుబజార్‌కు తీసుకువచ్చి అమ్ముకోవాలన్నారు. ఎట్టిపరిస్థితుల్లోనూ దళారులను ఆశ్రయించవద్దన్నారు. రైతుబజార్ ఎస్టేట్ అధికారి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

కారు, ఆటో ఢీ..
డ్రైవరుకు స్వల్ప గాయాలు


దెబ్బతిన్న ఆటోను నెడుతున్న పోలీసులు

మురళీనగర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి ఆర్‌అండ్‌బీ జంక్షన్ సిగ్నల్ లైట్ల వద్ద శుక్రవారం ఉదయం ఓ ఆటో వేగంగా వచ్చి కారుని ఢీ కొట్టింది. ఈ ప్రమాదం కారణంగా జంక్షన్‌లో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. వేగంగా దూసుకొచ్చిన ఆటో డ్రైవరుదే తప్పిదమని క్షేత్రస్థాయిలో ఉన్న ట్రాఫిక్ విభాగం కానిస్టేబుల్ నిర్ధారించారు. ప్రమాదంలో ఆటో అద్దం పూర్తిగా విరిగిపోయింది. ఆటో ముందు భాగం దెబ్బతింది. కారు యజమాని, ఆటోవాలా రోడ్డుపైనే వాగ్వాదానికి దిగడంతో పక్కనే ఉన్న ఎయిర్‌పోర్ట్ స్టేషన్‌కి పోలీసులు రెండు వాహనాల్ని తరలించారు. ఆటోవాలా గాయపడడంతో ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసిన ఎయిర్‌పోర్ట్ జోన్ పోలీసులు విచారణ చేపడుతున్నారు.

కథల పోటీలతో పిల్లల్లో సృజనాత్మకతను వెలికితీయవచ్చు

» నారాయణ ఏజీఎం రాజ్‌కుమార్


న్యాయనిర్ణేతలను సత్కరిస్తున్న అతిథులు

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కథల పోటీల ద్వారా పిల్లల్లోని సృజనాత్మకతను వెలికితీసే అవకాశం కలుగుతుందని నారాయణ విద్యాసంస్థలు విశాఖపట్నం ఏజీఎం రాజ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్స్ ఆధ్వర్యంలో 'కథా నిర్వహణ' పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన జ్యోతి ప్రజ్వలన చేశారు. కళా హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ పి.వి.రమణమూర్తి న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. ఈ పోటీల్లో చిన్నారులు వివిధ కథలను ఆసక్తికరంగా హావభావాలతో చెప్పి ఆకట్టుకున్నారు. నృత్య ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో సుస్మిత, ప్రవంతి, జ్యోతి, మౌని, లావణ్య, రఘుబాబు, మాధవీ లత, రామ్ రమేష్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

రూపుదాల్చని రిసెప్షన్ హాలు నిర్మాణం

మాధవధార, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని ఆర్ అండ్ బీ జంక్షన్ హైవే సమీపంలో ఉన్న ఎయిర్ పోర్ట్ జోన్ పోలీసు స్టేషన్ ఆవరణలో కొత్తగా ఆరంభించిన రిసెప్షన్ హాలు నిర్మాణాన్ని మధ్యలోనే నిలిపేశారు. ఇక్కడ సీఐ మారినపుడల్లా వాస్తు నమ్మకాలు పాటిస్తున్నారు. ఈ నేపథ్యంలో స్టేషన్‌కి తూర్పువైపున ఉన్న ప్రధాన ప్రవేశ ద్వారాన్ని కొన్ని నెలల క్రితమే మూసేశారు. ఇక్కడ రిసెప్షన్ బ్లాకు పెట్టి స్టేషన్ మెయిన్ గేట్ ఉత్తర వైపు ఉన్న ద్వారానికి మార్చారు. అక్కడే ప్రధాన ప్రవేశద్వారం ఏర్పాటు చేసి పచ్చదనం పెంచుకున్నారు.


ఎయిర్‌పోర్టు జోన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో పనులు ఆపేసిన రిసెప్షన్ హాలు నిర్మాణం

హాలు నిర్మాణం గాలికి..

తూర్పు గేట్ వద్ద ఉన్న పార్కింగ్ స్థలంలో కొంత భాగంలో చిన్నపాటి రిసెప్షన్ హాలు కట్టడం ఆరంభించి దాదాపు ఏడాది కావస్తున్నా పనులు కొలిక్కి రాలేదు. సీఐ మారినపుడు పాత ప్రాథమ్యాలు అటకెక్కుతున్నాయి. దీంతో ఇప్పుడు ఇక్కడి స్టేషన్‌లో రెండు నెలల క్రితమే శాంతిభద్రతల సీఐగా బాధ్యతలు చేపట్టిన జి.ఉమామహేశ్వరరావు పర్యవేక్షణలో రిసెప్షన్ హాలు కట్టడం పూర్తి కావాలి. విధుల భారంతో స్టేషను సొబగులు చూసే నాథుడే లేరు. దీంతో తలపెట్టిన కొత్త నిర్మాణాల పనులు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. స్టేషన్‌కి వచ్చే వారికి పక్కనే ఏర్పాటు చేసిన వెయిటింగ్ హాలు గదిలోనూ నిర్మాణాలు పూర్తి చేయలేదు. ఫిర్యాదుదారులు స్టేషన్ ఎదుట ఆరుబయటే పడిగాపులు పడుతున్నారు. రిసెప్షన్ హాలు కూడా స్టేషన్ గేటు లోపలే వరండాలో నెట్టుకొస్తున్నారు. కొత్త నిర్మాణం పూర్తయితే, స్టేషన్‌లో విధులు చేపట్టే సిబ్బందికీ, కేసుల పరిష్కారం కోసం వచ్చే వారికీ కాస్త వెసులుబాటు దొరుకుతుంది. ఈ దిశగా పోలీసు స్టేషన్ అధికారులు దృష్టి సారించాలని, సందర్శకులకు సౌకర్యంగా నిర్మాణం పూర్తి చేయాలని కోరుకుంటున్నారు.

రఘువర్మ గెలుపునకు కృషి చేయండి: గండి బాబ్జీ


టీడీపీ కార్యాలయంలో ఉత్తర నియోజకవర్గ నాయకులతో సమావేశమైన గండి బాబ్జీ


ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతున్న దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ

విశాఖపట్నం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానం నుంచి పోటీ చేస్తున్న పాకలపాటి రఘువర్మ విజయం కోసం ప్రతి ఒక్కరూ కృషిచేయాలని విశాఖ పార్లమెంటు తెలుగుదేశం అధ్యక్షుడు గండి బాబ్జీ పిలుపునిచ్చారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో విశాఖ ఉత్తర నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఉత్తరాంధ్ర పట్టభద్ర ఎన్నికల్లో టీడీపీని గెలిపించిన విషయాన్ని గుర్తుచేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాకలపాటి రఘువర్మకు కూటమి మద్దతు పలికినందున ప్రతి ఒక్కరూ కష్టపడి ఆయన్ని గెలిపించాలన్నారు. సమావేశంలో విశాఖ ఉత్తర పరిశీలకుడు రవిశేఖర్, విశాఖ పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావు, ఉత్తర నియోజకవర్గ నాయకుడు వెల్లంకి భరత్, సనపల వరప్రసాద్, ఆకిరెడ్డి జగదీష్, కోట నరేష్ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే విద్యావేత్తలు: ఎమ్మెల్యే వంశీకృష్ణ

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి మద్దతు తెలియజేసిన అభ్యర్థి పాకలపాటి రఘువర్మను గెలిపించాలని దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. శుక్రవారం విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించారు. విద్యావేత్తలు కూటమి ప్రభుత్వంతో ఉన్నారని, భవిష్యత్‌లో కూడా కలిసి నడుస్తారని ఆయన విశ్వాసం వ్యక్తంచేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అందరూ ఓటుహక్కు వినియోగించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

రైల్వేలో శతాబ్ది విద్యుదీకరణ వేడుక

విశాఖపట్నం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): భారతీయ రైల్వేలో విద్యుదీకరణ రైళ్లు అందుబాటులోకి వచ్చి వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారంలో వాల్తేరు డివిజన్‌లో శతాబ్ది విద్యుదీకరణ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహూ సారథ్యంలో అధికారులు, ఉద్యోగులు శుక్రవారం డీఆర్ఎం కార్యాలయం నుంచి రైల్వేస్టేషన్‌కు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ దేశంలో మొదటి విద్యుత్ రైలు 1925 ఫిబ్రవరి 3న అప్పట్లో విక్టోరియా టెర్మినస్‌గా పిలిచే ఇప్పటి ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినస్ నుంచి ముంబై కుర్లా వరకు నడిచిందని తెలిపారు. విద్యుదీకరణ వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పలు సదస్సులు, ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం స్టేషన్‌లో ఏర్పాటు చేసిన రైల్వే విద్యుదీకరణ సాంకేతిక పురోగతిని తెలిపే ప్రదర్శనను సందర్శించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ (ట్రాక్షన్) బి.షణ్ముఖరావు, సీనియర్ ఎలక్ట్రికల్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.


రైల్వే విద్యుదీకరణ నమూనా ప్రదర్శనను తిలకిస్తున్న డీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహూ, ఇతర అధికారులు

భూముల రీసర్వే సమాచారాన్ని ముందుగా ప్రకటించండి: కలెక్టర్

భీమునిపట్నం (రూరల్) ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రీసర్వే చేపట్టబోయే గ్రామాల సమాచారాన్ని ముందుగా గ్రామాల్లో రైతులకు తెలియజేయాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ యంత్రాంగాన్ని ఆదేశించారు. శుక్రవారం భీమిలి మండలం దాకమర్రి గ్రామ సచివాలయాన్ని అధికారులతో కలిసి ఆయన సందర్శించారు. రీసర్వే సమాచారాన్ని ముందుగా తెలియజేస్తే రైతులు తమ సమస్యలు తెలియజేయడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో కలిసి పంటపొలాలను పరిశీలించారు. భూముల పరిరక్షణ, సరిహద్దుల గుర్తింపు, దీర్ఘకాలిక భూ సమస్యలు శాశ్వత పరిష్కార దిశగా రెవెన్యూ అధికారులు కృషి చేయాలని కలెక్టర్ కోరారు. రైతుల అభిప్రాయాలను, వారు చెప్పే సమస్యలను పరిగణనలోకి తీసుకుని అందుకు అనుగుణంగా సర్వే చేపట్టాలని ఆదేశించారు. దాకమర్రి గ్రామ సచివాలయంలో సిబ్బంది పనితీరును పరిశీలించారు. ప్రజలకు నిత్యం సేవలందేలా సిబ్బంది అందుబాటులో ఉండాలని కోరారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి: సీఐ

కంచరపాలెం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై యువత అప్రమత్తంగా ఉండాలని ఎయిర్ పోర్టు ట్రాఫిక్ సీఐ నిమ్మకాయల శ్రీనివాసరావు సూచించారు. కంచరపాలెం ప్రభుత్వ పాత ఐటీఐ ప్రాంగణంలో, నరవ ఐటీఐలో శుక్రవారం విద్యార్థులకు నేర నియంత్రణ, యువత పాత్రపై అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ సాంకేతికత దృష్ట్యా సెల్‌ఫోన్లకు వచ్చే సందేశాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఊరకనే ఎవరూ డబ్బులు పంపించరని, బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని చెప్పి ఓటీపీ అడిగితే చెప్పవద్దన్నారు. సెల్ ఫోన్లు, బైక్ దొంగతనాలు, రాత్రి సమయంలో ఇళ్లల్లో చోరీలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మత్తు పదార్థాలకు బానిసై యువత నేరాలకు పాల్పడి జీవితాలు నాశనం చేసుకుంటున్నారన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో కష్టపడి చదువుకుని ఉన్నత జీవితాన్ని పొందాలని ఆకాంక్షించారు. అవసరమైనప్పుడు నేరస్తులను పట్టించడంలో పోలీసులకు తమవంతు సహకారం అందించాలని కోరారు. అనుమానితులు కనిపిస్తే 112 నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు.


కంచరపాలెం ఐటీఐ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎయిర్‌పోర్టు ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు

ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

జ్ఞానాపురం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ సిస్టర్ డా.షైజీ ప్రారంభించారు. ద్వితీయ భాషా విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అతిథులుగా హాజరైన అధ్యాపకులు డాక్టర్ నిర్మల, డాక్టర్ ఎస్.దీప్తి, డాక్టర్ కోటేశ్వరరావులు మాతృభాష ప్రాశస్త్యం, ఆంగ్లభాష, రాజభాష ఆవశ్యకత గురించి వివరించారు. అనంతరం విద్యార్థుల సృజనకు పదును పెడుతూ పోటీలు నిర్వహించారు. విజేతలకు ద్వితీయ భాష విభాగ అధ్యక్షులు పి.కె.జయలక్ష్మి ప్రమాణ పత్రాలు అందజేశారు.

'మార్చి 24, 25 తేదీల్లో సమ్మెను విజయవంతం చేయాలి'

సీతమ్మధార, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): బ్యాంక్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మార్చి 24, 25 తేదీల్లో దేశవ్యాప్తంగా నిర్వహించ తలపెట్టిన సమ్మెను విజయవంతం చేయాలని యూఎఫ్‌బీయూ కన్వీనర్ ఆర్.వసంతరావు పిలుపునిచ్చారు. సీతమ్మధారలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. తమ సమస్యలు ప్రస్తావిస్తూ బ్యాంకు ఉద్యోగులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వసంతరావు మాట్లాడుతూ అన్ని బ్యాంకుల్లో ఉద్యోగ నియామకాలు చేపట్టాలని, వారానికి అయిదు రోజుల పని దినాలు అమలు పరచాలని, ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో వర్క్‌మెన్, ఆఫీసర్లు, డైరెక్టర్ల పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మహేంద్ర, ఆదారి శ్రీను, రమేష్, ఈశ్వర్, శ్రీనివాస్, అనిల్, సుజాత, ప్రత్యూష, బ్యాంక్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.


యూనియన్ బ్యాంక్ వద్ద నినదిస్తున్న బ్యాంకు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు

ఆయుష్‌లో పంచాయితీ

» ఆర్డీడీ, జూనియర్ అసిస్టెంట్ మధ్య వివాదం » పరస్పరం ఫిర్యాదులు
» ఉన్నతాధికారులు దృష్టిసారించకపోతే ఈ తరహా వ్యవహారాలు మిగిలిన శాఖలకూ విస్తరించే ప్రమాదం

విశాఖపట్నం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): 'ఆయుష్' శాఖ పరువు రోడ్డునపడింది. తనపై కింది స్థాయి ఉద్యోగి చేయి చేసుకుందంటూ ఉన్నతాధికారిణి, ఉన్నతాధికారిణే తనను కొట్టడం, కులంపేరుతో దూషించారంటూ జూనియర్ అసిస్టెంట్ పరస్పరం పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. మధురవాడలోని చిన్న భవనంలో రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం ఉంది. అందులో రీజనల్ డిప్యూటీ డైరెక్టర్, ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లు, మరో జూనియర్ అసిస్టెంట్, డీఈవో, మరో హెల్పర్ పనిచేస్తున్నారు. అయితే, ఇన్‌చార్జి ఆర్డీడీగా పనిచేస్తున్న అధికారిణి తనను కొట్టారని, కులం పేరుతో దూషించారంటూ అక్కడ పనిచేసే జూనియర్ అసిస్టెంట్ ఒకరు కార్యాలయం బయట ఆందోళనకు దిగారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తనను జూనియర్ అసిస్టెంట్ కొట్టారంటూ పోలీస్ స్టేషన్‌లో సదరు ఇన్‌చార్జ్ ఆర్డీడీ కూడా ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులపై పోలీసులు విచారణ చేపట్టారు. రెండుసార్లు కార్యాలయానికి వచ్చి పలు వివరాలను సేకరించారు.

ఉన్నతాధికారులు దృష్టిసారించాలి..

కార్యాలయంలో జరిగిన వివాదంపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలి. ముఖ్యంగా జిల్లా కలెక్టర్ ఈ వ్యవహారంపై ప్రత్యేకంగా దృష్టి సారించి తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని అదే శాఖలో పని చేస్తున్న ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో ఈ తరహా వ్యవహారాలు మిగిలిన శాఖలకు విస్తరించే ప్రమాదం ఉందంటున్నారు. 'ఆయుష్'లో గొడవపై డిప్యూటీ కలెక్టర్ శేష శైలజ విచారణ జరిపినట్టు చెబుతున్నారు. వివరాలు తెలియాల్సి ఉంది.

26న నీలమ్మ అమ్మవారి పండుగ మహోత్సవం

అల్లిపురం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): అల్లిపురం నీలమ్మ వేప చెట్టు అమ్మవారి జాతర మహోత్సవం ఈ నెల 26న మహాశివరాత్రి రోజున ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ. జీవీ రమాబాయి చెప్పారు. ఈ ఉత్సవాల్లో భాగంగా 25న తొలేళ్ల ఉత్సవం రోజున అమ్మవారికి సారె సమర్పణ, పల్లకి సేవ, అగ్ని గుండం తొక్కడం వంటివి ఉంటాయని పేర్కొన్నారు. 26న ఉదయం 5 గంటల నుంచి అమ్మవారికి క్షీరాభిషేకం, కుంకుమ పూజ,దర్శనాలు ఉంటాయని, సాయంత్రం విద్యుత్ దీపాలంకరణ, సాంస్కృతిక కార్యక్రమాలతో జాతర జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.



టెక్నికల్ ఫెస్ట్‌లో గొన్నా విద్యార్థుల ప్రతిభ

అగనంపూడి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జేఎన్‌టీయూ విజయనగరంలో నిర్వహించిన జాతీయ స్థాయి టెక్నికల్ ఫెస్ట్‌లో గొన్నా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టుకు ద్వితీయ స్థానం దక్కింది. ఈ సందర్భంగా శుక్రవారం వారిని కళాశాల కార్యదర్శి హేమచంద్‌నాయుడు అభినందించారు. ప్రాజెక్టులు రూపొందించి బహుమతుల సాధించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న హేమచంద్ నాయుడు

యథేచ్ఛగా పశువుల సంచారం!

మాధవధార, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మాధవధార, ఉడాకాలనీ ప్రాంతాల్లో పశువుల సంచారం పెరగడంతో నివాసితులు, బాటసారులు ఇబ్బందులు పడుతున్నారు. కొండపక్కగా ఉండే ఉడాకాలనీ, మాధవధార మెయిన్‌రోడ్డు ప్రాంతాలు సహా హైవే రోడ్లపైన పెంపకందారులు తమ పశువులను యథేచ్ఛగా విడిచి పెడుతున్నారు. కాలనీలో ఇళ్ల ముందు పెరటి మొక్కల్ని తినేసి పాడుచేస్తున్నాయని, రోడ్లపై అడ్డంగా ఉంటున్నాయని జీవీఎంసీ పారిశుధ్య సచివాలయాల సిబ్బందికి తరచూ ఫిర్యాదులు అందుతున్నాయి. 48ఎ, 48ఎస్ బస్సులు తిరిగే మెయిన్ రోడ్లలోనూ, మాధవధార హైస్కూలు ప్రాంతాల్లో ఆవులు, గేదెలతో స్థానికులు నిత్యం ఇరకాటంలో పడుతున్నారు. మాధవధార ఆలయ ప్రాంగణంలోనూ పశువుల సంచారం నిత్యకృత్యంగా మారింది.


మాధవధారలో దారిని ఆక్రమించిన పశువులు

దక్షిణ కోస్తా జోన్‌పై చిన్నచూపు

... 5వ పేజీ తరువాయి

భారత రైల్వే ఉద్యోగుల సమాఖ్య (ఏఐఆర్ఎఫ్), రైల్వే ఉద్యోగుల జాతీయ సమాఖ్యలు గుర్తింపు యూనియన్లుగా గౌరవం దక్కించుకున్నాయి. ఇప్పుడు కొత్తగా ఏర్పాటయ్యే జోన్‌లోను, వాటి పరిధిలోని డివిజన్లలోను ఈ యూనియన్లకు అధిక ప్రాధాన్యం లభిస్తుంది. ఆస్తుల పంపకాలు, ఉద్యోగుల బదిలీలు, కొత్త పోస్టులు వంటి విషయాల్లో ఈ సంఘాలు అప్రమత్తంగా వ్యవహరించి ఈ ప్రాంత ప్రయోజనాలు కాపాడాల్సి ఉంది.

యూనియన్లు చాలా కీలకం

రైల్వేలో యూనియన్లు చాలా కీలకంగా ఉంటాయి. వేతన సవరణ, ఉత్పాదకతతో ముడిపడిన బోనస్, వివిధ రకాల భత్యాల పెంపు, రైల్వే క్వార్టర్ల నిర్మాణం, సంక్షేమ కార్యక్రమాల అమలు, పనిభారం తగ్గింపు, పదోన్నతులపై పోరాటం చేస్తూ ఉద్యోగులకు అండగా ఉంటాయి. కాబట్టి ప్రాంతీయ అవసరాలకు అనుగుణంగా ఈ సంఘాలు ఇప్పుడు అన్నీ సమకూర్చుకోవలసి ఉంది. ఇదే సరైన సమయం.

- చలసాని గాంధీ, మాజీ ఉపాధ్యక్షుడు, ఎఐఆర్ఎఫ్

విద్యుత్ లోడు క్రమబద్ధీకరణ

... 5వ పేజీ తరువాయి

రాయితీ ఇవ్వాలని ఏపీఈఆర్‌సీ సూచించింది. మార్చి 1వ తేదీ నుంచి ఇది అమలులోకి వస్తుంది. ఆన్‌లైన్‌లో దీనికి దరఖాస్తు చేసుకోవచ్చు. ఇప్పుడు నగరంలో ఎక్కువ డబుల్ బెడ్ రూమ్ ఫ్లాట్లు, ఇళ్లు ఎక్కువయ్యాయి. ప్రతి గదికి ఏసీ, బాత్రూమ్‌లో గీజర్, కిచెన్‌లో ఓవెన్, గ్రైండర్ వంటివి ఉంటున్నాయి. ఇంకా కొందరు హాలులో కూడా ఏసీ పెట్టుకుంటున్నారు. ఇలాంటి ఇళ్లకు కనీసం 5 కిలోవాట్ల విద్యుత్ లోడ్‌కు సరిపడా ఫీజులు చెల్లించాలి. కానీ చాలా మంది కిలోవాట్, రెండు కిలోవాట్లకే ఫీజులు కట్టి అధిక విద్యుత్ వినియోగిస్తున్నారు. ఇలాంటి వారంతా ఇప్పుడు వారి కనెక్షన్లను వాస్తవ లోడ్‌తో క్రమబద్ధీకరించుకోవచ్చు. వీరు కిలోవాట్ల లెక్కన సెక్యూరిటీ డిపాజిట్‌తో పాటు అదనపు డెవలప్‌మెంట్ ఫీజులు కట్టాలి. ఇందులో ఫీజులో 50 శాతం రాయితీ లభిస్తుంది.

త్వరలో మార్గదర్శకాలు

అదనపు లోడు క్రమబద్ధీకరించాలని ఏపీఈఆర్‌సీ తాజాగా ఆదేశాలు ఇచ్చింది. దీనికి సంబంధించి మార్గదర్శకాలు రావాలసి ఉంది. మార్చి 1వ తేదీ నుంచి అమలులోకి వస్తుంది. దీనికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

- శ్యామ్‌కుమార్, ఎస్ఈ, విశాఖ సర్కిల్

22-ఏ...కష్టాలకు చెల్లు

... 5వ పేజీ తరువాయి

ఉద్యోగులు మూడు దశాబ్దాల క్రితం ప్రభుత్వం నుంచి భూమి కొనుగోలు చేసి లేఅవుట్ వేసుకున్నారు. ఈ లేఅవుట్‌లో కొంత గెడ్డ పోరంబోకు భూమి ఉండడంతో ప్రస్తుతం చాలా భాగం 22-ఎలో ఉంది. అదేవిధంగా మాజీ సైనికులు, స్వాతంత్ర్య సమరయోధులకు ఇచ్చిన భూములకు ఎన్‌వోసీ తీసుకుని లేఅవుట్‌లు వేయగా...పలువురు కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకున్నారు. అయితే మాజీ సైనికుల భూముల విషయంలో కొందరు సిట్‌కు ఫిర్యాదు చేయడంతో 22-ఎలో చేర్చారు. భూములు కొనుగోలు చేసినవారు, ఇళ్లు నిర్మించుకున్నవారు ఇప్పుడు అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. అయితే తాజాగా 22-ఎ భూములపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో జిల్లాలో అనేకమందికి ఊరట లభించనున్నది. నిషేధ భూముల జాబితా నుంచి తమకు మినహాయింపు ఇవ్వాలని సుమారు 350 మంది వరకూ వినతిపత్రాలు సమర్పించారని ఒక అంచనా.

టెన్త్ పరీక్షలకు ఇన్విజిలేటర్ల కొరత

... 5వ పేజీ తరువాయి

పాఠశాలలు మూత పడడం లేదా బోధన కుంటుపడడం జరిగేది. ఈ నేపథ్యంలో పదో తరగతి పరీక్షల నిర్వహణకు ప్రాథమిక పాఠశాలల టీచర్లను సాధ్యమైనంత తక్కువగా నియమించాలని పాఠశాల విద్యా శాఖ నిర్ణయించింది. అందుకే ఎక్కువమంది స్కూలు అసిస్టెంట్లను ఇన్విజిలేటర్లుగా నియమిస్తున్నారు. అదే సమ యంలో ఉన్నత పాఠశాలల్లో ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు బోధనకు ఇబ్బందిలేకుండా చూడాలని డీఈవోలకు ఆదేశాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఇన్విజిలేటర్ల బాధ్యతల నిర్వహణకు అనకాపల్లి జిల్లా నుంచి 290 మందిని పంపాలని కోరినట్టు డీఈవో నిమ్మక ప్రేమ్‌కుమార్ తెలిపారు.

చర్లపల్లి-ధనపూర్ మధ్య ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): విజయనగరం మీదుగా చర్లపల్లి, ధనపూర్ మధ్య ప్రత్యేక రైళ్లు ప్రవేశపెట్టామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. 07749 నంబరు గల రైలు ఈ నెల 22న ఉదయం 9.30 గంటలకు చర్లపల్లిలో బయలుదేరి అదేరోజు రాత్రి 10.55 గంటలకు విజయనగరం, సోమవారం వేకువన 2 గంటలకు ధనపూర్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 07750 నంబరు గల రైలు 22న మధ్యాహ్నం 3.30 గంటలకు ధనపూర్‌లో బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 6.15 గంటలకు విజయనగరం, సోమవారం ఉదయం 8.15 గంటలకు చర్లపల్లి చేరుతుందన్నారు. 07751 నంబరు గల రైలు 23న ఇదే సమయాల్లో చర్లపల్లిలో బయలుదేరి ధనపూర్, తిరుగు ప్రయాణంలో 07752 నంబరుతో ధనపూర్‌లో బయలుదేరి చర్లపల్లి చేరుతుందన్నారు.

కేంద్ర పథకాలపై మత్స్యకారులకు అవగాహన సదస్సు

మహారాణిపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మత్స్యకారులు, మత్స్య అనుబంధ పరిశ్రమలలో పనిచేస్తున్న వారు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మత్స్యశాఖ సహాయ సంచాలకుడు పి.లక్ష్మణరావు సూచించారు. శుక్రవారం మత్స్యశాఖ కార్యాలయంలో ప్రధానమంత్రి మత్స్య కిసాన్ సమృద్ధి సహయోజనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మత్స్యకారుల సంక్షేమానికి అమలు కానున్న పథకాలు, అవకాశాలపై జోనల్ డైరెక్టర్ బామిరెడ్డి వివరించారు. మత్స్యకారులను అసంఘటిత కార్మికులుగా గుర్తించినందున రిజిస్ట్రేషన్ చేయించుకొని కేంద్ర బీమా సౌకర్యం వినియోగించుకోవాలని సూచించారు. పీఎంఎస్ఎస్‌వై, పీఎంఎంకేఎస్‌వై పథకాలను వివరిస్తూ మత్స్యకారుల సలహాలు, సూచనలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్లు డా.మీనా, బిష్ణోమ్, అధికారులు సుజిత్, ఆశాజ్యోతి, మురళి, ఆశా, హనుమంతరావు, బోట్ అసోసియేషన్ ప్రతినిధులు ఎం. లక్ష్మణరావు, ఎం.బాలాజీ, వీర్రాజు, పోతురాజు, పరదేశీ తదితరులు పాల్గొన్నారు.

దుర్గమాంబకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో దుర్గమాంబ

అగనంపూడి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): అగనంపూడి ఉక్కు నిర్వాసిత గ్రామాల ఆరాధ్య దేవత దుర్గమాంబ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు అమ్మవారిని నూతన వస్త్రాలు, పుష్పాలతో అలంకరించారు. భక్తులు పసుపు, కుంకుమలు, చీరలు సమర్పించారు. స్థానిక బొర్రమాంబ పారాయణ సేవా సమితి మహిళలు లలితా, విష్ణుసహస్ర పారాయణం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చిత్తా గణేశ్, పారాయణ సేవా సమితి ఆర్గనైజర్ చిత్తా రామారావు పాల్గొన్నారు.

విజ్ఞాన్‌లో మాతృభాషా దివస్

అగనంపూడి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో స్టూడెంట్ యాక్టివిటీ కౌన్సిల్ (ఎస్ఏసీ) ఆధ్వర్యంలో శుక్రవారం మాతృభాషా దివస్ నిర్వహించారు.ప్రిన్సిపాల్ జె.సుధాకర్ జ్యోతి ప్రజ్వలన చేసి మాతృభాష గొప్పతనాన్ని వివరించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, పోస్టర్ ప్రదర్శన, కవితల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రెక్టార్ వి.మధుసూదనరావు, సతీశ్, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వెంకన్న కల్యాణం

మల్కాపురం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రకాశనగర్ శివరామకృష్ణ ఆలయ ప్రాంగణంలోని వెంకటేశ్వరస్వామి, పద్మావతి, ఆలివేలు మంగమ్మ కల్యాణ మహోత్సవం శనివారం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఉదయం కల్యాణ రాటను వేశారు. శనివారం మధ్యాహ్నం మూడు గంటలకు స్వామివారిని పల్లకిపై ప్రకాశనగర్, మల్కాపురంలో ఊరేగించనున్నారు. అనకాపల్లి, అగనంపూడి, గాజువాక, వెంకన్నపాలెం, రామకృష్ణాపురం తదితర ప్రాంతాల నుంచి కోలాటం, సంకీర్తన బృందాలు పాల్గొంటాయని తెలిపారు.

విధుల్లోకి ఎన్ఏడీ ఉద్యోగులు

ఎన్ఏడీ జంక్షన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఎన్ఏడీ సీజీఎం విధులనుంచి తొలగించిన 36 మంది ఉద్యోగులకు విముక్తి లభించింది. రెండునెలలుపైగా ఉద్యోగులు రిలే నిరాహార దీక్షలు, ధర్నాలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నేవల్ కమాండెంట్ స్పందించడంతో ఉద్యోగులంతా రెండురోజులుగా విధులకు వెళ్తున్నారు. అయినా సీజీఎం పూర్తిస్థాయిలో అనుమతించడం లేదని సమాచారం. ఉన్నతాధికారులు స్పందించటంపై వివిధ యూనియన్ల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సినిమా గైడ్

● డ్రాగన్: జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీకన్య (గాజువాక).

● లైలా: శ్రీ వెంకటేశ్వర-1, రమాదేవి, శ్రీరామా, గోకుల్, కిన్నెర, మోహిని (గాజువాక), మౌర్య (గోపాలపట్నం)

● తండేల్: సంగం, కామేశ్వరి, శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), అన్నపూర్ణ(కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ)

● సంక్రాంతికి వస్తున్నాం: శారద, మెలోడి, జగదాంబ, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)

● డాకు మహారాజ్: శరత్, కిన్నెర, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), గణేష్, సప్తగిరి (తగరపువలస)

● గేమ్ ఛేంజర్: మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (వడ్లపూడి), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 35, టమాటా 11, వంకాయలు(తెలుపు) 20,వంకాయలు (నలుపు) 18, బెండకాయలు 44, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 38, బీరకాయలు 60, ఆనపకాయ16, కాలీఫ్లవర్ 16, క్యాబేజి 12, క్యారెట్ 26 దొండకాయలు 32, బంగాళదుంపలు 14, అరటికాయ 6, మునక్కాడలు (కిలో) 80, అల్లం 52, బరబాటి 36, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 26, దోసకాయలు 26, వెల్లుల్లి 120, కొబ్బరికాయ 25, బీన్స్ 28, కీరదోస 30, కాప్సికమ్ 36, పొట్లకాయ28, చేమదుంపలు 34 చిలగడదుంపలు 36, కంద 64, దేముడు చిక్కుడు 36, గోరుచిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 55, నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడి 30, కర్రపెండలం 20, మామిడి అల్లం 46, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	445
విజయనగరం	449
శ్రీకాకుళం	449

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	75
లైవ్ ధర	95
విత్ స్కిన్	160
స్కిన్‌లెస్	170



గీతాలాపనలో విద్యార్థులు



ఎంపీ శ్రీభరత్‌ను సత్కరించిన చిన్మయ మిషన్ ప్రతినిధులు

విద్యార్థి దశలోనే దేశ భక్తిని పెంపొందించాలి

» ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్

» గాజువాకలో వేలాదిమంది విద్యార్థుల సామూహిక గీతాలాపన

గాజువాక, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే భక్తిభావం అలవడాలని ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్ పేర్కొన్నారు. గాజువాక సర్దార్ నెస్ట్ ఉత్సవ్ ఫంక్షన్‌హాల్‌లో చిన్మయమిషన్, సర్దార్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం వేలాదిమంది విద్యార్థులతో నిర్వహించిన దేశభక్తి, భగవద్గీత పారాయణ కార్యక్రమంలో ఎంపీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సామూహిక గీతాలాపనతో విద్యార్థుల్లో ఆధ్యాత్మికభావం పెంపొంది, సమాజానికి మేలు చేస్తారన్నారు. భవిష్యత్తులో లక్ష మందితో కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. చదువుతో పాటు విద్యార్థుల్లో దైవభక్తిని పెంపొందింపజేసే కార్యక్రమాలను నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ భగవద్గీత శ్లోకాలాపనతో విద్యార్థుల్లో పాజిటివ్ వైబ్రేషన్స్ రావడమే కాకుండా లక్ష్య సాధన దిశగా కృషి చేసే ధైర్యం లభిస్తుదన్నారు. ప్రస్తుత తరంలో దైవభక్తి, దేశభక్తి పెంపొందాలంటే ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తిమాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వలన పిల్లల్లో భక్తిభావం పెరుగుతుందన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ మాట్లాడుతూ భగవద్గీతాలాపన విద్యార్థుల్లో ప్రేరణ కలిగిస్తుందన్నారు. అనంతరం చిన్మయమిషన్ ఆచార్యులు రఘువీరానంద పిల్లలతో సామూహిక భగవద్గీతాలాపన చేయించారు. ఈ కార్యక్రమానికి సర్దార్‌నెస్ట్ అధినేత యార్లగడ్డ వెంకన్న చౌదరి సారథ్యం వహించగా, చిన్మయ మిషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లలో వసతుల కల్పనకు చర్యలు



పెదగంట్యాడలో టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న అధికారులు

పెదగంట్యాడ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక టిడ్కో ఇళ్లను శుక్రవారం ప్రాజెక్టు అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఇళ్లలో నెలకొన్న సమస్యలను నివాసితులను అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ, వ్యవస్థ మెరుగు కోసం తక్షణ చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. టిడ్కో గృహాల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు వెళ్లిన సీపీఐ కార్యదర్శి కసిరెడ్డి సత్యన్నారాయణ కృషిని నివాసితులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో టాటా ప్రాజెక్టు అధికారులు, ఈఈ సుధాకర్, ఏడీఈ రాజేష్ చంద్ర, ఏఈ, కాంట్రాక్టర్ వర్మ, నివాసితులు పి.అప్పలరాజు, ముత్యాలు లక్ష్మి, భాస్కరరావు, హుస్సేన్‌ఖాన్, రహీమా, నాగేశ్వరరావు, రమణి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ,ఎస్టీ పారిశ్రామిక వేత్తలకు అవగాహన సదస్సు



కార్యక్రమంలో పాల్గొన్న శ్రీకాంత్, ప్రసాద్, అనార్‌బాబు

ఆటోనగర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ షెడ్యూలు కులాలు, తెగల హబ్ (ఎన్ఎస్ఎస్‌హెచ్)పథకాలు, జీఈఎమ్ పోర్టల్ రిజిస్ట్రేషన్‌పై పారిశ్రామి కవేత్తలకు ఆటోనగర్ ఎఫ్ బ్లాకులో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హైదరాబాద్‌కు చెందిన బి.శ్రీకాంత్, ఎంఎస్ఎం అధికారి ఎస్ఎల్ఎన్ ప్రసాద్, సంస్థ వ్యవస్థాపకులు అనార్ బాబు జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ , మహిళా పారిశ్రామిక వేత్తలను శక్తిమంతం చేయడం, ప్రభుత్వ పథకాలు, ఆన్‌లైన్ సేవలను సేకరణ, తదితర అంశాలను వివరించారు. పారిశ్రామిక వేత్తలు సందేశాల ను నివృత్తి చేశారు. పరిశ్రమల అభ్యున్నతి కోసం సలహాలు, సూచనలను అం దజేశారు. అనార్‌బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు.

కూరగాయల రైతులకు గిట్టుబాటు ధర కల్పించడమే ధ్యేయం



గోపాలపట్నంలో రైతులకు సూచనలిస్తున్న మార్కెటింగ్ శాఖ కార్యదర్శి పాపారావు



పెందుర్తిలో రైతులతో మాట్లాడుతున్న మార్కెటింగ్ సెక్రటరీ అరుణకుమారి

గోపాలపట్నం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర కల్పిం చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ పి.పాపారావు అన్నారు. స్థానిక రైతుబజారులో రైతులకు పంటల ఉత్పత్తి, విక్రయంపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కూరగాయలు పండించే రైతులు తమ వద్ద రైతుకార్డు లేక రైతుబజారులో విక్రయాలకు ఇబ్బంది పడితే వ్యవసాయ మార్కెట్ కార్యదర్శిని లేదా హార్టికల్చర్ అధికారిని సంప్రదించాలని సూచించారు. గ్రామాల్లో కూరగాయలు, ఆకుకూరలు పండించే రైతులు తమ పంటను దళారులకు విక్రయించకుండా నేరుగా రైతుబజారుల ద్వారా వినియోగదారులకు అమ్మకంగా సాగించేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. రైతు బజారుల్లో అన్ని రకాల కూరగాయలు అందుబాటులో ఉండే విధంగా సమన్వయం చేసుకుంటూ ఎస్టేట్ అధికారులు వ్యవహరించాలన్నారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బజారు ఎస్టేట్ అధికారి ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

రైతుబజార్‌లో నేరుగా టమాటా విక్రయాలు

పెందుర్తి: టమాటా పంట రైతులు నేరుగా రైతుబజార్‌లో విక్రయించుకోవచ్చునని వ్యవసాయ మా ర్కెటింగ్ కమిటీ సెక్రటరీ అరుణకుమారి పేర్కొన్నారు. స్థానిక రైతుబజార్‌ను శుక్రవారం సందర్శించారు. టమాటా ధరలు పతనమవుతున్న క్రమంలోప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని రైతులకు వివరించారు. గిట్టుబాటు ధర కోసం రైతులు నేరుగా రైతుబజార్లలో టమాటా విక్రయించాలని సూచించారు. ఈ కార్య క్రమంలో రైతుబజార్ ఎస్టేట్ అధికారి వీఎస్వీ శర్మిల, సహాయకులు చిన్న పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితేనే ఉత్తమ ఫలితాలు: డీఈవో



రాంపురం ఉన్నత పాఠశాలలోమూల్యాంకన పత్రాలను పరిశీలిస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్

పెందుర్తి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి విద్యార్థులు ప్రణాళికతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఈవో ఎస్.ప్రేమ్ కుమార్ సూచించారు. మండలంలోని రాంపురం జడ్పీ పాఠశాలను గురువారం డీఈవో సందర్శించారు. పదో తరగతి పరీక్షలకు సంబంధించి వంద రోజుల ప్రణాళికపై హెచ్ఎం ఉపాధ్యాయ సిబ్బందితో డీఈవో సమీక్ష చేశారు. పదిలో విద్యార్థుల శతశాతం ఉత్తీర్ణత లక్ష్య సాధన సాధించాలని, ఈ మేరకు వారికి తర్ఫీదు ఇవ్వాలన్నారు. అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన పదో తరగతి విద్యార్థులతో డీఈవో ముచ్చటించారు. పరీక్ష వరకు నిత్య సాధన చేయాలన్నారు డీసీఈబీ మెటీరియల్ అభ్యసించాలని కోరారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఎస్-1లో అధికశాతం మార్కులు పొందిన విద్యార్థులను అభినందించారు. అనంతరం పీహెచ్‌సీ అందజేసిన కంటి అద్దాలను దృష్టిలోపం ఉన్న విద్యార్థులకు డీఈవో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కె.జయప్రసాద్, పీజీటీ వెంకటరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువతను ఉత్తమంగా తీర్చిదిద్దుతున్న ఎన్ఎస్ఎస్

మల్కాపురం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): యువతను బాధ్యతయుతమైన నాయకులుగా తీర్చిదిద్దడంలో ఎన్ఎస్ఎస్ ఎంతో కృషి చేస్తోందని ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రాం అధికారి ఈపీఎస్ బాగ్యలక్ష్మీ పేర్కొన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ఇంటర్మీడియట్ జాతీయ సేవా పథక కార్యకర్తల అభినందన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ గెసిల్లా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కేస్లిన్ ప్రసంగించారు. అనంతరం వలంటీర్లను బహుమతులతో సత్కరించారు.

ఘనంగా మాతృభాషా దినోత్సవం



వేడుకల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): అమ్మ వంటి తెలుగు బాషపై విద్యార్థులు పూర్తి ప్రావీణ్యత సాధించాలని ప్రధానోపాధ్యాయురాలు ఎంఎల్ఎస్ కాంతం అన్నారు. స్థానిక హైస్కూల్‌లో శుక్రవారం జరిగిన మాతృ భాషా దినోత్సవంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యారులు తెలుగు కవులు, రచయితల వేషధారణలో పద్యాలు ఆలపించి, నాటికలు వేసి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణవేణి, వి.శ్రీనివాస్, మహ్మద్ ఇ స్మాయల్ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల తప్పిన పెను ప్రమాదాలు



మారుతీసర్కిల్ వద్ద రోడ్డుపై పడిన భారీ బీమ్



ఆటోనగర్ రాజధాని కాటా వద్ద బోల్తా పడిన ఆటో

సింధియా, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మారుతీ సర్కిల్ సమీపంలోని నూతన బ్రిడ్జి నిర్మాణ పనుల్లో పెను ప్రమాదం తప్పింది. భారీ రెడీమేడ్ బీమ్‌ను సుమారు 100 చక్రాలు కలిగిన వాహనంపై శుక్రవారం తరలిస్తుండగా ఒక్కసారిగా వాహనంపై నుంచి కిందకు జారిపోయింది. పెద్ద శబ్దం రావడంతో వాహనదారులు తీవ్ర భయందోళనకు గురయారు. మార్గం మధ్యలో భారీ వాహనం పడిపోవడంతో రాకపోకలు సాగించే వాహనాలు నిలిచిపోయాయి. మల్కాపురం ట్రాఫిక్ సీఐ షణ్ముఖరావు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు. భారీ బీమ్‌ను తొలగించే అవకాశం లేకపోవడంతో ప్రత్యామ్నాయ మార్గం ద్వారా ట్రాఫిక్‌ను మళ్లించారు.

ఆటోనగర్‌లో ఆటో బోల్తా..

ఆటోనగర్: ఆటోనగర్ రాజధాని కా టా వద్ద శుక్రవారం సాయంత్రం ఓ ఐరన్ రాడ్ల లోడుతో వెళ్తున్న ఆటో బోల్తాపడింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యా యి. ఐరన్ ఊచలన్నీ రోడ్డుపై చెల్లాచెదురయ్యాయి. ఈ రహదారిలో భారీ వాహనాల రాకపోకలతో గోతులు పడుతున్నాయి. దీంతో వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని వాపోతున్నారు. పైప్‌లైన్లు, ఎలక్ట్రికల్ కేబుల్ వైర్ల కోసం తవ్విన గోతులు సక్రమంగా పూడ్చక పోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. దీనికి తోడు వే బ్రిడ్జిల వద్ద రహదారులు అధ్వానంగా మారుతున్నాయి. ఇటీవల కుంచుమాంబ కాలనీకి చెందిన ఓ మహిళ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిందని స్థానికులు చెబుతున్నారు. రహదారులకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

నర్సింగ్ విద్యార్థినులకు ఎమ్మెల్యే పరామర్శ



చికిత్స పొందుతున్న విద్యార్థినిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల

పెందుర్తి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పెందుర్తిలోని వెలంపేట ఇందిర స్కూల్ ఆఫ్ నర్సింగ్ కళాశాల ఫుడ్ పాయిజనింగ్ (కలుషిత ఆహారం) జరిగి తీవ్ర అస్వస్థతకు గురై స్థానిక సీహెచ్‌సీలో కోలుకుంటున్న విద్యార్థినులను గురువారం ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పరామర్శించారు. ఈసందర్భంగా విద్యార్థినుల ఆ రోగ్య పరిస్థితి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులకు ధైర్యం చెప్పి వారి తల్లిదండ్రులను ఓదార్చారు. పూర్తిగా కోలుకున్న వరకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. ఆరోగ్యంనిలకడగానే ఉన్నాదని సీహెచ్‌సీ వైద్యాధికారి అవంతి ఎమ్మెల్యేకి తెలిపారు. ఎమ్మెల్యే వెంట మాజీ మార్కెట్ క మిటీ చైర్మన్ వేగి దివాకర్, అయితి సింహాచలం, గొర్లె అప్పారావు తదితరులు ఉన్నారు.

పైపులైన్ల లీకేజీల నియంత్రణకు చర్యలు

గాజువాక, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): గాజువాక జోనల్ పరిధి లో వాటర్ పైపులైన్ల లీకేజీల నియంత్రణపై అధికారులు దృష్టిసారించి తాగునీరు వృథాగా పోకుండా చర్యలు తీసుకుంటున్నారు. వేసవికాలం ప్రారంభంకావడంతో వార్డుల్లో అరకొరగా తాగునీరు సరఫరా అయ్యే పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో పైపులైన్ల లీకేజీలను అరికడుతున్నారు. ఏ వార్డుల్లో లీకేజీ సమస్య ఉన్నదో గుర్తించి వాటిని నియం త్రణకు చర్యలు తీసుకుంటున్నారు. వా స్తవానికి ఎప్పుడో 20 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన పైపులైన్లు కావడంతో పలు ప్రాంతాల్లో తుప్పు పట్టాయి. దీంతో ఎక్కువ నీటి ఒత్తిడి సమయంలో పైపలైన్లు పగిలిపోతున్నాయి. ఆ సమయం లో తాత్కాలికంగా మరమ్మతులు చేపడుతున్నారు. దీంతో కొద్దిరోజుల పాటు ఎటువంటి ఇబ్బంది తలెత్తడంలేదు. తర్వాత మళ్లీ యథాతథమవుతున్నాయి. పైపులైన్ పగిలిపోయి లీకేజీ ఏర్పడుతోంది. దీనివల్ల పరిసర ఇళ్లకు కుళాయి నీరు తక్కువగా వస్తోంది. సమస్య పరిష్కరించాలని పలు వార్డుల నుంచి అధికారులకు ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ క్రమంలో పైపులైన్ల లీకేజీ స మ స్యను జీవీఎంసీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేందుకు కిందిస్థాయి యంత్రాంగం నిర్ణయించారు.

సమస్యలపై పారిశుధ్య కార్మికుల సమావేశాలు

గాజువాక, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికులు తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ వార్డుల్లో జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వార్డుల్లో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ప్రైవేటు ఏజెన్సీలను, అప్కాస్‌ను రద్దు చేయాలని, ప్రతీనెలా సకాలంలో జీతాలు ఇవ్వాలని, కార్మికులకు పనిముట్లు కేటాయించాలని తదితర సమస్యలు డిమాండ్ చేస్తున్నారు. ఈ సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి గొలగాని అప్పారావు, రాజు, కనకరాజు, సత్యవతి, కార్మికులు పాల్గొన్నారు.

మహిళా భవన్ నిర్మాణానికి భూమి పూజ



పూజ చేస్తున్న కోరమాండల్ డీజీఎం శ్రీనివాసరావు

మల్కాపురం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కోరమాండల్ ఎరువుల కర్మాగారం సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా ములగాడలో మహిళల చేతి వృత్తుల శిక్షణ కోసం ఓ భవన నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. సంస్థ డీజీఎం (హెచ్ఆర్) రెడ్డిపల్లి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గతంలో ఈ గ్రామంలో కోరమాండల్ కంపెనీ నిర్మించిన సామాజిక భవనం పైఅంతస్థులో రూ.19 లక్షలతో మహిళా భవన్ నిర్మిస్తామన్నారు. ఇందులో మహిళలకు చేతి వృత్తుల్లో శిక్షణ ఇస్తామన్నారు. పిలకవానిపాలెంలోనూ మరో భవనం నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కోరమండల్ సీఎస్ఆర్ డిప్యూటీ మేనేజర్ శేషపు వెంకటరమణ, టీడీపీ వార్డు అధ్యక్షుడు కోరాడ శ్రీనివాసరావు, ధర్మాల వేణుగోపాల్‌రెడ్డి, చుక్క కనకరెడ్డి పాల్గొన్నారు.

వైసీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా బలిరెడ్డి



బలిరెడ్డి నాగేశ్వరరావు

అగనంపూడి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): వైసీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా అగనంపూడికి చెందిన బలిరెడ్డి నాగేశ్వరరావును నియమిస్తూ పార్టీ అధిష్ఠానం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. అగనంపూడి ప్రాంతంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న నాగేశ్వరరావుకు పదవి అప్పగించడం పట్ల కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. తనకి బాధ్యతలు అప్పగించిన పార్టీ అధినేత జగన్, మాజీ మంత్రి అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే నాగిరెడ్డి, ఇన్‌చార్జి దేవన్‌రెడ్డిలకు నాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

'ఎమ్మెల్సీ ఎన్నికల్లో రఘువర్మను గెలిపించండి'



ప్రచారం చేస్తున్న నల్లూరు సూర్యనారాయణ

కూర్మన్నపాలెం,ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పాకలపాటి రఘువర్మను అత్యధిక ఓట్లు వేసి గెలిపించాలని చోడవరం ఎన్నికల పరిశీలకుడు, టీడీపీ 86 వార్డు ఇన్‌ఛార్జి నల్లూరు సూర్య నారాయణ కోరారు. ఈ మేరకు పలు పాఠశాలలను సందర్శించి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

గోపాలపట్నం పరిధిలో 790 మంది టీచర్ ఎమ్మెల్సీ ఓటర్లు

ఎన్ఏడీ జంక్షన్: టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలకు గోపాలపట్నం మండలం పరిధిలో ఉన్న రెండు పోలింగ్ కేంద్రాల్లో 790 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నట్టు తహసీల్దార్ సీహెచ్ రమేశ్ పేర్కొన్నారు. గోపాలపట్నం హైస్కూల్ కేంద్రంలో 173 మంది పురుష, 196 మంది మహిళా ఓటర్లు పాలిటెక్నిక్ సెంటర్‌లో 166 మంది పురుషులు, 255మంది మహిళా ఓటర్లు ఉన్నట్టు తెలిపారు. ఈ నెల 27న జరిగే పోలింగ్‌లో వీరంతా ఓటు వేస్తారన్నారు.

నెట్‌బాల్ పోటీల్లో కణితి విద్యార్థి ప్రతిభ

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా రావులపాలెంలో ఈ నెల 16, 17న జరిగిన రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలలో కణితి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి నితీశ్ రాణించి ద్వితీయ స్థానంలో నిలిచాడు. శుక్రవారం హెచ్ఎం సూర్యప్రకాశ్, వ్యాయామోపాధ్యాయులు ఎం.మున్నాజీ, నారాయణరావు నితీశ్‌ను అభినందించారు. ఈ నెల 23, 24న హర్యానాలో జరగనున్న జాతీయ క్రీడలలోనూ సత్తా చాటాలన్నారు.

క్షతగాత్రుడికి ఆర్థిక సాయం

అగనంపూడి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం ఢీకొని తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తలారి సాయి మహర్షిని ఆదుకునేందుకు దాతలు ముందుకొచ్చారు. సమాచార హక్కు చట్టం ఉద్యమకర్త పట్టా రామాఅప్పారావు దాతల సాయంతో సమకూర్చిన రూ.50 వేలు శుక్రవారం బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. దాతలు ముందుకు వచ్చి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేడిశెట్టి ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

86వ వార్డులో ఆక్రమణల తొలగింపు

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 86వ వార్డు రాజీవ్ నగర్ దరి శ్రీలక్ష్మి గణపతి నగర్‌లో దువ్వాడ సర్వే నంబరు 121లో అనధికారంగా నిర్మించిన నిర్మాణాలను జేసీబీ సాయంతో శుక్రవారం జీవీఎంసీ అధికారులు తొలగించారు. నిబంధనలకు వి రుద్ధంగా భవనాలు నిర్మించినా, ప్రభుత్వ స్థలాల ఆక్రమణకు పాల్పడినా, స్థలాలకు డబుల్ రిజిస్ట్రేషన్లు, క్రయ, విక్రయాలు జరిగినట్టు ఫిర్యాదులు వచ్చినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మత్స్య సంపద వృద్ధికి
సముద్రంలో కృత్రిమ ఆవాసాలు

సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ సూచనలతో దేశవ్యాప్తంగా ఏర్పాటు



(విశాఖపట్నం, భీమునిపట్నం రూరల్-ఆంధ్రజ్యోతి)

సముద్రంలో పెరుగుతున్న కాలుష్యం, వ్యర్థాల కారణంగా మత్స్య సంపద తగ్గిపోతోంది. ఈ నేపథ్యంలో మత్స్య సంపదను పెంచేందుకు సెంటర్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (సీఎంఎఫ్ఆర్ఐ) సూచనల మేరకు కాంక్రీట్‌తో తయారుచేసిన ఆర్టిఫీషియల్ రీఫ్‌లను (కృత్రిమ ఆవాసాలు) ఏర్పాటు చేయబోతున్నారు. ఇప్పటికే మహారాష్ట్ర, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో ఈ రీఫ్స్ ఏర్పాటుచేశారు. ఏయూలోని జియో ఫిజిక్స్ డిపార్టుమెంట్ వజ్రోత్సవ వేడుకల్లో ఫిషరీస్ సర్వే ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఐ) ఈ ఆర్టిఫీషియల్ రీఫ్స్‌కు సంబంధించిన నమూనాలను ప్రదర్శించింది. వీటి గురించి ఎఫ్ఎస్ఐ అధికారులు భామిరెడ్డి, జేపీఏ ప్రసాద్ వివరించారు.



చేపల నివాసానికి కాంక్రీటుతో తయారు చేస్తున్న ఆవాసాలు

» ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో అనువైన ప్రాంతాల కోసం అన్వేషణ

కేంద్ర సముద్ర మత్స్య పరిశోధన సంస్థ (సి.ఎం.ఎఫ్.ఆర్.ఐ) సముద్ర గర్భంలో ఆర్టిఫీషియల్ రీఫ్‌లు (కృత్రిమ ఆవాసాలు) ఏర్పాటుచేసే విధానాన్ని అమలు జరుపుతోంది. మత్స్య సంపద విస్తారంగా లభించడానికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఈ సంస్థ అందిస్తోంది. తమిళనాడులో చేపల కృత్రిమ ఆవాసాలను ఏర్పాటు చేసి మంచి ఫలితాలను సాధించింది. మొదట ఐదు ప్రాంతాల్లో ఏర్పాటుచేస్తే నాలుగు రెట్లు చేపల ఉత్పత్తి పెరిగినట్టు పరిశోధకులు గుర్తించారు. ఈ విషయం మన రాష్ట్ర మత్స్య శాఖ ఉన్నతాధికారులు తెలుసుకుని సముద్ర తీరానున్న ప్రాంతాల్లో ఈ ఆవాసాలను ఏర్పాటు చేసే ఆలోచనలు చేస్తున్నారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని భీమిలి మండలం అన్నవరం నుంచి పాయకరావుపేట వరకూ ఆవాసాల ఏర్పాటుకు అనుకూలమైన ప్రాంతాల కోసం అన్వేషిస్తున్నారు.



సముద్రగర్భంలో ప్రవాహం ఉన్న ప్రాంతంలో ఏర్పాటు చేసిన చేపల ఆవాసం

కృత్రిమ ఆవాసాలు ఎలా అమరుస్తారంటే...

సముద్ర తీరం నుంచి ఒక కిలోమీటరు పరిధిలో మినీ ట్రాలర్లు, ఇతర మర పడవలు చేపల వేట సాగించవు. అందువల్ల అటువంటి ప్రాంతాలలోనే ఈ ఆవాసాలను ఏర్పాటుచేస్తారు. ఒక్కో రీఫ్ టన్ను బరువు ఉంటుంది. వీటిని ఐదు నుంచి ఏడింటిని నౌకలతో తీసుకువెళ్లి ఒకేచోట డంప్ చేస్తారు. నీటి కింద ఈ ఆవాసాలను ఏర్పాటుచేస్తే చేపల వృద్ధికి ఢోకా ఉండదని అధికారులు చెబుతున్నారు. ఇందుకోసం కాంక్రీట్‌తో వేర్వేరు రూపాల్లో ఆర్టిఫీషియల్ రీఫ్‌లను రూపొందిస్తారు. వాటికి అన్ని వైపులా రంధ్రాలను పెట్టి సముద్ర గర్భంలో 20 మీటర్ల లోతున అమరుస్తారు. ఒక్కో ఆవాసం తయారు చేసి నీటిలో అమర్చడానికి రూ.15 లక్షలు ఖర్చవుతుందని అధికారులు అంచనా వేశారు. చేపలు ఈ ఆవాసాల గోడలపై గుడ్లు పెట్టి సంతానాన్ని అభివృద్ధి చేయడానికి ఎంతో అనువుగా ఉంటాయని అధికారులు అంటున్నారు. చేపలకు కావాల్సిన సహజ సిద్ధమైన ఆహారం నాచు, చిన్న చిన్న మొక్కలు ఏర్పాటు చేస్తారు. చేపలు పెరిగి పెద్దవైన తర్వాత ఆ పరిసర ప్రాంతాలలోనే స్వేచ్ఛగా తిరుగుతుంటాయి. ఈ ఆవాసాలు ఏ ప్రాంతంలో ఏర్పాటుచేస్తారో ఆ పరిసర గ్రామాల మత్స్యకారులకు ఇప్పుడు లభిస్తున్న చేపల కంటే నాలుగు రెట్లు అధికంగా లభిస్తాయి. ఈ ఆవాసాలను భీమిలి, అచ్యుతాపురం, రాంబిల్లి, నక్కపల్లి, తదితర మండలాల్లో ఏర్పాటుచేసే ప్రతిపాదనలు ఉన్నాయి.

రైల్వే ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి డిమాండ్



డీఆర్ఎం కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న శ్రామిక్ యూనియన్ సభ్యులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని తూర్పుకోస్తారైల్వే శ్రామిక్ యూనియన్ వాల్తేరు డివిజన్ శాఖ ఉద్యోగులు శుక్రవారం డీఆర్ఎం కార్యాలయం సమీపంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా డివిజనల్ కో-ఆర్డినేటర్ పి.రామ్మోహనరావు మాట్లాడుతూ ఓపీఎస్‌తో సమానంగా యూపీఎస్‌లో అన్ని ప్రయోజనాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఓపెన్ లైనులో పనిచేసేవారందరికీ ప్రమాద భత్యం ఇవ్వాలని, ట్రాక్ నిర్వహణదారులకు పదోన్నతి అవకాశాలు కల్పించాలని, రాత్రి వేళ రైలుమార్గాలను పరిశీలించేవారికి నిడివి 20 కి.మీ. నుంచి 12 కి.మీ.లకు తగ్గించాలని, నిలిపివేసిన డీఏ, డీఏ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్రేడ్ పే తో సం బంధం లేకుండా నాన్ గెజిటెడ్ ఉద్యోగులకు రాత్రి భత్యం చెల్లించాలని, ఖాళీ లు సరెండర్ చేసే విధానాన్ని నిలిపివేయాలని, ఉద్యోగుల పిల్లల ఉన్నత విద్యకు భత్యాన్ని చెల్లించాలని, పదోన్నతులు కల్పించాలని, ఉద్యోగ విరమణ సమయంలో సెలవు నగదు చెల్లింపులకు సంబంధించి 300 రోజుల సీలింగ్ పరిమితిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ 50 అంశాల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని డీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహుకు అందజేశారు.

గ్రూప్ 2 అభ్యర్థుల ఆందోళన



గ్రూప్-2 పోస్టుల భర్తీకి సంబంధించి రోస్టర్ విధానాన్ని సవరించాలని కోరుతూ శుక్రవారం రాత్రి ఎంవీపీ సర్కిల్ వద్ద మెయిన్స్‌కు అర్హత సాధించిన అభ్యర్థులు ఆందోళన నిర్వహిస్తున్న దృశ్యం

23న జిల్లా సీనియర్ హాకీ జట్టు ఎంపికలు

విశాఖపట్నం స్పోర్ట్స్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా సీనియర్ పురుషుల హాకీ జట్టు ఎంపికలు ఈ నెల 23న సాలిగ్రామపురం హాకీ గ్రౌండ్‌లో జరుగుతాయని హాకీ సంఘం కార్యదర్శి కేవీ ఆంజనేయరావు తెలిపారు. 20 నుంచి 35 ఏళ్ల మధ్య వయసున్న ఆసక్తి గల క్రీడాకారులు సాయంత్రం 3.45 గంటలకు సాలిగ్రామపురం హాకీగ్రౌండ్‌లో వయసు ధ్రువీకరణ పత్రంతో హాజరుకావాలన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైనవారు మార్చి 6 నుంచి గుంటూరులో జరిగే రాష్ట్ర స్థాయి హాకీ టోర్నీలో విశాఖ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. వివరాలకు 98851 99535 నంబరులో సంప్రదించాలన్నారు.

మాతా, శిశు మరణాల నియంత్రణపై దృష్టి సారించాలి

» కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్

విశాఖపట్నం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాతా, శిశు మరణాల నియంత్రణపై దృష్టిసారించాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులతో నిర్వహించిన అడ్వైజరీ కమిటీ సమావేశంలో మాట్లాడుతూ మరణాల నివారణకు మూడు నెలల ప్రణాళికను సిద్ధంచేయాలన్నారు. ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల సిబ్బంది అంకితభావంతో పనిచేయాలన్నారు. క్లిష్టతరమైన ప్రసవాలకు సంబంధించిన కేసులు వస్తే రిఫరల్ ఆస్పత్రులకు పంపించాలన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించే ఏఎన్ ఎం, ఆశాకార్యకర్తలు, గర్భిణులను గుర్తించి వారికి తక్షణమే వైద్య సేవలను అందించాలన్నారు. హై రిస్క్ జాబితాలోని గర్భిణులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. అధికశాతం సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. కేజీహెచ్‌లో మెరుగైన సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి. జగదీశ్వరరావు మాతా, శిశు మరణాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో కేజీహెచ్ గైనాకాలజీ వైద్యులు డాక్టర్ సంధ్యాదేవి, పిల్లల విభాగాధిపతి డాక్టర్ చక్రవర్తి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ లూసీ, డీపీఎంవో డాక్టర్ బి.ఉమావతి, ఐసీడీఎస్ పీడీ ఎస్.జయదేవి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

జీబీఎస్‌కు కేజీహెచ్‌లో అధునాతన చికిత్స

» అంటువ్యాధికాదు.. నరాల సమస్య
» కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద వివరణ

మహారాణిపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): గుయిలియన్ బారే సిండ్రోమ్ (జీబీఎస్) అంటువ్యాధి కాదని, ఇది నరాల సమస్య అని, దీనిపై ఆందోళన చెందవద్దని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద అన్నారు. ఈ వ్యాధి సోకిన వారికి కేజీహెచ్‌లో అధునాతన వైద్యం అందుబాటులో ఉందని భరోసా ఇచ్చారు. జీబీఎస్‌పై ప్రజల్లో పెరుగుతున్న ఆందోళనలు గుర్తించి ఆయన వివరణ ఇచ్చారు. ఆంధ్ర వైద్య కళాశాల, కింగ్‌జార్జ్ ఆసుపత్రి అధ్యాపకులు, పీజీ వైద్య విద్యార్థులు, జూనియర్ వైద్యులకు శుక్రవారం కేజీహెచ్‌లో అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎస్.గోపి ద్వారా ఈ వ్యాధికి కారణం, క్లినికల్ ప్రెజెంటేషన్, డయాగ్నొస్టిక్ విధానాలు, సమకాలీన చికిత్సా విధానం, ఇతర కీలక అంశాలపై సమగ్ర వివరణ ఇప్పించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద మాట్లాడుతూ కరోనా మాదిరి ఇది అంటువ్యాధి, వైరస్ కాదన్నారు. రోగ నిరోధక వ్యవస్థలో తేడా వల్ల నాడీ వ్యవస్థ పైపొర దెబ్బతినడం వల్ల వస్తుందని పేర్కొన్నారు. ఈ వ్యాధి సోకినవారిని గుర్తించడానికి కేజీహెచ్‌లో అవసరమైన సదుపాయాలు ఉన్నాయని తెలిపారు. భవిష్యత్తులో జీబీఎస్ కేసులు పెరిగే అవకాశం ఉన్నందున వైద్యులు అధునాతన చికిత్సా విధానంతో నయం చేయగలరని పేర్కొన్నారు.



శిక్షణకు హాజరైన వైద్యులు, మాట్లాడుతున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ శివానంద

గువ్వలు గూటికి చేరే వేళ...



అప్పటి వరకు ఆ చెట్టుపై సవ్వడి చేస్తూ, సేదతీరుతూ ఆహారాన్ని ఆరగించిన పక్షులు కిలకిలారావాలతో సందడి చేశాయి. సూర్యాస్తమయ సమయంలో భానుడు పశ్చిమ దిక్కున ఒరుగుతున్న వేళ... ఒక్కసారిగా రెక్కలు విప్పుకుని గూటికి చేరేందుకు సన్నద్ధమయ్యాయి. ఒకవైపు అస్తమిస్తున్న సూర్యుడు.. మరోవైపు గూటికి చేరేందుకు సమాయత్తమవుతున్న పక్షుల సుందర దృశ్యం శుక్రవారం సిరిపురం సమీపంలో ఆవిష్కృతమయింది.
(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

క్రైం... crime news

కత్తితో ముసుగుదొంగ హల్‌చల్

» యువకుడిపై దాడి, ప్రతిఘటించడంతో పరార్
» పోలీసులకు బాధితుడి ఫిర్యాదు



గాయపడ్డ దుర్గాప్రసాద్

పెందుర్తి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ముసుగు ధరించిన ఓ వ్యక్తి ద్విచక్రవాహనంపై వచ్చి యువకుడిపై దాడిచేశాడు. ఈ ఘటన సుజాతనగర్ 80 అడుగుల రోడ్డులో జరిగింది. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పెందుర్తిలో బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్న దుర్గాప్రసాద్ (21) గురువారం రాత్రి పది గంటల సమయంలో సుజాతనగర్ 80 అడుగుల రోడ్డులోని తన ఇంటికి వెళ్లే క్రమంలో ఏటీ ఎం సెంటర్‌కు వెళ్లి తన తమ్ముడుకి నగదు బదిలీ చేశాడు. అనంతరం ఫోన్ లో బ్యాలెన్స్ చూసుకుంటూ ఇంటికి వెళ్తుండగా అదే మార్గంలో ముసుగు ధరించి బైక్‌పై వచ్చిన ఆగంతకుడు అడ్డగించాడు. ఫోన్ ఇవ్వమనడంతో మోకానిక్ ఇవ్వనన్నాడు. దీంతో కత్తి తీసి అతడి చేతిపై తీవ్రంగా గాయపరిచాడు. తేరుకున్న దుర్గాప్రసాద్ ప్రతిఘటించడంతో ఇద్దరి మధ్య పెనుగులాట జరిగింది. దీంతో ఆగంతకుడు దుర్గాప్రసాద్ గుండెపై కత్తితో దాడికి యత్నించగా తప్పించుకున్నాడు. అనంతరం ఆగంతకుడు పరారయ్యాడు. బాధితుడు దుర్గాప్రసాద్ పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ కేవీ సతీశ్‌కుమార్ సంఘటనాస్థలాన్ని సందర్శించి,కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వే స్టేషన్‌లో గంజాయి పట్టివేత

విశాఖపట్నం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తి వద్ద నుంచి రూ.45 వేలు విలువ చేసే తొమ్మిది కిలోల గంజాయి సంచులను స్వాధీనం చేసుకున్నామని రైల్వే పోలీసులు తెలిపారు. శుక్రవారం స్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తుండగా తమిళనాడుకు చెందిన కె.సూర్యప్రకాష్ అనే నిందితుడు చెన్నైకు గంజాయి రవాణా చేస్తూ పట్టుబడ్డాడని పేర్కొన్నారు. కేసు నమోదు చేసి నిందితుడ్ని కోర్టులో హాజరుపరిచామన్నారు.

చిట్టీల పేరుతో టోకరా

» బాధితుల ఫిర్యాదు
» దంపతులను అరెస్టు చేసిన పోలీసులు

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం చిట్టీల పేరుతో మోసం చేసిన వారిపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దంపతులను అరెస్టు చేయగా, మరో మహిళ పరారయింది. దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. జీవీఎంసీ 87వ వార్డు కణితి కాలనీ గవరవీధికి చెందిన కొయిలాడ భారతి, వెంకట రెడ్డి, సౌజన్యలత శ్రావణమాసం చిట్టీల పేరుతో 70 మంది నుంచి సుమారు రూ.42 లక్షలు వసూలు చేశారు. అయితే గడువు ముగిసినా నగదు తిరిగి చెల్లించకపోవడం, అడిగితే తీవ్ర ఇబ్బందులకు గురిచేయడంతో కణితికి చెందిన కాండ్రేగుల లక్ష్మీకుమారి, నళినితో పాటు వడ్లపూడికి చెందిన మరికొందరు బాధితులు శుక్రవారం దువ్వాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు బాధ్యులైన దంపతులు భారతి, వెంకటరెడ్డిలపై 420 చీటింగ్ కేసు నమోదు చేసి, అరెస్టు చేశారు. కాగా మరో మహిళ సౌజన్యలత పరారీలో ఉందని, ఆమెకోసం గాలిస్తున్నామన్నారు.

భూముల ట్యాంపరింగ్‌పై విచారణ వాయిదా

విశాఖపట్నం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): విశాఖ రూరల్ మండలం మధురవాడలో సర్వేనంబర్లు 367, 368, 369, 370, కొమ్మాది, పరదేశిపాలెంలో ప్రభుత్వ భూములు రికార్డుల ట్యాంపరింగ్ ఉదంతంపై శనివారం జాయింట్ కలెక్టర్ నిర్వహించాల్సిన విచారణ వాయిదా పడింది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత విచారణ చేపట్టనున్నారు. రికార్డుల ట్యాంపరింగ్‌లో నలుగురు డిప్యూటీ కలెక్టర్లు, ముగ్గురు డిప్యూటీ తహసీల్దార్లకు ఆరు రోజుల క్రితం షోకాజ్ నోటీసులు జారీచేసిన విషయం తెలిసిందే. కాగా మధురవాడ, కొమ్మాది, పరదేశిపాలెంలో ప్రభుత్వ భూమి రికార్డులు స్కానింగ్ చేసే సమయంలో రికార్డులు ట్యాంపరింగ్ జరిగినట్టు చాలాకాలం క్రితమే ఉన్నతాధికారులు గుర్తించి విచారణ చేపట్టారు. రెండు పర్యాయాల విచారణ నివేదికలపై రెండేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం స్పందించి ఏడుగురు అధికారులపై చర్యలకు ఉపక్రమించింది. ఈ నేపథ్యంలో వారికి షోకాజ్ నోటీసులు జారీచేశారు.

నేడు కోరమాండల్ క్లబ్‌లో జాబ్‌మేళా

మల్కాపురం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కోరమాండల్ ఎరువుల కర్మాగారం ఆధ్వర్యంలో శనివారం శ్రీహరిపురం కోరమాండల్ రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో ఉద్యోగ మేళా నిర్వహించనున్నారు. గ్రోమోర్ డ్రైవ్ పేరుతో ఉద్యోగాల ఎంపిక నిర్వహిస్తున్నారు. డిప్లమో, ఇంటర్, ఏదైనా డిగ్రీ, పోస్టుగ్రాడ్యుయేషన్, బీఎస్సీ అగ్రికల్చర్, ఇంజనీరింగ్, డీజీసీఏ, పైలెట్ సర్టిఫికెట్ కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చని తెలిపారు.

అబ్బురపరిచిన కూచిపూడి నృత్యం



తారకాసుర సంహరణ నృత్య రూపకంలో ఓ సన్నివేశం

మద్దిలపాలెం, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి) పిఠాపురంకాలనీ కళాభారతి ఆడిటోరియంలో శుక్రవారం వంద మంది కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ప్రేక్షకులను కట్టిపడేసింది. కూచిపూడి కళాక్షేత్ర 40వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన తారకాసుర సంహరణ నృత్య రూపకం సమ్మోహనపరిచింది. వంద మంది కళాక్షేత్ర విద్యార్థుల కూచిపూడి నాట్య అరంగేట్రం రంజింపజేసింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏపీ కల్చరల్ కమిషన్ చైర్మన్ తేజస్విని మాట్లాడుతూ విద్యార్థులు కళలపై దృష్టిసారించాలన్నారు. ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ వీసీ డాక్టర్ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ కళలే సంస్కృతికి పట్టుగొమ్మలన్నారు. కార్యక్రమంలో కూచిపూడి కళాక్షేత్ర అధ్యక్షుడు సూరపనేని విజయకుమార్, ఉపాధ్యక్షుడు శ్రీధర్‌మిత్ర, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, శైలజ, కన్నం వెంకటరమణారావు, మధుసూదనరావు, విక్రమ్ గౌడ్ పాల్గొన్నారు.

శాకంబరిగా దర్శనమిచ్చిన దుర్గాలమ్మ



పూర్ణామార్కెట్‌లో శాకంబరిగా దర్శనమిస్తున్న దుర్గాలమ్మ

జగదాంబ కూడలి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పూర్ణామార్కెట్ దుర్గాలమ్మ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారు శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజాము నుంచి భక్తులు క్యూ కట్టారు. అమ్మవారికి ప్రత్యేకాభిషేకాలతో పాటు గోత్రనామార్చనలు నిర్వహించారు. ఉత్సవ విగ్రహానికి ముత్తయిదువలు కుంకుమార్చనలు చేశారు. దుర్గమ్మ మాలధారణ వేసిన భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఈవో శేఖర్‌బాబు పర్యవేక్షించారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తలేదు. కాగా శనివారం అమ్మవారు పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.